అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శుక్రవారం 27-01-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 8 | సంచిక : 26 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50

రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే దేశభక్తికి ప్రతీక

సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి



న్యూఢిల్లీ : రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే దేశభక్తికి ప్రతీక అని సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయన సోషల్ మీడియాలో ఒక వీడియోను విడుదల చేశారు. " భారత రాజ్యాంగం అందరికీ సమన్యాయం కల్పిస్తున్నది. దీంతో పాటు సమైక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తున్నది. మనకు ఉన్న హక్కులు, బాధ్యతలు, మౌలిక అధికారాలను వినియోగించుకునేందుకు వీలుగా రాజ్యాంగం రూపకల్పన జరిగింది. అన్ని వర్గాలకూ న్యాయం దక్కేలా లిఖించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లోనూ సమానంగా ఉండాలని స్పష్టంగా ప్రస్తావించింది. అయితే ...5లో



గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న రాష్ట్రపతి ముర్ము

ఘనతంత్రం

అట్టహాసంగా 74వ రిపబ్లిక్ వేడుకలు

- ముఖ్య అతిథిగా ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫట్టా ఎల్-సిసి
- సైనిక శక్తిని ప్రదర్శిస్తూ త్రివిధ దళాల కవాతు
- ప్రధాన ఆకర్షణగా నారీ శక్తి, అగ్ని వీరులు
- 17 శకటాల ప్రదర్శన
- ఢిల్లీలో కనులపండువగా కర్తవ్యపథ్

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా 74వ గణతంత్ర దినోత్సవాలు జరిగాయి. దేశంలోని విభిన్న సంస్కృతులను చాటేలా దేశ రాజధాని ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో శకటాల ప్రదర్శన జరిగింది. సైనిక శక్తిని ప్రదర్శిస్తూ త్రివిధ దళాలు కవాతును నిర్వహించాయి. వీటిల్లో నారీ శక్తి, అగ్ని వీరులు ప్రధాన ఆకర్షణగా నిలిచారు. 17 శకటాలు ప్రదర్శించారు. దేశ రాజధాని ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో జరిగిన వేడుకల్లో అనేక రికార్డులు నమోదయ్యాయి. రక్షణ దళాల్లో నియామకాల కోసం కేంద్రం ప్రవేశపెట్టిన అగ్నివీర్ పథకం కింద నియమితులైన అగ్నివీరులు మొట్టమొదటిసారి గణతంత్ర దినోత్సవాల కవాతులో పాల్గొన్నారు. గతంలో రాజ్‌పథ్‌గా పిలిచిన మార్గానికి ఇప్పుడు కర్తవ్యపథ్ అని పేరు పెట్టారు. ఈ పేరు పెట్టిన తరువాత తొలిసారి ఇక్కడ కవాతు జరిగింది. స్వయం సమృద్ధ భారత్ పథకంలో భాగంగా మన దేశంలోనే తయారు చేసిన 105 ఎంఎం లైట్ ఫీల్డ్ గన్స్‌తో 21సార్లు పేల్చి గౌరవ వందనం చేశారు. ఈ తుపాకులతో గౌరవ వందనం చేయడం ఇదే తొలిసారి. గణతంత్ర వేడుకలకు ముఖ్య అతిథిగా ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫట్టా ఎల్-సిసి హాజరయ్యారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఈజిప్టు నేతను ఆహ్వానించడం ఇదే మొదటిసారి కావటం గమనార్హం. ఆ దేశ సైన్యం గణతంత్ర దినోత్సవాల కవాతులో పాల్గొన్నది. ఇది కూడా మొదటిసారే. శకటాల ప్రదర్శనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ "ప్రభల తీర్థం - మకర సంక్రాంతికి వ్యవసాయదారుల పండుగ" అనే ఇతివృత్తంతో శకటాన్ని ప్రదర్శించింది.

ఒడిశా సంస్కృతిని ప్రతిబింబించేలా

ద్రౌపది ముర్ము రాష్ట్రపతి హోదాలో గణతంత్ర దినోత్సవాల్లో పాల్గొనడం ఇదే ప్రథమం. ఈ సందర్భంగా ఆమె తన స్వరాష్ట్రమైన ఒడిశా సంస్కృతిని ప్రదర్శించే విధంగా ఆ రాష్ట్రంలో తయారైన టెంపుల్ బోర్డర్ గల పట్టుచీరను ధరించారు.

ఒంటెల దళంతో మహిళల కవాతు

ఒంటెల దళంతో మహిళలు కవాతు నిర్వహించడం ఇదే మొదటిసారి. వీరు బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్)కు చెందినవారు. సోనాల్, నిషా, భగవతి, అంబిక, కుసుమ్, ప్రియాంక, కౌసల్య, కాజల్, భావన, హీనా తదితరులు ఈ దళంలో ఉన్నారు. అందరూ మహిళలే ఉన్న సీఆర్పీఎఫ్-పీస్‌కీపర్స్ ఆఫ్ ది నేషన్ కంటింజెంట్ కూడా కవాతు నిర్వహించింది. దీనికి అసిస్టెంట్ కమాండెంట్ పూనమ్ గుప్తా నాయకత్వం వహించారు. ఉమెన్ ఆర్మ్‌డ్ పోలీస్ బెటాలియన్ ఏర్పాటవడం ప్రపంచంలో ఇదే తొలిసారి.

ఎన్సీబీ శకటం ప్రదర్శన

మాదక ద్రవ్యాల నియంత్రణకు కషి చేస్తున్న నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ) మొట్టమొదటిసారి ఓ శకటాన్ని ప్రదర్శించింది. మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారడానికి వ్యతిరేకంగా ఈ శకటాన్ని తీర్చిదిద్దింది. 35 మంది మహిళా కానిస్టేబుళ్ళతో ఢిల్లీ పోలీస్ ఉమెన్ పైప్ బ్యాండ్ ఈ కవాతులో పాల్గొనడం కూడా ఇదే మొదటిసారి. ప్రధాని మోడీ వర్ణరంజితమైన తలపాగాను ధరించారు. పొడవైన వస్త్రం వేలాడే విధంగా అనేక రంగులతో కూడిన ఈ రాజస్థానీ తలపాగా అంతరార్థం ఏమిటని చాలా మంది ఆసక్తిగా చూశారు. తెల్లని కుర్తా, ప్యాంట్స్, ఆ పైన నల్లని కోటు ధరించిన మోడీ రంగు రంగుల తలపాగాను ధరించారు.



అమర జవాన్ల త్యాగాలు మరువలేం

సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో స్మారక స్థూపానికి సీఎం కేసీఆర్ నివాళి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశం కోసం అమర జవాన్లు చేసిన త్యాగాలను సీఎం కేసీఆర్ స్మరించుకున్నారు. 74వ భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు గురువారం ప్రగతిభవన్‌లో జాతీయ ...5లో



పట్టించుకోలేదు.. ప్రసంగ పాఠాన్ని పంపలేదు...

గవర్నర్ తమిళి సై ఆవేదన

- రాజ్‌భవన్‌లో ఘనంగా గణతంత్ర వేడుకలు ...సీఎస్, డీజీపీ హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'గణతంత్ర వేడుకల విషయంలో కేంద్రం విడుదల చేసిన మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదు..కనీసం ప్రసంగ పాఠాన్ని కూడా పంపలేదు...' అని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళి సై సౌందర్ రాజన్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల మధ్య రిపబ్లిక్ డే వేడుకలను నిర్వహించాలంటూ రెండు నెలల క్రితమే ప్రభుత్వానికి లేఖ రాశానని ఆమె తెలిపారు. అయితే ఆ లేఖను పక్కనబెట్టి రాజ్‌భవన్‌లోనే నిర్వహించుకోవాలంటూ రెండు రోజుల క్రితమే సమాచారమిచ్చారని చెప్పారు. ఇలాంటి విషయాలన్నింటినీ రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని ఆమె వ్యాఖ్యానించారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. గవర్నర్ తమిళి సై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ అంజనీ కుమార్‌తోపాటు సినీ సంగీత దర్శకుడు ఎమ్ఎమ్ కీరవాణి, గీత రచయిత ...2లో



మిర్యాలగూడలో...

వివరాలు 2లో..

కదిలిన రైతు దండు

రాష్ట్ర వ్యాప్తంగా కర్షకుల ట్రాక్టర్స్ మార్చ్



బడ్జెట్ హల్వా

- లాంఛనంగా ప్రారంభించిన కేంద్రమంత్రి నిర్మల

5

నేటినుంచి ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు

- 28 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం
- 30న తుది గడువు
- ఫిబ్రవరి 1 నాటికి రెండేండ్ల సర్వీసు ఉన్నోళ్లే అర్హులు
- టీచర్లు 8 ఏండ్లు, హెచ్ఎంలు 5 ఏండ్లు పనిచేస్తే బదిలీ తప్పనిసరి
- మార్గదర్శకాలు, షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో శుక్రవారం నుంచి ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభంకానుంది. శనివారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుంది. దరఖాస్తుల సమర్పణకు గడువు ఈనెల 30 వరకు ఉన్నది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ షెడ్యూల్, మార్గదర్శకాలతో కూడిన ఉత్తర్వులను (జీవో నెంబర్ 5) గురువారం ...5లో

కరెంట్ కోతలు.. రైతు వెతలు

గంగారాముకు చెందిన దేవయ్యకు పదెకరాల పొలముంది. యాసంగీలో రెండెకరాల్లో వరి, మిగతా పొలంలో గోధుమ, మొక్కజొన్న, కూరగాయలు సాగు చేశాడు. ఐదారు రోజులుగా కరెంట్ సరిగ్గా రాకపోయే సరికి ఆరుతడి పంటలకు నీళ్లు పెట్టకపోవడం వల్ల వాడుపట్టాయని తెలిపాడు. కరెంట్ కోతల వల్ల మోటర్ వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుందని పేర్కొన్నాడు. సర్దార్ అనే రైతు రెండెకరాల్లో గోధుమ, ఎకరంలో వరిసాగు చేశాడు.

- అనధికారిక కోతల వల్ల తిప్పలు
- వరి, ఆరుతడి పంటలకు నీటి ఎద్దడి
- ఇబ్బంది పడుతున్న బోర్లు, బావుల మోటర్ల రైతులు
- ఎండలు ముదిరితే మరింత కష్టం

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

అనధికారిక విద్యుత్ కోతల వల్ల వ్యవసాయ పంటలు దెబ్బతింటున్నాయి. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలోని కొండాపూర్, గంగారం, గిర్మాపూర్, సదాశివపేట మండలం పెద్దాపూర్ వంటి గ్రామాల్లో వ్యవసాయ బోర్ల కింద వరి, గోధుమ, మొక్కజొన్న, శనగ, పసుపు, ఉల్లి పంటలతో పాటు కూరగాయలు, ఆకు కూరలు సాగుచేస్తున్నారు. మామిడి, సపోట, కొబ్బరి, జామ ఇతర పండ్లు, పూల మొక్కల నర్సరీలు 500 వరకు సాగవుతున్నాయి. ఈ పంటలకు బోరు బావుల వ్యవసాయ మోటర్ల ద్వారానే నీటి పారకం జరుగుతుంది. త్రిఫేజ్ కరెంట్ ఉన్నప్పుడు మాత్రమే మోటార్లు నడుస్తాయి. 15 రోజులుగా విద్యుత్ కోతలు విధిస్తుండటంతో వరినాట్ల పనులకు తీవ్ర ఇబ్బందులు కలిగాయి. ముందస్తుగా వరినాట్లు పూర్తయి పచ్చపడుతున్న పైర్లకు సరిపడా నీళ్లు అందట్లేదు.



అలాగే ఆరుతడి పంటలకు మూడు నాలుగు రోజుకో తడి చొప్పున నీళ్లు కడతారు. నర్సరీలకు రోజూ ఉదయం, సాయంత్రం పూట నీళు పెడతారు. కరెంట్ కోతలు, తరచూ సర ఫరాలో బ్రేక్ డౌన్స్ అవుతుండటంతో ట్రాన్స్ ఫార్మర్ల వద్ద ట్రిప్ అవ్వడం, ఫీజులు పోవడం వంటి ...5లో

పుప్పాల కృష్ణమూర్తికి తెలుగు వర్సిటీ బాలసాహిత్య పురస్కారం

- నవతెలంగాణ ఎడిటర్, పబ్లిషింగ్ హౌస్ ఎడిటర్ అభినందనలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బాలసాహిత్య విభాగంలో తెలుగు యూనివర్సిటీ -2020 పురస్కారాన్ని పొందిన ప్రముఖ రచయిత పుప్పాల కృష్ణమూర్తిని నవతెలంగాణ పత్రిక ఎడిటర్ ఆర్.సుధా భాస్కర్, నవతెలంగాణ పబ్లిషింగ్‌హౌస్ ఎడిటర్ కె.ఆనందాచారి అభినందించారు. ఈ మేరకు గురువారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయన రాసిన 'వెన్నెల వాకిలి' బాలల కథాసంపుటికి ఈ పురస్కారం లభించిందని తెలిపారు. నవతెలంగాణ దినపత్రికలో ఆదివారం ప్రచురితమయ్యే సోపతి మ్యాగజైన్‌లో నెమలీక శీర్షికకు ఆయన రెగ్యులర్‌గా కథలు రాస్తున్న విషయాన్ని వారు ప్రస్తావించారు. దశాబ్దాలుగా బాలసాహిత్యంలో కృషి చేస్తున్న పుప్పాల కృష్ణమూర్తికి ఈ పురస్కారం రావడం ఎంతో గర్వకారణమని తెలిపారు. భవిష్యత్‌లో ఆయన మరింత ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షించారు.

427 మంది స్పౌజ్ టీచర్ల బదిలీ

- ఉత్తర్వులు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయుల స్పౌజ్ కేటగిరీ బదిలీలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. సూర్యాపేట మినహా 12 జిల్లాల్లో 427 మంది ఉపాధ్యాయులను బదిలీ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ గురువారం ఉత్తర్వులు విడుదల చేశారు. రాష్ట్రంలో 19 జిల్లాల్లో స్పౌజ్ బదిలీలను చేపట్టింది. 13 జిల్లాల్లో వాటిని చేపట్టకుండా ప్రభుత్వం నిషేధం విధించిన సంగతి తెలిసిందే. దీంతో ఆయా జిల్లాల్లోని ఉపాధ్యాయులు గత కొంతకాలంగా స్పౌజ్ బదిలీలను చేపట్టాలంటూ నిరసనలు వ్యక్తం చేశారు. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. 12 జిల్లాల్లో స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయ దంపతుల బదిలీలను చేపట్టాలని నిర్ణయించిందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్రంలోని 615 మంది స్పౌజ్ టీచర్లను బదిలీ చేస్తున్నామని తెలిపారు. అయితే సూర్యాపేట మినహా మిగిలిన 12 జిల్లాల్లో 427 మంది ఉపాధ్యాయులను ప్రస్తుతం బదిలీ చేస్తున్నట్టు ప్రకటించారు.

మిగిలిన స్పౌజ్ బదిలీలు చేపట్టాలి : వివేక్

రాష్ట్రంలో 615 మంది స్పౌజ్ టీచర్ల బదిలీలకు ప్రభుత్వం అనుమతినివ్వడాన్ని స్వాగతిస్తున్నామని స్పౌజ్ టీచర్ల ఫోరం కన్వీనర్ వివేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా టీచర్లు పడుతున్న ఆవేదనను అర్థం చేసుకొనైనా 13 జిల్లాల్లో మిగిలిన స్పౌజ్ బదిలీలను కూడా సాధ్యమైనంత తొందరలోనే జరపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

ఎస్సీ, ఎస్టీ టీచర్లలో భయం : బీటీఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులను ప్రభుత్వం భయ భ్రాంతులకు గురిచేస్తున్నదని బీటీఏ రాష్ట్ర అధ్యక్షులు కల్వదర్శి చైతన్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ల సర్వీస్ వెరిఫికేషన్లకు సంబంధించి సీనియార్టీ జాబితాలో జనరల్, రిజర్వేషన్ కేటగిరీలను ఒకే కటాఫ్‌లో పిలవడాన్ని తీవ్రంగా ఖండించారు. దీన్ని బట్టి చూస్తే ఆడిక్విసిని అమలు చేసే ప్రయత్నం ప్రభుత్వ యంత్రాంగం చేస్తున్నదని తెలిపారు.

సీఎం కేసీఆర్ ప్రశ్నిస్తున్న వాటినే ..

అడిగినందుకు గవర్నర్‌కు ధన్యవాదాలు :ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'కరోనా లాంటి క్లిష్ట సమయంలో సెంట్రల్ విస్టా మీద కంటే, దేశ మౌలిక సదుపాయాల మీద దృష్టి పెట్టాలని బీఆర్ఎస్ పార్టీ కేంద్రాన్ని డిమాండ్ చేసింది. కేవలం కొందరి సంపద పెంపుపై మాత్రమే దృష్టి పెట్టకుండా, రైతులు, కూలీలు, నిరుద్యోగ యువతను పట్టించుకోవడం కోసమే తాము పోరాడుతున్నాం' అని ఎమ్మెల్సీ కవిత ట్వీట్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంపై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండించారు. అదే సందర్భంలో ఇలాంటి ప్రత్యేకమైన రోజున, సీఎం కేసీఆర్ ప్రశ్నిస్తున్న వాటినే మళ్లీ అడిగినందుకు గవర్నర్‌కు ధన్యవాదాలు అని పేర్కొన్నారు.

ఫిబ్రవరి 15 నుంచి 20 వరకు పాట్నాలో

సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ 11వ జాతీయ మహాసభ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీహార్‌లోని పాట్నాలో ఫిబ్రవరి 15 నుంచి 20వ తేదీ వరకు సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జాతీయ మహాసభలు జరుగబోతున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిండ్ల రమేశ్ రాజా తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ మహాసభకు తాను ప్రతినిధిగా వెళ్లబోతున్నట్టు పేర్కొన్నారు. ఐదేండ్ల కాలంలో తమ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన పోరాటాలు, కార్యక్రమాలపైనా, నిర్మాణంపైనా సమీక్షించుకుని రాబోయే కాలంలో చేపట్టబోయే పోరాటాల కార్యాచరణను రూపొందించుకుంటామని తెలిపారు.

నవతెలంగాణ రీజినల్ మేనేజర్ తండ్రి అంత్యక్రియలు పూర్తి

నవతెలంగాణ-అంబర్‌పేట



నవతెలంగాణ రంగారెడ్డి జిల్లా రీజినల్ మేనేజర్ మహేందర్ రెడ్డి తండ్రి దూదిపాల ఇంద్రారెడ్డి అంత్య క్రియలు గురువారం ముగిశాయి. అంబర్‌పేట హర్రజ్‌పేట శ్మశాన వాటికలో నిర్వహించారు. అంత్రక్రియల్లో నవతెలంగాణ దినపత్రిక ఎడిటర్ సుధా భాస్కర్, సీజీఎం ప్రభాకర్ పాల్గొన్ని నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నగర నాయకులు మహేందర్, నవతెలంగాణ జనరల్ మేనేజర్ వెంకటేష్, హైదరాబాద్ జిల్లా రీజినల్ మేనేజర్ లింగారెడ్డి, మేనేజర్‌లు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ముక్కు ద్వారా తీసుకునే కోవిడ్ వ్యాక్సిన్ విడుదల



న్యూఢిల్లీ : ముక్కు ద్వారా తీసుకునే కోవిడ్‌వ్యాక్సిన్ 'ఇన్‌కొవాక్'ను కేంద్ర ఆరోగ్య మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా, శాస్త్ర-సాంకేతికత శాఖ మంత్రి జితేంద్ర సింగ్ గురువారం విడుదల చేశారు. భారత్ బయోటెక్ అభివృద్ధి చేసిన ఈ ఇన్‌కొవాక్ ప్రపంచంలోనే మొట్టమొదటి ముక్కు ద్వారా తీసుకునే కోవిడ్ వ్యాక్సిన్. రెండు విడతలుగానూ, తరువాత బూస్టర్ డోసుగా ఇవ్వడానికి ఈ వ్యాక్సిన్‌కు 2022 డిసెంబరులో ప్రభుత్వ అనుమతి లభించింది. అయితే 18 ఏళ్ల దాటిన వారికే ఈ వ్యాక్సిన్ ఇవ్వాలని, అత్యవసర పరిస్థితుల్లో ఈ వ్యాక్సిన్‌ను వినియోగించడకూడదని సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సిడిఎస్‌సిఒ) షరతులు విధించింది. రెండు డోసులుగా ఇచ్చే ఈ వ్యాక్సిన్ మధ్య విరామం 28 రోజులు ఉండాలని పేర్కొంది. ఈ వ్యాక్సిన్ అపాయింట్‌మెంట్ కోసం కోవిన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని భారత్ బయోటెక్ తెలిపింది. అయితే ఇప్పటికే రెండు డోసులు, బూస్టర్ డోసు తీసుకున్న వారికి ఈ వ్యాక్సిన్ ఇవ్వబడదు. ఈ వ్యాక్సిన్ ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఒకొక్క డోసుకు రూ.800 ధర నిర్ణయించినట్లు భారత్ బయోటెక్ ప్రకటించింది.

కదిలిన రైతు దండు



మిర్యాలగూడలో పెద్దఎత్తున ర్యాలీ

- మద్దతు తెలిపిన ప్రజాసంఘాలు
- రైతు వ్యతిరేక విధానాలు తెస్తే మోడీని గద్దె దింపుతాం: నేతలు

నవతెలంగాణ- మిర్యాలగూడ/విలేకరులు

'రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తే మోడీని గద్దె దింపుతాం.. రైతుల ఆందోళనతో రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలపై వెనక్కి తగ్గిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. ఆ సమయంలో రైతులకిచ్చిన హామీలను విస్మరించింది.. 9 హామీలను వెంటనే అమలు చేయాలి.. పార్లమెంటులో కనీస మద్దతు ధర చట్టం చేయాలి" అని రైతుల టాక్టర్స్ మార్చ్‌లో నేతలు డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా గురువారం రైతులు టాక్టర్స్ మార్చ్ నిర్వహించారు.

నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో అఖిలభారత కిసాన్ సభ (రైతు సంఘం) ఆధ్వర్యంలో పెద్దఎత్తున రైతులు ట్రాక్టర్ల ర్యాలీ తీశారు. కిలోమీటర్ పొడవునా టాక్టర్లు బారులు తీరాయి. ప్రతి ట్రాక్టర్‌పై ఆకుపచ్చ జెండాలు పెట్టి ప్రదర్శన చేశారు. ఈ ప్రదర్శనను సంఘం జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతు వ్యతిరేక విధానాలు అమలు చేస్తే మోడీని ఇంటికి సాగనంపుతామని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా రైతుల రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. పంట మొత్తాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి అన్నదాతలను ఆదుకోవాలన్నారు. కనీస మద్దతు ధర చట్టంతోపాటు రైతులకు బోనస్ అందించి ఆదుకోవాలన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ వ్యక్తులకు అప్పగించే ఆలోచనలను మోడీ ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. నకిలీ విత్తనాలు, పురుగుల మందులను అరికట్టి నాణ్యమైన విత్తనాలు అందించాలన్నారు. సబ్సిడీపై యూరియా, విత్తనాలు ఇవ్వాలని కోరారు. 50 ఏండ్లు నిండిన రైతులందరికీ రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం చేపడతామని, పది లక్షల మంది రైతులతో మహాధర్నా నిర్వహిస్తామని తెలిపారు. చలో ఢిల్లీకి రైతులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్‌నాయక్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బడా పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా కేంద్రం.. : చెరుపల్లి

కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ, బడా పారిశ్రామిక వేత్తలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నదని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు విమర్శించారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండల కేంద్రంలో రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ట్రాక్టర్ల ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతుల వీరోచిత పోరాటంతో రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేస్తున్నట్టు ప్రకటించిన ప్రధాని మోడీ.. ఆ విధానాలనే అనుసరిస్తూ వ్యవసాయ రంగాన్ని దివాలా తీయించారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర లేక పెట్టుబడులు పెరిగి అప్పుల భారంతో ఆత్మహత్య చేసుకుంటున్నారని చెప్పారు. పేద ప్రజలు, రైతులు రోజు రోజుకూ మరింత పేదలుగా మారుతుంటే అదానీ, అంబానీ వంటి పారిశ్రామికవేత్తల ఆస్తులు రెండు వందల రెట్లు పెరిగి ప్రపంచ కుబేరుల వరుసలో మొదటి, రెండో స్థానాలకు ఎగబాకారని చెప్పారు. ప్రజల ఆస్తులైన రైల్వే, విమాన యానం, ఓడ రేవులు, ఎల్ఐసీ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా అమ్ముతున్నారని విమర్శించారు.

నల్లగొండ జిల్లా కేంద్రంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు బొంతల చంద్రారెడ్డి, ముదిరెడ్డి సుధాకార్‌రెడ్డి ట్రాక్టర్ల ర్యాలీని ప్రారంభించారు. మునుగోడులో రైతు సంఘం(సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు బండ శ్రీశైలం, రైతు సంఘం(సీపీఐ) రాష్ట్ర నాయకులు నెల్లికంటి సత్యం ట్రాక్టర్ల ర్యాలీని ప్రారంభించారు.

సూర్యాపేట జిల్లా కేంద్రంలో వామపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రాక్టర్ల ర్యాలీని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంట ధరలు లేక.. వ్యవసాయంలో పెట్టిన పెట్టుబడిలో 80శాతం కూడా రైతులకు చేతికి రాక రుణగ్రస్తులు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల అన్ని రకాల రుణాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు కొప్పోజు సూర్యనారాయణ, అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి మందారి డేవిడ్ కుమార్, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బుర్రి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లా కేంద్రంలో భారీ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పెవిలియన్ మైదానం నుంచి కొత్త కలెక్టరేట్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా పెవిలియన్ మైదానంలో జరిగిన ర్యాలీని ఉద్దేశించి తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాగం హేమంతరావు మాట్లాడుతూ.. రైతు వ్యతిరేక నల్ల చట్టాల రద్దుపై బీజేపీ ప్రభుత్వం భారతదేశ రైతాంగాన్ని మోసం చేసిందని, ఇప్పటి పార్లమెంటు సమావేశాల్లో కూడా ఆ చట్టాల రద్దు బిల్లును ఎజెండాలోకి తీసుకురాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల పట్ల మోడీ సర్కార్ తీరు మారకుంటే మరో రైతాంగ ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

నూటికి 65 శాతం మంది ఆధారపడిన వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్ల రూపాయలు సబ్సిడీలుగా ఇవ్వడమేగాక చట్ట సవరణ చేసి కార్పొరేట్ రుణాలను రద్దు చేస్తున్న కేంద్రం.. రైతుల అప్పులకు సంబంధించి మాత్రం కనీస ఆలోచన చేయడం లేదన్నారు.

కేంద్ర ప్రభుత్వం రైతులకిచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి జిల్లాలో ఏఐకేఎస్ ఆధ్వర్యంలో భారీ ట్రాక్టర్, బైక్ ర్యాలీ చేపట్టారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఐటీఐ గ్రౌండ్ నుంచి ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలతో ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘ నాయకుడు కె.భూమయ్య మాట్లాడారు.

సిద్దిపేటలో ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ నుంచి సిద్దిపేట పాత బస్టాండ్ మీదుగా ముస్తాబాద్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ సాగింది. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని నేతలు డిమాండ్ చేశారు. రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎండి జబ్బార్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలో ట్రాక్టర్స్ ర్యాలీ నిర్వహించారు.

మార్చిలో పార్లమెంట్ మార్చ్

అఖిల భారత స్థాయిలో రైతు ఉద్యమం ఉధృతం

- ఎంఎస్‌పీకి చట్టపరమైన హామీ సాధన కోసం సుదీర్ఘ పోరాటానికి సిద్ధం కావాలి : కిసాన్ మహా పంచాయతీలో ప్రకటించిన ఎస్‌కేఎం
- లక్షకు పైగా హాజరైన రైతాంగం
- దేశవ్యాప్తంగా టాక్టర్స్ మార్చ్
- రాష్ట్రపతి ద్రౌపది ముర్మకు ఎస్‌కేఎం మెమోరాండం



న్యూఢిల్లీ : కేంద్రం లిఖితపూర్వకంగా హామీలు ఇచ్చి, అమలు చేయకుండా వెనక్కి తగ్గిన కీలకమైన సమస్యల సాధన కోసం అఖిల భారత స్థాయిలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వందలాది రైతు సంఘాలతో కూడిన సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ప్రకటించింది. బడ్జెట్ సమావేశాల సందర్భంగా మార్చిలో పార్లమెంట్‌మార్చ్ నిర్వహించ నున్నట్టు వెల్లడించింది. ఫిబ్రవరి 9న కురుక్షేత్రలో జాతీయ స్థాయి ఎస్‌కేఎం సమావేశం నిర్వహి స్తున్నామని తెలిపింది. రైతులకు కేంద్రం ఇచ్చిన వాగ్దానాల ద్రోహం, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ), పూర్తి రుణమాఫీ, ఇతర డిమాండ్లకు సంబంధించిన చట్టబద్ధమైన హామీపై భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మకు ఎస్‌కేఎం మెమోరాండం పంపించింది. దేశవ్యాప్తంగా 20 రాష్ట్రాల రాజధాను లలో టాక్టర్స్ మార్చ్ నిర్వహించారు. దాదాపు 300 జిల్లాల్లో జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు అందజేశారు. వేలాది ప్రాంతాల్లో ప్రదర్శనలు, మార్చ్ లు నిర్వహించారు. హర్యానాలోని జింద్‌లో భారీగా కిసాన్ మహా పంచాయత్ జరిగింది. ఇందులో పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ తో పాటు ఇతర ఉత్తరాది రాష్ట్రాల నుంచి లక్ష మందికి పైగా రైతులు పాల్గొన్నారు. ఈ మహా పంచాయత్‌లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఎస్‌కేఎం నేత దర్శన్ పాల్ చారిత్రాత్మక రైతు ఉద్యమంలో మరణించిన 700 మందికి పైగా అమరవీరులకు సంబంధించి తీర్మానం ప్రవేశపెట్టారు. రైతులంతా ఒక నిమిషం మౌనం పాటించారు. ఎస్‌కేఎం నాయకులు జోగేందర్ సింగ్ ఉగ్రహన్, దర్శన్ పాల్, రాకేష్ టికాయిత్, హన్నన్ మొల్లా, విజూ కృష్ణన్, అవిక్ సాహా, యుద్వీర్ సింగ్, అతుల్ కుమార్ అంజన్, ఆశిస్ మిట్టల్ తదితరులు మహా పంచాయత్‌లో ప్రసంగిస్తూ తమ ఐక్యతను మరింత పటిష్టం చేయాలని, బీజేపీ విభజన ఎత్తుగడలను తిప్పికొట్టాలని పిలుపు ఇచ్చారు.ఎంఎస్‌పీకి చట్ట పరమైన హామీ సాధన కోసం సుదీర్ఘ పోరాటానికి సిద్ధం కావాలని ఎస్‌కేఎం నేతలు పిలుపు ఇచ్చారు. లఖింపూర్ ఖేరీ ఘటనతో సంబంధమున్న కేంద్ర హోం సహాయ మంత్రి అజయ్ మిశ్రాను తొలగిం చాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సవరణ బిల్లు 2022 ఉపసంహరించుకోవాలని, రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. మోడీ పాలన వెనుక బలమైన కార్పొరేట్ హస్తం ఉన్నదనీ, రైతుల కష్టాలను తీర్చేందుకు అధికారం నుంచి తరిమికొట్టాల్సిన అవసరం ఉన్నదని జోగేందర్ సింగ్ ఉగ్రహన్ అన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు మోడీ పాలన అత్యంత రైతు, కార్మికుల వ్యతిరేక పాలన అని హన్నన్ మొల్లా అన్నారు. ఈ ప్రభుత్వం రైతులకు ద్రోహం చేసిందని, మళ్లీ మళ్లీ చేస్తుందని విమర్శించారు. అందువల్ల, బీజేపీని అధికారం నుంచి పారదోలడానికి ఐక్య పోరాటాన్ని ప్రారంభించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. హిందూ, సిక్కు ప్రాతిపదికన తమను విభజించేందుకు బీజేపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని భగ్నం చేసినందుకు హర్యానా, పంజాబ్ రైతులకు రాకేష్ టికాయిత్ కృతజ్ఞతలు తెలిపారు.



సూసైడ్ నోట్ రాసి.. పశుగణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ ఆత్మహత్య

నవతెలంగాణ-కంఠేశ్వర్

గణతంత్ర దినోత్సవం రోజునే పశుగణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ ఆత్మహత్యకు పాల్పడటం కలకలం రేపింది. నిజామాబాద్ నగరంలోని సారంగాపూర్ డెయిరీ ఫార్మ్ వద్ద డిస్ట్రిక్ట్ లైవ్ స్టాక్ డెయిరీ డెవలప్‌మెంట్ శాఖ కార్యాలయంలో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హన్మకొండ జిల్లా కేంద్రానికి చెందిన పెద్ద కాసులు శ్రీశైలం(52) గతేడాది కిందట వరంగల్ నుంచి నిజామాబాద్‌కు అసిస్టెంట్ డైరెక్టర్‌గా బదిలీపై వచ్చారు. 11రోజుల కిందట అనారోగ్య సమస్యలతో బాధపడ్డాడు. కాగా, బుధవారం కామారెడ్డిలో జరిగిన సమావేశంలోనే కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి వారి యోగక్షేమాలను కనుక్కొని జాగ్రత్తగా ఉండాలని వారికి సూచించారు. కానీ తండ్రి మాటలకు అనుమానం వచ్చిన కుమారుడు రవితేజతోపాటు కుటుంబ సభ్యులు నిజామాబాద్‌కు బయలుదేరి వచ్చారు. కానీ అప్పటికే 'తన చావుకు ఎవరూ కారణం కాదు' అని సూసైడ్ నోట్ రాసి శ్రీశైలం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాత్రి రెండు గంటల ప్రాంతంలో ఏడీ కార్యాలయానికి వచ్చిన కుటుంబ సభ్యులు శ్రీశైలం ఉంటున్న గది లోపలి నుంచి గడియ పెట్టి ఉండటంతో దాన్ని బద్దలు కొట్టారు. అప్పటికే ఆత్మహత్య చేసుకోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్టు ఆరో టౌన్ ఎస్ఐ సాయికుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

అండమాన్ ఎక్స్‌ప్రెస్ ఇంజిన్‌లో మృతదేహం

- జమ్మికుంట రైల్వే స్టేషన్లో నిలిపివేత

నవతెలంగాణ - జమ్మికుంట



అండమాన్ ఎక్స్‌ప్రెస్ రైలు ఇంజిన్‌లో మృతదేహం చిక్కుకోగా.. అలాగే రైలు చాలా దూరం ప్రయాణించింది. కరీంనగర్ జిల్లా జమ్మికుంట రైల్వే స్టేషన్‌లో రైలును ఆపి మృతదేహాన్ని బయటకు తీశారు. వివరాల్లోకి వెళితే.. అండమాన్ ఎక్స్‌ప్రెస్ రైలు వరంగల్ నుంచి రామగుండంవైపు వెళ్తుండగా ఇంజిన్‌లో చిక్కుకున్న మృతదేహాన్ని లోకో పైలట్ గమనించారు. జమ్మికుంట రైల్వే స్టేషన్ మేనేజర్‌కు సమాచారం అందించారు. రైల్వే సిబ్బంది జమ్మికుంట రైల్వే స్టేషన్‌లో రైలును నిలిపివేశారు. ఇంజిన్ ముందు భాగంలో చిక్కుకున్న మృతదేహాన్ని గడ్డపారాలతో తొలగించారు. మృతుడిని హనుమకొండకు చెందిన ఉప్పలయ్య(60)గా గుర్తించారు. జమ్మికుంట రైల్వే స్టేషన్లో అండమాన్ ఎక్స్‌ప్రెస్ గంటపాటు నిలిచిపోయింది.

పిల్లల కెరీర్‌పై 29న ఉచిత అవగాహన సదస్సు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి, ఇంటర్మీడియెట్ తర్వాత పిల్లల కెరీర్‌పై తల్లిదండ్రులు, అధ్యాపకుల పాత్రపై ఈనెల 29న ఉచిత అవగాహన సదస్సును నిర్వహించనున్నట్టు 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమి చైర్మెన్ పి క్రిష్ణప్రదీప్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్‌లో ఉన్న తమ అకాడమిలో ఆదివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులుగా రిటైర్డ్ ఐఏఎస్ జయప్రకాశ్ నారాయణ, ఓయూ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ చింత గణేష్, ప్రముఖ వ్యక్తిత్వ నిపుణులు సుధీర్ సంద్రా హాజరవుతారని వివరించారు. పిల్లలను సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం ఎలా అనే అంశంపై వారు మాట్లాడతారని పేర్కొన్నారు. పిల్లల కెరీర్ ఆప్షన్లు, సాఫ్ట్ స్కిల్స్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్, పిల్లల పట్ల తల్లిదండ్రుల బాధ్యత, అధ్యాపకుల పాత్ర వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు.

పట్టించుకోలేదు.. ప్రసంగ పాఠాన్ని పంపలేదు...

(మొదటిపేజీ తరువాయి)

చంద్రబోస్ తదితరులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ... గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారమే తెలంగాణ ఆవిర్భవించిందని చెప్పారు. రాష్ట్ర చరిత్ర, విశిష్టత చాలా గొప్పదని అన్నారు. రాజ్యాంగ రచనలో అంబేద్కర్ ప్రదర్శించిన అంకితభావం చాలా గొప్పదని నివాళులర్పించారు. హైదరాబాద్ నగరం అన్ని రంగాల్లో దూసుకుపోవటం హర్షణీయమని కితాబిచ్చారు. ఈ క్రమంలో రాష్ట్రాభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలను రాజ్‌భవన్ తప్పకుండా అందిస్తుందని తెలిపారు. ఇదే సమయంలో కొత్త భవనాలను కట్టడాన్ని మాత్రమే అభివృద్ధిగా చూడకూడదని వ్యాఖ్యానించారు. రైతులు, పేదలు, కార్మికులు, ఇలా అన్ని వర్గాలు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని తెలిపారు. అనంతరం ఆమె పుదుచ్చేరికి బయలుదేరి వెళ్లారు. అక్కడ లెఫ్టినెంట్ గవర్నర్ హోదాలో జాతీయ పతాకాన్ని ఎగరేశారు. తిరిగి సాయంత్రం హైదరాబాద్‌కు చేరుకున్నారు. కాగా ఉదయం రాజ్‌భవన్‌లో నిర్వహించిన వేడుకల్లోగానీ, గురువారం రాత్రి అక్కడ ఏర్పాటు చేసిన 'ఎట్ హోం' కార్యక్రమంలో గానీ సీఎం కేసీఆర్ పాల్గొనలేదు. ఆ రెండింటికీ ఆయన గైర్హాజరయ్యారు.

గిదేం విధానం...

- పారదర్శకతకు సర్కారు పాతర
- విద్యాశాఖలో బదిలీలలు
- పైరవీలకు పెద్దపీట
- దొడ్డిదారిన టీచర్ల ట్రాన్స్‌ఫర్లు
- ఉపాధ్యాయ సంఘాల ఆగ్రహం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వం ద్వంద్వ విధానాన్ని అవలంబిస్తున్నది. సాధారణ బదిలీలు చేపట్టేందుకు మార్గదర్శకాలతోపాటు షెడ్యూల్‌ను సర్కారు విడుదల చేసింది. శుక్రవారం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది. శనివారం నుంచి ఈనెల 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తారు. కానీ దొడ్డిదారిలో అక్రమంగా ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. పాఠశాల విద్యాశాఖలో బదిలీలలు కొనసాగుతున్నాయి. పైరవీలకే రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓ ఉపాధ్యాయ సంఘం, అధికార పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు పైరవీలు చేసి ఈ బదిలీల ఉత్తర్వులు పొందినట్టు సమాచారం. రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరితోపాటు ఇతర జిల్లాల్లోని జిల్లా కేంద్రాలు, పట్టణాలకు వారు బదిలీ అవుతున్నారు. ప్రగతి భవన్ ఆదేశాల మేరకే సచివాలయం నుంచి బదిలీ ఉత్తర్వులు పొందుతున్నట్టు విమర్శలు వస్తున్నాయి. నారాయణపేట జిల్లా కోస్గి మండలం గుండుమల్ జెడ్పీహెచ్‌లో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్)గా పనిచేస్తున్న డి సరితను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మూడు చింతలపల్లి మండలం కేశవాపూర్ జెడ్పీహెచ్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం నల్లచెరువు ఎంపీపీఎస్‌లో ఎస్జీటీగా పనిచేస్తున్న ఎన్ మాధవిని అదే జిల్లా హయత్‌నగర్‌లోని ఎన్జీవో కాలనీ ప్రాథమిక పాఠశాలకు బదిలీ చేశారు. ఇవి ఉదాహరణలు మాత్రమే. ఇంకా చాలా మందిని అక్రమంగా దొడ్డిదారిలో బదిలీ చేసినట్టు విమర్శలొస్తున్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వమే పారదర్శకతకు పాతర వేస్తున్నదని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. ఒకవైపు సాధారణ బదిలీలు జరుగుతుంటే ఇంకోవైపు దొడ్డిదారిన పైరవీలు చేయడమేంటని ఉపాధ్యాయ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. గిదేం విధానమని ఉపాధ్యాయులు కూడా విమర్శిస్తున్నారు. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తయ్యే వరకు టీచర్లకు సెలవులు ఇవ్వొద్దంటూ పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసి ఇప్పుడు దొడ్డిదారి బదిలీలకు అనుమతి ఎలా ఇస్తుందని నిలదీస్తున్నారు.

317 జీవో బాధితులకు అన్యాయం

రాష్ట్రంలో 2021, డిసెంబర్ ఆరో తేదీన 317 జీవోను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రంలో 22,418 మంది ఉపాధ్యాయులు, 13,760 మంది ఉద్యోగులు కలిపి 36,178 మంది ఇతర జిల్లాలు, జోన్లు, మల్టీ జోన్లకు బదిలీ అయ్యారు. వారిలో ఎక్కువ మంది వారి సొంత జిల్లా స్థానికతను వదిలి వేరే జిల్లాలకు స్థానికేతరులుగా కేటాయించారు. గతేడాది జనవరి ఏడో తేదీన ఉద్యోగులు, ఉపాధ్యాయుల విభజన ప్రక్రియ ముగిసిందని ప్రభుత్వం ప్రకటించింది. అంటే వారు బదిలీ అయ్యి ఏడాది గడిచింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు విడుదల చేసిన ఉత్తర్వుల్లో ఒక పాఠశాలలో కనీసం రెండేండ్ల సర్వీసు ఉన్న ఉపాధ్యాయులే బదిలీకి అర్హులని ప్రకటించింది. దీంతో 22,418 మంది ఉపాధ్యాయులు కనీసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హత పొందడం లేదు. వారికి ప్రభుత్వం అన్యాయం చేస్తున్నది. ఇంకోవైపు వారిలో చాలా మంది సొంత జిల్లాకు బదిలీ కావాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాటిని పట్టించుకోవడం లేదు. కానీ దొడ్డిదారిలో మాత్రం కొందరు ఉపాధ్యాయులను బదిలీ చేస్తూ ఉత్తర్వులిస్తున్నది. మరోవైపు భార్యాభర్తలు ఒకే జిల్లాలో ఉండాలని ముఖ్యమంత్రి కేసీఆర్ పలు సందర్భాల్లో ప్రకటించారు. అందులో భాగంగా 19 జిల్లాల్లో స్పౌజ్ బదిలీలను ప్రభుత్వం చేపట్టింది. కానీ 13 జిల్లాల్లో స్పౌజ్ బదిలీలపై నిషేధం విధించింది. ఆయా జిల్లాల్లోని ఉపాధ్యాయులు కూడా స్పౌజ్ బదిలీలు చేపట్టాలంటూ డిమాండ్ చేస్తున్నారు. పలుసార్లు చలో హైదరాబాద్, చలో ప్రగతి భవన్ కార్యక్రమాలు చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఇప్పుడు 615 మంది స్పౌజ్ బదిలీలు చేపడుతున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఇంకా వందలాది మంది స్పౌజ్ బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు.

పైరవీ బదిలీలు ఆపాలి : యూఎస్‌పీసీ

ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూల్ విడుదలైందో లేదో పైరవీ బదిలీల ప్రహసనం మొదలైందని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) విమర్శించింది. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలతోపాటు ఇతర జిల్లాల్లోని పట్టణ ప్రాంత పాఠశాలలకు సచివాలయం నుండి నేరుగా బదిలీ ఉత్తర్వులు ఇస్తూ కౌన్సెలింగ్ ప్రక్రియను అపహాస్యం చేస్తున్నారని విమర్శించింది. రాజకీయ పలుకుబడితో జరుగుతున్న పైరవీ బదిలీలు నిలుపుదల చేయాలని డిమాండ్ చేసింది. బ్లాక్ చేసిన 13 జిల్లాల స్పౌజ్ కేసులను బదిలీలకు ముందే సర్దుబాటు చేయాల్సి ఉండగా ఇంకా ఉత్తర్వులు ఇవ్వలేదని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి హామీ ఇచ్చిన విధంగా సమస్యలను పరిష్కరించాలని కోరింది. పైరవీ బదిలీలు నిలిపేసి వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేసింది.

పారదర్శకతకు అర్థం ఈ బదిలీలేనా? : ఎస్టీయూటీఎస్

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను అత్యంత పారదర్శకంగా ప్రభుత్వం నిర్వహిస్తుందంటూ చెప్పిందని ఎస్టీయూటీఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి సదానందంగౌడ్, ఎం పర్వత్‌రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి బి భుజంగరావు తెలిపారు. ప్రభుత్వం దొడ్డిదారిలో బదిలీలు నిర్వహించడమే పారదర్శకతకు అర్థమా?అని ప్రశ్నించారు. ఈ బదిలీలను ఏ విధంగా ప్రభుత్వం సమర్థించుకుంటుందని అడిగారు. పరపతి బదిలీలను రద్దు చేయాలని టీపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై అశోక్‌కుమార్, ముత్యాల రవీందర్ డిమాండ్ చేశారు.




అరణ్య భవన్‌లో...


ఉన్నత విద్యామండలిలో...


బీఆర్‌కే భవన్‌లో సీఎస్


హైకోర్టులో...



పాస్‌పోర్టు కార్యాలయంలో...


ఎన్టీఆర్ భవన్‌లో...


టీఎస్ఎస్‌పీడీసీఎల్‌లో...


లోకాయుక్తలో...


టీఎన్జీవోస్ కార్యాలయంలో...


టీజేఎస్ కార్యాలయంలో...


బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో...

మంచి సినిమాలకు భరోసా ఎస్వీకే..

- సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ



నవతెలంగాణ-ముషీరాబాద్

మనిషి కేంద్రంగా పేదల పెన్నిధిగా మంచి సినిమాలకు భరోసాగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఉన్నదని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ అభినందించారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో షార్ట్ ఫిలిమ్‌లు, కళారూపాల ప్రదర్శన కోసం దాశరథి థియేటర్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సామాజిక అంశాలతో కూడిన సినిమాలు తీస్తున్న నిర్మాతలను, డైరెక్టర్లను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సామాన్యుడికి సినిమాయే ప్రధాన వినోదం అని, కానీ ఆ కాస్త వినోదం దక్కకుండా చేస్తున్నారన్నారు. మంచి సందేశాత్మక సినిమాలపై దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిజాలు చెబితే నిలువునా తగలబెడుతున్నారని, ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో తామున్నామంటూ లఘు చిత్ర పరిశ్రమకు భరోసానివ్వడం సాహసంతో కూడిన నిర్ణయం అని సుందరయ్య విజ్ఞాన కేంద్రం, టీపీఎస్‌కేను అభినందించారు. సినిమాలపై పన్నుల భారం తగ్గించాలని, పైరసీ మాఫియాలను అరికట్టాలని, లఘు చిత్రాలను ప్రోత్సహించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఎస్వీకే కార్యదర్శి ఎస్.వినయకుమార్ మాట్లాడుతూ.. తక్కువ సమయంతో ఆకర్షణీయంగా ఉండే లఘు చిత్రాలకు రోజురోజుకూ ఆదరణ పెరుగుతుందన్నారు. సందేశాత్మక విభిన్న కథలతో ప్రేక్షకుల్లో విజ్ఞానం వినోదం అందిస్తున్నాయని, దీన్ని ఎస్వీకే ప్రోత్సహిస్తుందని తెలిపారు. లఘు చిత్రాల ప్రదర్శన నిరంతరాయంగా జరుగుతుందని, మనమంతా ఒక్కటే మనుషులే మనకు ముద్దు అంటూ సినిమాలు రావాలని సూచించారు. తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం నాయకులు భూపతి వెంకటేశ్వర్లు సమన్వయం చేసిన ఈ కార్యక్రమంలో సినీ నిర్మాత డాక్టర్ జి.అనుష రెడ్డి, లఘు చిత్రాల ఇన్‌చార్జి, నటుడు బీడీఎల్ సత్యనారాయణ, సత్య భాస్కర్, ఎస్వీకే బాధ్యులు జి బుచ్చిరెడ్డి, ఎస్.సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌ను కలిసిన
ఛత్రపతి వారసుడు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



మరాఠా వీరుడు ఛత్రపతి శివాజీ 13వ వారసుడు, మాజీ ఎంపీ ఛత్రపతి శంభాజీ రాజే గురువారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును కలిశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ ఆయన్ని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. మధ్యాహ్నం కలిసి భోజనం చేశారు. పలు అంశాలపై వారు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల గురించి శంభాజీరాజే సీఎం కేసీఆర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం 'రాజర్షి సాహు ఛత్రపతి' పుస్తకాన్ని శంభాజీ రాజే సీఎం కేసీఆర్‌కు అందించారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు కవిత, మధుసూధనాచారి, పల్లా రాజేశ్వర్‌రెడ్డితో పాటు ఛత్రపతి శంభాజీ రాజేతో వచ్చిన ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇది కేవలం మర్యాదపూర్వక కలయికే అని ప్రగతిభవన్ వర్గాలు తెలిపాయి.

కడుపు కాలుతోంది సారూ..

- పళ్లాలతో హాస్టల్ డైలీవేజ్ కార్మికుల నిరసన
- జిల్లా మంత్రి జోక్యం చేసుకోవాలి..
- 36 నెలల జీతాలు వెంటనే ఇవ్వాలి : సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మధు



నవతెలంగాణ-ఖమ్మం

హాస్టల్ డైలీవేజ్ కార్మికులకు మూడేండ్లుగా రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించకపోతే ఏ క్షణమయినా నిరవధిక సమ్మె చేస్తామని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మధు హెచ్చరించారు. జీతాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు హాస్టల్ డైలీవేజ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని ఎన్ఎస్‌టీ రోడ్ లేడీస్ హాస్టల్ వర్కర్లు 'కడుపు కాలుతోందని' అన్నం తినే పళ్ళాలు పట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలు నెలనెలా 1న జీతాలు తీసుకుంటున్నారని, కానీ కార్మికులకు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. మంత్రి ఉన్న ఖమ్మం జిల్లాలోనే ఎక్కువ నెలలు జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపించారు. తక్షణమే మంత్రి జోక్యం చేసుకుని సమస్య పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఒక నెల జీతం రాకపోతేనే తీవ్ర ఆర్థిక ఇబ్బందులూ పడే పరిస్థితిలో మూడేండ్లుగా జీతాలు ఇవ్వకపోతే వారు ఎంత దుర్భరమైన జీవితం అనుభవిస్తున్నారో అధికారులు గమనించాలని సూచించారు. వెంటనే బకాయిలను విడుదల చేయకపోతే సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వై. విక్రమ్, కాంపాటి వెంకన్న, ప్రవీణ్, సంతోష్, లక్ష్మి దేవి, వీరమ్మ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో రైల్వేలు కీలకపాత్ర

- ద.మ.రైల్వే జీఎమ్ అరుణ్‌కుమార్ జైన్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దేశాభివృద్ధిలో రైల్వేలది కీలకపాత్ర అని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. గురువారం సికింద్రాబాద్ రైల్వే స్పోర్ట్స్ గ్రౌండ్‌లో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, ఆర్పీఎఫ్ దళాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జోన్ పరిధిలో రూ.13,787 కోట్ల ఆదాయాన్ని ఆర్జించామనీ, గతేడాదితో పోలిస్తే ఇది 35 శాతం అధికమని చెప్పారు. అలాగే సరుకు రవాణాలోనూ రికార్డు స్థాయిలో ఆదాయాన్ని సముపార్జించామన్నారు. 189 మిలియన్ల ప్రయాణికులను వివిధ గమ్యస్థానాలకు చేర్చి, రూ.3,782 కోట్ల ఆదాయాన్ని గడించినట్టు చెప్పారు. భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.

సంపాదకీయం

ఉక్రెయిన్‌కు పశ్చిమ దేశాల యుద్ధటాంకులు!

ఎవరైనా పుట్టిన రోజు సందర్భంగా పదికాలాల పాటు పచ్చగా ఉండాలని కోరుతూ కానుకలు అందించి దీవించటం సహజం. కానీ నీక్కావలసిన అస్త్ర శస్త్రాలన్నీ ఇస్తాం మరిన్ని ప్రాణాలను బలిపెట్టమని దీవించి ప్రోత్సహిస్తారా? ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ(45) పుట్టిన రోజు సందర్భంగా బుధవారంనాడు మరికొంత కాలం యుద్ధం చేయాలని దీవిస్తూ అమెరికా,

> తమ ప్రాదేశిక సమగ్రతకు హామీ ఇచ్చి, నాటోను విస్తరించబోమని, ఉక్రెయిన్‌ను తమ పక్కలో బల్లెంగా మార్చబోమని హామీ ఇస్తే సైనిక చర్యను వెంటనే ఆపివేస్తామని ప్రారంభంలోనే రష్యా ప్రకటించిన సంగతి తెలిసిందే. అదేమీ తెలియనట్లు పశ్చిమ దేశాలు ప్రపంచాన్ని నమ్మించేందుకు చూస్తున్నాయి. రోజు రోజుకూ ఎగదోస్తూ వంచనకు పాల్పడుతూ ప్రపంచాన్ని ప్రమాద అంచుకు నెడుతున్నాయి.

జర్మనీ, ఇతర ఐరోపా దేశాలు ఆధునిక టాంకులను అందచేస్తామని ప్రకటించాయి. కానీ ఈ బహుమతుల అందచేత సదరు దేశాల మిలిటరీ పరిశ్రమలకు కాసుల వర్షం కురిపిస్తే ప్రపంచాన్ని కష్టాల్లో ముంచుతుంది. ఇదే ఆందోళనకరం. ఇప్పటికే వైఫల్యం చెందిన ప్రభుత్వాలకు, జనం మీద భారాలు మోపదలచుకున్న పాలకులకు ఉక్రెయిన్ సంక్షోభాన్ని సాకుగా చూపటం అలవాటైంది. అది ప్రారంభమై పదకొండు నెలలు గడిచింది, ఫిబ్రవరి 24నాటికి ఏడాది పూర్తి చేసుకోనుంది. చిత్తశుద్ధి, జనం పట్ల జవాబుదారీ తనం ఉంటే ఈ దేశాలుగానీ, నేతలు గానీ వివాదపడుతున్న ఉక్రెయిన్ -రష్యాలను కూర్చోబెట్టి రెండు దేశాల్లో ఉన్న భయ, సందేహాలను పోగొట్టి ప్రశాంతతను చేకూర్చాలిగానీ, మరింత ఆజ్యం పోయటం గర్హనీయం. ఒకవైపు రష్యా మీద మరిన్ని కఠిన ఆంక్షలను అమలు చేసి మరింతగా రెచ్చగొడుతూ మరోవైపు చచ్చేదాకా పోరు సల్పండి మీకు కావాల్సిన ఆయుధాలు, మందుగుండు ఇస్తామంటూ ఉక్రెయిన్ను ముందుకు నెడుతున్నాయి.



ఎలాగూ అమెరికా ఇస్తోంది కనుక మనం ఎందుకు వెనుకబడాలని జర్మనీ, జర్మన్లు కొద్దిసేపటిక్రితమే ప్రకటించారు గనుక మనమెందుకు తగ్గాలంటూ అమెరికా కొద్ది గంటల తేడాలోనే ఉక్రెయిన్‌కు యుద్ధ టాంకులను ఇస్తామని ప్రకటించాయి. సంక్షోభంలో ఇదొక కొత్త మలుపు. గడచిన పదకొండు నెలల కాలంలో గతంలో సోవియట్, తరువాత రష్యా అందచేసిన టాంకులు, ఆయుధాలనే తిరిగి రష్యా మీదకు ప్రయోగించారు. ఇతర తూర్పు ఐరోపా దేశాలు కూడా తమ వద్ద ఉన్న పూర్వపు సోవియట్ అస్త్రాలను ఉక్రెయిన్‌కు సరఫరా చేశాయి. అవి ఖాళీ కావటంతో ఇప్పుడు పశ్చిమ దేశాల అస్త్రాలతో ఆ స్థానాన్ని భర్తీ చేస్తున్నారు. వాటిని ఉపయోగించే నైపుణ్యమూ, ఇంధనం కూడా లేనందున వాటిని కూడా ఇతర నాటో దేశాలే సమకూర్చుతున్నాయి. నాటో దేశాల సైనికులు పాల్గొనటం లేదు కనుక ఉక్రెయిన్ల రక్తం ఎంత చిందినా, ఎన్ని ప్రాణాలు పోయినా వారికి పట్టదు.

తమ వద్ద ఉన్న లెపర్డ్(చిరుత పులి) రకం టాంకులను ఇస్తామని జర్మనీ ప్రకటించింది. ఇప్పటికే అనేక నాటో దేశాలకు వాటిని సరఫరా చేసింది. వాటికి పనిలేక తుప్పు పట్టేదశలో ఉన్నా సదరు దేశాలు మరో దేశానికి విక్రయించాలంటే జర్మనీ అనుమతి అవసరం. ఆమేరకు మిగతా దేశాలకు సైతం అనుమతి ఇచ్చింది. దీంతో జర్మనీకి రెండు రకాల లాభాలు... ఒకటి ఉక్రెయిన్ను మరింతగా ఆదుకొనేందుకు ముందుకు వచ్చిందన్న పేరుతో పాటు అది కొత్త టాంకులను ఇతర దేశాలకు అమ్ముకొని లాభాలు గడించవచ్చు. ఈ సంగతి తెలిసే అబ్రామ్ రకం టాంకులను అందచేస్తున్నట్లు జో బైడెన్ ప్రకటించేశాడు. లేకుంటే వాటిని తయారు చేసే కంపెనీలు ఊరుకుంటాయా? జర్మనీ తొలుత 14 చిరుత రకం టాంకులు ఇస్తామని చెబితే అమెరికా 31 ఇవ్వనున్నట్లు ప్రకటించింది. తరువాత వాటిని ఇంకా పెంచుతారు. ఈ పోటీలో ఫ్రాన్స్ వెనుకబడింది. దాని దగ్గర ఉన్న స్వంత తయారీ టాంకులను అందచేస్తే మూడు రకాల టాంకులను వినియోగించటం ఉక్రెయిన్‌కు కుదిరేది కానందున మంచి బేరం పోయిందే అని అది నిట్టూర్పులు విడుస్తోంది.

శీతాకాలం ముగిసిన తరువాత ఈ పశ్చిమ దేశాల ఎత్తుగడలకు ధీటుగా పెద్ద ఎత్తున దాడులు చేసేందుకు రష్యా సిద్ధం అవుతున్నట్లు మరోవైపు నుంచి వార్తలు. టాంకులు ఇవ్వటాన్ని చారిత్రాత్మకం అని జర్మనీ వర్ణించటమే కాదు ఆట తీరునే మార్చివేస్తుందని కూడా ఉక్రెయిన్‌ను ఉబ్బేసింది. సంక్షోభం మొదలైనప్పటి నుంచి అదే కబుర్లు చెబుతున్నారు, ఇదిగో పుతిన్ పతనం అదిగో రష్యా వెనుకడుగు అని అంటూనే ఉన్నారు. ఇలాంటి టక్కు టమారాలను చాలా చూశాం, టాంకుల అందచేత ఒక విధ్వంసక పథకం, సామర్థ్యం గురించి అతివర్ణన అంటూ రష్యా ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ కొట్టిపారవేశాడు. ఇలాంటి మాటలన్నీ ప్రచార ఎత్తుగడల్లో భాగం కావచ్చు గానీ రానున్న రోజుల్లో సంక్షోభం కొత్త రూపం సంతరించుకోవటం, మరింత ప్రాణ, ఆస్తి నష్టం అనివార్యంగా కనిపిస్తోంది. దీనికి పూర్తిగా పశ్చిమ దేశాలదే బాధ్యత అవుతుంది. తమ టాంకులు ఉక్రెయిన్ ప్రాంతాలను కాపాడటం కోసం తప్ప రష్యాకు ముప్పుతెచ్చేందుకు కాదని అమెరికా విదేశాంగ మంత్రి లాయిడ్ ఆస్టిన్ నమ్మబలుకుతున్నాడు. పుతిన్ సేనలు ఎప్పుడు వెనక్కు పోతే పోరు ఆ మరునాడే ఆగుతుందన్నాడు. తమ ప్రాదేశిక సమగ్రతకు హామీ ఇచ్చి, నాటోను విస్తరించబోమని, ఉక్రెయిన్‌ను తమ పక్కలో బల్లెంగా మార్చబోమని హామీ ఇస్తే సైనిక చర్యను వెంటనే ఆపివేస్తామని ప్రారంభంలోనే రష్యా ప్రకటించిన సంగతి తెలిసిందే. అదేమీ తెలియనట్లు పశ్చిమ దేశాలు ప్రపంచాన్ని నమ్మించేందుకు చూస్తున్నాయి. రోజు రోజుకూ ఎగదోస్తూ వంచనకు పాల్పడుతూ ప్రపంచాన్ని ప్రమాద అంచుకు నెడుతున్నాయి.



కామ్రేడ్ దేశం వెంకటరెడ్డి గారు (డి.ఎ.ఆర్)

> సార్ కమ్యూనిస్టు కావడం వల్లనే మా యెడల అంత వాత్సల్యంతో ఉండేవారని తర్వాత మాకు అర్థమైంది. మాకు బడి చదువుతో పాటు బతుకు విలువలు నేర్పినవారు. సమయం దొరికినప్పుడల్లా గతితార్కిక భౌతికవాదం, అర్థశాస్త్రం, చారిత్రక భౌతికవాదం, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం, జాతీయోద్యమం గురించి సులభంగా మా స్థాయికి దిగి చెప్పేవారు. ఆ రోజుల్లోనే మేము విజయవాడ, వనపర్తి అనేక ప్రాంతాలలో జరిగిన మార్క్సిస్టు పార్టీ రాజకీయ తరగతులకు పోవడానికి ప్రధాన కారకుడు సారే. బతుకు బాటలో, ఉద్యమ పాటలో ఎదగడానికి ఊతం సారుదే.

దారిదీపం



గోరటి వెంకన్న

జ్ఞాపకం

సిమ్మ సీకటిలో మిణుగురు అయినా వెలుగే. భరణి ఎండలో ఇంకుతున్న కుంటనీరయినా జీవ జలమే. వరద ప్రవాహంలో కొట్టుకపోయే పడవకు చిన్న రెల్లుగడ్డి అయినా ఆధారమే. అకారణంగా అవమానాలు ఎదురవుతున్న వేళ దరికితీసి, ఆదరించే బంధం ఆత్మబంధమే. వేదనతో కూడిన మా బడి బాల్యాన్ని గతంగా మార్చి ఆనందపు తీరాలకు చేర్చిన తెరచాప నావ మా గురువు వెంకటరెడ్డి తోవ. ఆ తోవకు బతుకంతా రుణపడి ఉంటాం.

అది మూడమేసిన కాలం. అందరికి చదువెంతో దూరం. అణగారిన బిడ్డలకు సమాజమిచ్చిన వివక్ష ఒక శాపం. అరకొర వసతులున్న జైలును తలపించే హాస్టల్ మా పాలిట నరకం. కులంపేర చిన్నచూపు చూసే కొందరు ఉపాధ్యాయుల తిట్లు, కనపడగానే కర్రదెబ్బలు ఆ రోజుల్లో సాధారణం. దానికి భిన్నంగా సంప్రదాయకులైన మంచి ఉపాధ్యాయులు కూడా మా పాఠశాలలో ఉండేవారు.

బడి చదువంటే మాకో వింత. పదవ తరగతి పాస్ అయితే చిన్న కొలువు ఏదైనా మా పిల్లలకు దొరుకుతుందనే ఒక ఆశ తల్లిదండ్రులకు. పదవ తరగతి గట్టెక్కితే ఎవరెస్టు ఎక్కినంత ఆనందం. మా ఊళ్లో మూడవ తరగతి వరకే ఉండటం వల్ల రఘుపతిపేట స్కూల్ హాస్టల్‌లో చేర్చినారు. నిత్యం ఆలమంద అరుపులతో, మేకల గుంపులతో, అమ్మమ్మల తాతయ్యల అనుబంధాలతో హాయిగా ఉన్న మాకు హాస్టల్ మెట్లెక్కినప్పుడే ఏదో దిగులు కమ్మేది. ఆ దిగులుతోనే సదువు కొనసాగేది. మాలాంటి వారికి చదువు వికాసంగా కాక ఏదో బరువు మోస్తున్నట్లు ఉండేది. పది పాస్ అయితే కాలేజీ సీటు వస్తుందో రాదో తెలియదు కానీ పది పరీక్ష తప్పితే పారతట్ట, కాడిమేడి పని మాత్రం గ్యారెంటీ అనుకునేవాళ్లం.

అలాంటి కఠిన యాతనల కాలంలో ఎడారిలో నీటిసెలిమలా మాకోసం వచ్చిన వాడే మా వెంకట్ రెడ్డి సారు. చల్లని చూపులతో మమ్ముల అక్కున చేర్చుకున్న ఆదర్శమూర్తి. అంతకు ముందున్న ఉపాధ్యాయుల ఇళ్లలో వాకిళ్లు తొక్కడానికి కూడా సందేహించే మేము వారి ఇంటిలో సొంత బిడ్డలా కలిసి పోవడం అనేది మాకు ఊహకందనిది. గోలెం దగ్గర నీళ్ల లోటాను ముట్టుకోవడానికి వెరిసే మేము వారు తినే పళ్లెంలోనే మాకు వడ్డించి మాతో కలిసి భోంచేసిన రోజులు గుర్తుకొస్తే సాపకూటి బ్రహ్మనాయుడుని సార్‌లో చూసుకునేది. మా ఇంటి దగ్గర వేగు జామున లేచి మోటకో, గుంటుక పనికో, పశువుల కాపుకో బయలెల్లడం మాకు తెలిసిన పని. కానీ మా వెంకటరెడ్డి సారు అదే వేకువ జామున నాలుగు గంటలకు నిద్రలేపి స్నానానికి పారే దుందుభి వాగులోకి తీసుకెళ్లేవారు. సబ్బులు లేని విద్యార్థులకు తానే సబ్బులు ఇచ్చి శుభ్రతకు పాదువేసేవారు. ఇవాళ మా వంటి మెరుపును, తెల్లని వస్త్రాలను చూసుకున్నప్పుడు అద్దంలో సారు మోమే మాకు కనిపిస్తుంది.

క్రమశిక్షణకు మారుపేరు కాని కర్ర ఉపయోగించడం తెలియదు. మా బిడ్డల కోసం "చలం బిడ్డల శిక్షణ" పేజీలు తిప్పినప్పుడల్లా ఆ పిల్లలపట్ల మా సారు ప్రేమకు అది అక్షర రూపమేమో అనిపిస్తుంది. పిల్లలకే జీవితం అంకితం పుస్తకం రాసిన స్లుహనోమ్స్కిలా మా సారు. గిజుభాయి పగటికల మా సారు. ఏ విద్యార్థి ఏ సబ్జెక్టులలో వెనుకబడి ఉంటే ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించేవారు. వారికి స్పెషల్ క్లాసులు చెప్పాలని వివరించేవారు. సారు సమక్షంలో ఆమావాస్య కూడా వెన్నెల కాసినట్లుగా ఉండేది.

ఎవరినీ హేళన చేసి ఎరగడు. తప్పులు ఎత్తిచూపకుండ సరిదిద్దుకునే ఆత్మవిశ్వాసం కలిగించేవాడు. నేను నాతోపాటు కొంతమంది విద్యార్థులం గణితం అంటే వణికిపోయేవాళ్లం. ఇది గమనించిన వెంకట్ రెడ్డి సారు గణిత ఉపాధ్యాయులైన గోవర్ధన్ రెడ్డి సార్‌తో మాట్లాడి మా పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించే విధంగా చూడాలని చెప్పారు. ఎవరు ఏ సబ్జెక్టులలో వీక్ ఉంటే ఆ సబ్జెక్టుల ఉపాధ్యాయులతో అదనపు క్లాసులు చెప్పించేవారు. విద్యా బోధనలకు సంబంధించి వారి కృషిని వివరిస్తే ఒక మహా గ్రంథమే అవుతుంది.

సార్ కమ్యూనిస్టు కావడం వల్లనే మా యెడల అంత వాత్సల్యంతో ఉండేవారని తర్వాత మాకు అర్థమైంది. మాకు బడి చదువుతో పాటు బతుకు విలువలు నేర్పినవారు. మాకు తెలియకుండానే మమ్ములను అభ్యుదయమార్గం వైపు చేరువచేశారు. మాటకు చేతకు పొంతన కలిగిన ఆచరణ సారుది. సమయం దొరికినప్పుడల్లా గతితార్కిక భౌతికవాదం, అర్థశాస్త్రం, చారిత్రక భౌతికవాదం, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం, జాతీయోద్యమం గురించి సులభంగా మా స్థాయికి దిగి చెప్పేవారు. ఆర్. రాంరెడ్డిలాంటి ఉపాధ్యాయులతో క్లాసులు ఇప్పించేవారు. మా జిల్లా కమ్యూనిస్టు నాయకులు కె. కిష్టన్న, బాలకిష్టయ్య గౌడ్, లింగోజీరావు, కందికొండ రామసామి, తెప్ప బలరాం, వనగంటి ఈశ్వర్ లాంటి నాయకులను రప్పించి, వారితో మాకు సాన్నిహిత్యం పెంచేవారు. ఆ రోజుల్లోనే మేము విజయవాడ, వనపర్తి అనేక ప్రాంతాలలో జరిగిన మార్క్సిస్టు పార్టీ రాజకీయ తరగతులకు పోవడానికి ప్రధాన కారకుడు సారే. బతుకు బాటలో, ఉద్యమ పాటలో ఎదగడానికి ఊతం సారుదే.

పార్టీ పిలుపు మేరకు డీఈఓ స్థాయి ఉద్యోగాన్ని వదలి హోల్ టైమర్‌గా వచ్చారు. ఎన్నో భూ పోరాటాలు నిర్మించి, పాలుమూరు జిల్లా వామపక్ష విప్లవోద్యమానికి సార్ కీలక భూమిక పోషించారు. తన సొంత ఊరిలో తన కుటుంబీకుల భూమిని కూడా దళితులకు పంచిన ధన్యశీలి. తన ఊరిలో కులరహిత ఆచరణలో ఉన్నందుకు కులం నుంచి తను వివక్షకు గురయ్యాడు.

సారు మృదుభాషి, సరళ స్వభావి. నిరాడంబరతకు మారుపేరు. ఏ ప్రలోభాలకు లొంగని నికార్సయిన కమ్యూనిస్టు. ఇప్పటికీ నేను ఏదో మేరకు ప్రజల పక్షం ఉన్నానంటే దానికి కారణం మా వెంకటరెడ్డి సారు, మా బాలకిష్టయ్య గౌడ్. సుందరయ్యగారి మార్గంలో కడవరకు నడిసిన ధన్యజీవి మా సారు. ఎన్ని విపత్కర పరిస్థితులు ఎదురైనా పోరాటం నుంచి మడమ తిప్పని నిజమైన కమ్యూనిస్టు యోధుడు.

సారు దస్తూరీ ఎంత అందంగా ఉండేదో, రూపం కూడా అంత ప్రసన్నంగా ఉండేది. తన నోటి నుంచి ఏనాడు ఒక పొల్లుమాట వినలేదు. మేం పదవతరగతిలో ఉన్నప్పుడు మాతో ఎలా ఉన్నాడో, మా పిల్లలు పదవ తరగతికి వచ్చినప్పుడు కూడా మాతో అలాగే ఉన్నాడు. నిరంతరం మా నడవడిని గమనించేవాడు. మా కుటుంబాల క్షేమాన్ని కాంక్షించేవాడు. చిన్న సమస్య ఉన్నా ఓపికతో విని తగిని పరిష్కారం చూపేవాడు. మా కుటుంబాలలో ఎవరి ఆరోగ్యం బాలేకున్నా, తనకే బాగాలేనట్టు భావించి, తగిన సేవలు అందేందుకు తన పరిచయాలను ఉపయోగించేవాడు. సారు బతికున్నంతకాలం వారంలో కనీసం రెండుమార్లయినా ఫోన్‌ల ద్వారా కానీ, ప్రత్యక్షంగా కానీ మాకు మార్గనిర్దేశం చేసేవాడు.

నిబద్ధతకు మారుపేరు. కీర్తి ప్రతిష్టలకు దూరం. మితభాషి, సూక్ష్మగ్రాహి. అన్నిటికి మించి నిత్య అధ్యయనశీలి. మా ఎదుగుదలను చూసి సంతోషపడేవాడు. నిత్యం మా మేలుకోరిన మానవీయమూర్తి. కరుణ తొణికే కళ్లు మూసుకున్న మా సారును చితిపైన చూసి సందె వాలకముందె మా ఆశలకు మబ్బులు కమ్మినాయి. సారు సహచరి విజయమ్మగారు, మూసిన సారు కనులకు కళ్లజోడు నాతో తొడిగించి చివరిసారి చూసుకోమని కన్నీరయింది. సారు భౌతికంగా లేరు. నా గుండెలో దీపమై వెలుగుతున్నాడు.

ఎవరు దేశభక్తులు? ఎవరు దేశద్రోహులు?



డాక్టర్ దేవరాజు మహారాజు

ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం 'వికాస్' అనే మాట తరచూ మాట్లాడుతూ ఉంది. అది అణగారిన వర్గాల రక్తమాంసాల్ని, మైనార్టీల అస్థిపంజరాల్ని కార్పొరేట్ శక్తులకు నైవేద్యం పెడుతూ దేశాన్ని ప్రగతి మార్గంలో నడిపిస్తోంది? దేశంలోని ప్రతి సగటు మనిషి గుండెమీద చేయివేసుకుని, తమకు తిండి, బట్టా దొరుకుతున్నాయా? అని - తమ పిల్లలకు సరైన చదువు చెప్పించగలుగుతున్నామా? అని ప్రశ్నించుకోవాల్సిన సమయం వచ్చింది. ఈ దేశ ప్రజలకు ఆరోగ్య సదుపాయం, రవాణా సౌకర్యాలు సరిగా అందుతున్నాయా? యువతకు ఉపాధి లభిస్తోందా? రైతులు సంతోషంగా వ్యవసాయం చేసుకోగలుగుతున్నారా? అని ఆలోచించుకోవాల్సిన సమయం వచ్చింది. దేశ ప్రజల్ని మతాల ప్రాతిపదికన, కులాల ప్రాతిపదికన, ఆర్థిక స్థోమతల ప్రాతిపదికన విభజించి పాలిస్తూ 'దేశ్‌క వికాస్' ఎలా తేగలుగుతున్నారో ప్రత్యక్షంగా చూస్తూనే ఉన్నాం. బ్రిటిష్‌వాడు విభజించి పాలించాడంటే అర్థం చేసుకోవచ్చు. వాడు విదేశీయుడు. ఇప్పుడు మరి వీరికేమయ్యింది? అందరం ఈ దేశ వాసులమే కదా?

మరి, ఈ దేశ ప్రజలకు ఏమైందీ? స్వాతంత్ర్యా నంతరం దేశంలో విద్యావంతుల సంఖ్య గణనీయంగా పెరిగింది కదా? వారు చదివిన చదువులు ఎందుకు వారిలో వివేకం పెంచలేకపోతున్నాయి? కుటుంబ బాధ్యతలే నిర్వహించుకోలేని సన్యాసుల చేతికి అధికార పగ్గాలు ఎలా ఇస్తున్నారూ? ఎందుకు ఇస్తున్నారూ? కమాన్, మమ్మల్ని దోచుకోండి! కమాన్, మమల్ని అణగదొక్కండి! కమాన్ మా బతుకుల్ని దుర్భరం చేయండి.. అని అసమర్థులకు ఎందుకు లైసెన్స్ ఇస్తున్నారూ? ప్రభుత్వాధినేతలు చెప్పే అబద్దాల 'భాషణ్'లలో అంత తీపిదనం ఉందా? మన తెలివితేటల్ని, శక్తిని వాళ్ళు ఆవు మూత్రంతో శుద్ధి చేస్తుంటే అంత మజావస్తోందా? ఏమిటీ కారణం? ఎందుకు దేశ పరిస్థితి ఇలావుంది? పడిపోయిన రూపాయి విలువలాగా - హంగర్ ఇండెక్స్‌లో చివరికి చేరిన స్థానం లాగా - ఈ దేశ ప్రజల విజ్ఞత ఎందుకు పడిపోతూ ఉంది? జ్ఞానేంద్రియాలన్నింటినీ మూసిపెట్టుకుని ఎందుకు ఈ దేశ ప్రజలు అజ్ఞానానికి, మూర్ఖత్వానికి పట్టం కడుతున్నారు? ఆలోచించుకోవాల్సిన సమయం వచ్చింది. ఇక పద్మభూషణ్ చిన్న జియ్యర్ విషయం కూడా విశ్లేషించుకోవాల్సి ఉంది. దేశంలో ఉన్న స్వాములు, బాబాలు, అమ్మలకు అందరికీ టోకున పద్మభూషణ్‌లు ఇవ్వాలని కూడా ఈ దేశ ప్రజలు కేంద్ర ప్రభుత్వానికి విన్నవించుకుంటారేమో? ఏమో?

దేశ భక్తుడు షహీద్ భగత్‌సింగ్ ఎందుకు గుర్తుకు రావడం లేదూ? ఈ దేశాన్ని రక్షించుకోవడానికి రక్తం చిందించిన అమరవీరులైన దేశభక్తులెవరూ ఎందుకు గుర్తుకు రావడం లేదూ? ఎందుకు దేశ ద్రోహులను, మోసగాళ్ళను గద్దెనెక్కిస్తున్నాము? మనం ఒక హిందూ, ఒక ముస్లిం, ఒక క్రైస్తవుడిగా పుట్టడమన్నది యాదృచ్ఛికం. ఎవరు, ఎక్కడ, ఏ ప్రాంతంలో పుట్టాలన్నది ఎవరి ఆధీనంలోనూ ఉండదు కదా? ఏది ఏమైనా, అందరం ఈ దేశ వాసులం. భారతీయులం. అంతకన్నా ముఖ్యం... అందరం మనుషులం! తేడాలెందుకూ? విభజనలెందుకూ? కుట్ర పూరితంగా విభజనలు ప్రోత్సహించే వారి ఆట కట్టించాలి కదా? అబద్దాలు చెపుతూ పుకార్లు ప్రచారం చేసే వారి భరితం పట్టాలి కదా? కరోనా కష్ట కాలంలో లక్షలమంది వలస కార్మికులకు కనీసం రైలు, బస్సు సౌకర్యం కల్పించలేరా? లక్షల కోట్లు బ్యాంకు దోపిళ్ళు చేసిన వారిని మాత్రం భద్రంగా దేశం దాటిస్తారా? అదేనా ఈ దేశ చౌకీదారు చేయాల్సినపని? అధిక సంఖ్యాకులైన సామాన్యుల జీవితాల్లో వెలుగులు నింపలేని - 'ప్రజా సేవకులు' మనకు అవసరమా?

> జరుగుతున్న అన్యాయాల సెగ మనకు తగలడం లేదు కదా అని తమాషా చూస్తూ ఉంటే, ఆ తర్వాత మన గురించి గొంతెత్తే వారే ఉండరు. సంఘ్ పరివార్, బీజేపీలు కలిసి ఆ హిట్లర్ పథకాన్ని ఇక్కడ ఈ దేశంలో అమలు చేయాలని అనుకుంటున్నప్పుడు - దేశ ప్రజలు ఏం చేయాలి? అన్యాయాల మీద, అబద్దాల మీద, అరాచకాల మీద అజ్ఞానం మీద, మూర్ఖత్వం మీద, పుకార్ల మీద, కుట్రల మీద, మనుషుల విభజన మీద తీవ్రంగా విరుచుకు పడాలి కదా?

ఈ దేశంలోని యువతరాన్ని సంబోధిస్తూ దేశభక్తుడు షహీద్ భగత్‌సింగ్ చెప్పిన మాటలు ఇలా ఉన్నాయి... "భారత రిపబ్లిక్‌లోని యువతీ యువకులరా! సిపాయిలారా! విశ్రాంతిగా, నిరర్థకంగా నిలబడకండి. అడుగులో అడుగు వేస్తూ కార్యోన్ముఖులుకండి. తీవ్రమైన ఆకలి, పేదరికం మీకు సవాలు విసురుతోంది! దాన్ని తిప్పికొట్టాల్సి ఉంది. మీరొక మంచి మిషన్ (ధ్యేయం)లో నిమగ్నమై ఉన్నారు. దేశం అన్ని వైపులా, అన్ని మూలల్లో విప్లవ జ్వాలలు అంటుకుంటున్నాయి. ప్రజల్ని సమాయత్తం చేయండి. వినిపిస్తున్న బిగుల్ ధ్వని (యుద్ధభేరి) వినండి. విని కదలండి. ఇలాగే నిశ్చేష్టులై నిస్సారంగా జీవితం గడపకండి.." భగత్‌సింగ్ ఆయన కాలంలో చెప్పిన మాటలు ఈ కాలానికి కూడా పనికొస్తాయి. అందువల్ల ఆయన కన్న కలల్ని నిజం చేయాల్సిన బాధ్యత ఈ తరం యువతీ యువకుల మీద ఉంది. వారంతా తీవ్రంగా ఆలోచించాలి. లేవాలి. లేచి, కార్యాచరణకు పూనుకోవాలి. లేకపోతే ఇంకా ఇంకా నష్టం జరిగిపోతుంది. ఆ తర్వాత పశ్చాత్తాపంలో కుమిలిపోయినా లాభం ఉండదు.

హిట్లర్ పరిపాలనా కాలంలో ఫాసిజాన్ని వ్యతిరేకించే ఒక కార్యకర్త, కవి పాస్టర్ నిమోలర్ ఒక కవిత రాశాడు. అది తెలుగులోకి తెస్తే ఇలా ఉంటుంది...



మొదట వాళ్ళు కమ్యూనిస్టుల కోసం వచ్చారు
అప్పుడు నేనేం మాట్లాడలేదు–
కారణం, నేను కమ్యూనిస్టుని కాదు కాబట్టి!
తర్వాత వాళ్ళు ట్రేడ్ యూనియన్ వారికోసం వచ్చారు.
అయినా నేను మాట్లాడలేదు–
కారణం, నేను ట్రేడ్ యూనియన్‌లో లేను కాబట్టి!
ఆ తర్వాత వాళ్ళు యూదుల కోసం వచ్చారు
అప్పుడూ నేనేం మాట్లాడలేదు –
కారణం, నేను యూదుణ్ణి కాదు కాబట్టి!
వాళ్ళు మళ్ళీ నాకోసం వచ్చారు – అంతే
అప్పటికి, నా గురించి మాట్లాడే వాళ్ళే మిగల్లేదు –

జరుగుతున్న అన్యాయాల సెగ మనకు తగలడం లేదు కదా అని తమాషా చూస్తూ ఉంటే, ఆ తర్వాత మన గురించి గొంతెత్తే వారే ఉండరు. సంఘ్ పరివార్, బీజేపీలు కలిసి ఆ హిట్లర్ పథకాన్ని ఇక్కడ ఈ దేశంలో అమలు చేయాలని అనుకుంటున్నప్పుడు – దేశ ప్రజలు ఏం చేయాలి? అన్యాయాల మీద, అబద్దాల మీద, అరాచకాల మీద అజ్ఞానం మీద, మూర్ఖత్వం మీద, పుకార్ల మీద, కుట్రల మీద, మనుషుల విభజన మీద తీవ్రంగా విరుచుకు పడాలి కదా? ఓర్చుకుని, నోరుమూసుకుంటే అది మరింత వినాశనానికే దారితీస్తుంది.

> ఈ దేశ ప్రజలకు ఏమైందీ? స్వాతంత్ర్యా నంతరం దేశంలో విద్యావంతుల సంఖ్య గణనీయంగా పెరిగింది కదా? వారు చదివిన చదువులు ఎందుకు వారిలో వివేకం పెంచలేకపోతున్నాయి? కుటుంబ బాధ్యతలే నిర్వహించుకోలేని సన్యాసుల చేతికి అధికార పగ్గాలు ఎలా ఇస్తున్నారూ? ఎందుకు ఇస్తున్నారూ? కమాన్, మమ్మల్ని దోచుకోండి! కమాన్, మమల్ని అణగదొక్కండి! కమాన్ మా బతుకుల్ని దుర్భరం చేయండి.. అని అసమర్థులకు ఎందుకు లైసెన్స్ ఇస్తున్నారూ?

దేశభక్తులు షహీద్ భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురూలు 20మార్చి 1931న పంజాబ్ గవర్నర్‌కు ఒక లేఖ పంపించారు. అందులోని సారాంశం ఇలా ఉంది... "–మేం చెప్పదల్చుకున్నదేమంటే, ఇక్కడ యుద్ధం ప్రారం భం కానే అయ్యింది. శ్రామికుల శ్రమ శక్తిని అన్యాయంగా దోచుకుని బలిసిపోతున్న కార్పొరేట్లకు వ్యతిరేకంగా ఈ యుద్ధం కొనసాగుతుంది. దోచుకునే కార్పొరేట్లు బ్రిటిషు వారయినా, స్వదేశీయులైనా మాకు ఒక్కటే... వాళ్ళంతా ఒక్కటై సామాన్యుల నడ్డి విరుస్తున్నారు. జీవితాలు దుర్భరం చేస్తున్నారు. అందుకే చెపుతున్నాం. దోపిడీని, అణచివేతను ఇక ఎంత మాత్రమూ సహించం. రక్తం తాగేవాడు స్వదేశీయు డతేనేమిటీ? విదేశీయుడైతేనేమిటి? మాకు అందరూ శత్రువులే!"


ఆనాడు ఆ దేశ భక్తులు వెలిబుచ్చిన ఆవేదనను ఇప్పుడు ఈ దేశ ప్రజలందరూ మళ్ళీ వెలిబుచ్చాల్సిన అవసరం వచ్చింది. కారణం ఇప్పుడు సమకాలీనంలో కూడా అదే పరిస్థితి ఉంది. "ఒకప్పుడు జర్మనీలో జరిగినట్లుగానే ఇప్పుడు భారతదేశంలో బీజేపీ ప్రభుత్వం – అసలు సమస్యల నుండి దృష్టి మరల్చడానికి మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ ఉంది" అని అన్నారు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షులయిన జస్టిస్ మార్కండేయ కట్జూ.

అసలు సమస్యల నుండి దృష్టి మరల్చడానికి మన దేశ నాయకులు ప్రచారం చేస్తున్న అంశాలు: 1. పురాణాల్లో సైన్సు ఉంది. 2. మసీదులో లింగం ఉంది. 3. హిందీ భాషని దేశంలో తప్పనిసరి చేయాలి. 4. ముస్లింలను దేశం నుండి తరిమేయాలి. 5. ఘర్ వాపసీ – ఇతర మతాలలో ఉన్న వాళ్ళందరూ ఒకప్పుడు హిందువులే గనక వారందరూ మళ్ళీ ఇంటికి తిరిగి రావాలి. అంటే హిందువులుగా మారాలి. 6. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఈ దేశంలో ఎలాంటి హక్కులు ఉండకూడదు. 7. మొఘల్ చక్రవర్తులు దుర్మార్గులు వారి కట్టడాలు, ఆనవాళ్ళు ఈ దేశంలో ఉండకూడదు. 8. స్త్రీల వస్త్రధారణ విధానాల వల్లనే రేప్‌లు జరుగుతున్నాయి. 9. ఆవు మూత్రం, ఆవుపేడలతో అన్ని రోగాలు నయం చేసుకోవచ్చు. 10. ఓం శబ్దంలోని మహత్తును నాసా కూడా గుర్తించింది – ఇలా ఇష్టం వచ్చిన విషయం మీద ఇష్టం వచ్చిన విధంగా అబద్దాలు మాట్లాడుతూ దేశ ప్రజల్ని ఆయోమయంలో పడేయాలని వారు అనుకుంటున్నారు. అలా కాలక్షేపం చేస్తూ, అధికారంలో కొనసాగవచ్చు – నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచుకోవచ్చున్నది వారి ఆలోచన!

ఐన్ స్టీయిన్ లాంటి మహాశాస్త్రవేత్త, గోథే లాంటి మహా రచయిత, బెథోవెన్ వంటి మహా సంగీత కారుడు, కాంట్, నీషే, మార్క్స్ లాంటి గొప్ప తత్వవేత్తలు అందరూ జర్మన్లే. కాని 1933లో జర్మనీ–హిట్లర్ ఆధీనంలోకి రాగానే, పరిస్థితుల్ని పూర్తిగా మార్చేశాడు. సమస్య లన్నింటికీ యూదులే కారణమని ప్రచారం చేశాడు. ఆలోచనాపరుల మెదళ్ళలో కూడా విషం నింపాడు. ఫలితం ఏమైంది? సుమారు 60లక్షల మంది యూదు లను గ్యాస్ ఛాంబర్‌లోకి పంపి హత్య చేయించాడు. చరిత్ర పుటల్లో కనీవినీ ఎరగని దుర్మార్గం అక్కడ జరిగిపోయింది. పోలికలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అదే ఫాసిజం పోకడలు ఇప్పుడు ఇక్కడ ఈ దేశంలో కూడా విలయతాండవం చేస్తున్నాయి. తమకు తాము దేశ భక్తులమని ప్రకటించుకున్న వారు, దేశ స్వాతంత్ర్యానికి ముందు గానీ తర్వాత గానీ చేసేదంతా దేశద్రోహమేనన్నది తేలిపోయిన తర్వాత, రగిలిపోతున్న ఈ దేశ ప్రజలు ఆచరణలోకి దిగకుండా ఉంటారా? సామాన్యుల సంఘ టిత శక్తిని తక్కువగా అంచనా వేసే ఈ పాలకులే భవి ష్యత్తులో అవహేళనకు గురికాబోతున్నారు. నియంతలకు చరిత్ర ఏ గతి పట్టిస్తూ వచ్చిందో మనందరికీ బాగా తెలుసు!

– వ్యాసకర్త: కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త.

పొంచివున్న ఆర్థిక హింస



కె. శాంతారావు

"భారతదేశం సుసంపన్నమైనది... భారతీయులు మాత్రం దరిద్రులు." – వలస పాలన కాలంలో వెల్లడైన ఈ అభిప్రాయం అంతకంతకూ రుజువు అవుతూనే ఉన్నది. తిండి, బట్ట, వసతి వంటి కనీస అవసరాలకు నోచుకోనివారు, విద్యావైద్యం అందక ఆకలి దప్పులతో అల్లాడేవారు. మనదేశంలో ముప్పై శాతానికి పైగానే ఉన్నారని అంచనా. అంటే దాదాపు 42కోట్ల మంది.

ప్రపంచీకరణ – సరళీకరణ – ప్రయివేటీకరణ విధానాలు గత ముప్పైమూడు ఏండ్లుగా ముమ్మరంగా అమలవుతున్న నేపథ్యంలో అన్ని రంగాలూ అతలాకుతలం అవుతున్నాయి. ప్రజల కష్టార్జితమైన ప్రభుత్వ సంస్థలన్నీ బాజాప్తుగా కార్పొరేట్‌ల పరం అయిపోతున్నాయి. అడవులు, గనులు, నదులు, సహజవనరుల ఆక్రమణలకు అంతులేకుండా పోతున్నది. ఆర్థిక అక్రమాల అవినీతి తారాస్థాయికి చేరింది. ఫలితంగా ప్రజలు బికారులై రోడ్డున పడుతున్నారు. రోజు రోజుకు నిరుద్యోగం తీవ్రమవుతున్నది. ఈ ముంచుకొస్తున్న ముప్పును ఆక్స్‌ఫామ్ నివేదిక ఆందోళనతో వెల్లడి చేసింది.

నూతన ఆర్థిక విధానాలు అమలులోకి వచ్చాక శతకోటీశ్వరుల ఆదాయం అంతకంతకూ రెట్టింపు అవుతున్నదే తప్ప ఆగటం లేదు. ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా విపత్తు సమయంలో సైతం ఈ కోటీశ్వరుల ఆదాయం మందగించలేదు. సరికదా ఇంకా పెరిగింది. ఈ ఒక్కశాతం ఉన్న కోటీశ్వరుల సంపద ఇరవైరెట్లు పెరిగినట్లు ఆక్స్‌ఫామ్ నివేదిక తెలిపింది.

కష్టజీవులు అహోరాత్రులు కష్టపడి సృష్టించే సంపద ఈ పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థలో కోటీశ్వరులకు ఎగ్రబాకిన కొలదీ విలోమంలో పేదల బతుకులు అగాధంలోకి దిగజారిపోతాయని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇది ఆర్థిక సూత్రం. ఈ ఫలితంగానే నేడు ఈ నివేదిక ప్రపంచంలో ప్రతినిముషానికి పదకొండుమంది ఆకలితో మరణిస్తున్నట్లు పేర్కొన్నది. ఎంత విషాదం?

కుల, మత, లింగ వివక్షలకన్నా ఈ ఆర్థిక వివక్ష భయంకర రాకాసిలా ప్రపంచాన్ని తరమబోతున్నదని హెచ్చరించింది. అయితే ఇది ప్రకృతి వైపరీత్యం కాదు. మానవ కల్పిత వైపరీత్యం. కమ్ముకొస్తున్న ఈ ఆర్థిక వైపరీత్యాన్ని నివారించలేక ఎక్కడికక్కడ పెట్టుబడిదారీ వ్యవస్థ చేతులెత్తేస్తున్నది.

ఈ వైపరీత్యం ఒకే దేశంలో రెండు ప్రపంచాలను సృష్టిస్తున్నది. కేవలం ఆర్థిక సంపాదన కోసం అర్రులు చాచే ప్రపంచం ఒకటైతే, అస్తిత్వాన్ని కాపాడుకుంటూ మనుగడ కోసం పోరాడే ప్రపంచం మరొకటి. ప్రభుత్వాలు సకాలంలో మేల్కొని సరైన చర్యలు గైకొనకపోతే ఈ రెండు ప్రపంచాలు ఎదురెదురుగా నిలిచి ఘర్షణకు సన్నద్ధమయ్యే రోజు ఎంతో దూరంలో లేదు. దేశ ప్రజల సమైక్యత బ్రద్దలవుతుంది. ప్రజల మధ్య వైషమ్యాలు చాలా సులువుగా చెలరేగుతాయి.

అమెరికా, చైనాల తర్వాత ఎక్కువ మంది కుబేరులు ఉన్న దేశం మనదే. 2020లో 120 మంది ఉన్న ఈ కుబేరుల సంఖ్య (శతకోటీశ్వరులు) 2021 నాటికి 142కు పెరిగింది. 2022 నాటికి 166కు చేరింది. 40శాతంకు పైగా దేశ ప్రజల సంపద ఈ ఒక్క శాతం కుబేరుల చేతిలో కేంద్రీకృతమైనట్టు నివేదిక వెల్లడించింది.

దేశంలో కేవలం వందమంది కుబేరుల సంపదను లెక్కిస్తే అది 54లక్షల కోట్ల రూపాయిలట. గత ఏడాది (2021–2022) మన భారత బడ్జెట్ 39లక్షల కోట్లు కాగా, దానికి మించి 15లక్షల కోట్లకు పైగా సంపద వారి వద్దనే ఉంది. దేశం డొల్లవుతుందనే భయం వెంటాడుతున్నది కదా..!

ఆసియాలో మొదటి కుబేరుడు, ప్రపంచంలో రెండవవాడు అయిన గౌతమ్ అదాని సంపద రోజుకు 1612కోట్ల రూపాయలు. మరి మట్టిపనిచేసే రోజువారి సగటు కూలి రూ.150లు. రైతుకు వచ్చే దినసరి సగటు ఆదాయం రూ.340. ఇంత భయంకర వ్యత్యాసాలతో మన 'ప్రజాస్వామ్య' పాలన సాగుతున్నది. అందుకే ఈ పాలనా పద్ధతుల్ని 'దోపిడీ – లూటీ'



అన్నా సరితూగుతాయో లేదో... మన భారత కుబేరుల సంపద 2020–22 మధ్య కాలంలో 121శాతం పెరిగినట్టు (రోజుకు 368కోట్లు) నివేదిక పేర్కొన్నది.

ఈ పాలనా క్రమం అనివార్యంగా సంపన్నులను మరింత సంపన్నులుగానూ, దరిద్రులను మరింత దరిద్రులుగానూ మారుస్తుందని ఆక్స్‌ఫామ్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అమితాబ్ బెహర్ కూడా అభిప్రాయపడటం గమనార్హం.

స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్ళల్లో పంచవర్ష ప్రణాళికలతో మనం ప్రభుత్వరంగ సంస్థలకు పెద్దపీట వేశాం. ప్రయివేటు రంగాన్ని నియంత్రించగలిగాం. అలాగే ఆర్థిక అంతరాలు తగ్గించేందుకు పన్నుల వ్యవస్థను క్రమబద్ధీకరించాం. ఇప్పుడవేమీ లేవు. సరళీకృత ఆర్థిక విధానాలతో అన్ని గేట్లు ఎత్తేసాం. అన్ని రంగాల్లో ప్రభుత్వ పాత్రను నామకా ఉంచుతూ ప్రయివేటుకు ఎర్రతివాచీ పరుస్తున్నాం. కడకు సంక్షేమ భావన నుండే పాలకులు తప్పుకుంటున్న దశ ఇది. సబ్సిడీలు ఎత్తేసి ప్రజల నుండి బలవంతాన పన్నులు వసూలు చేయడమే ప్రధాన ఆదాయ వనరుగా పాలకులు భావిస్తున్నారు. తత్ఫలితమే ఆర్థిక అసమానతల తీవ్రత అని నివేదిక వివరించింది.

2021–22లో వసూలైన 14.83లక్షల కోట్ల జీఎస్‌టీ (వస్తుసేవల పన్ను)లో 62శాతం పేద వర్గాల నుండి వచ్చిందే. సంపన్న వర్గాల నుండి వచ్చింది కేవలం మూడుశాతం మాత్రమే. ఈ పన్నుల పీడనను ప్రధాన మోడీ ఇక దాచలేరు. కాగా, భారత్‌లో పేదలు ఎక్కువ పన్ను చెల్లించడం, సంపన్నులు తక్కువ పన్ను చెల్లించడం ఒక వైపరీత్యంగానే భావించాలి మరి. పేదలకు ఇస్తున్న ఉచితాల వలన (రేషన్, విద్య, వైద్యం, వగైరా) సంపన్నులైన పన్ను చెల్లింపుదార్లు తెగబాధపడిపోతున్నట్టు బీజేపీ పాలకులు వాపోవటం ఇటీవల ఒక ప్యాషన్ అయిపోయింది. కానీ వాస్తవంగా పన్ను చెల్లింపు దారుల్లో పేదలే ఎక్కువ ఉన్నట్టు ఈ నివేదిక స్పష్టం చేసింది.

కరోనా కాలం కూడా కుబేరులకు వరం అయింది. ఆర్థిక వ్యవస్థలు ఒకప్రక్క కుదేలయితే, కుబేరుల ఆస్తులు మాత్రం రెట్టింపు అయ్యాయి. కరోనా రెండేండ్ల సమయాన 84శాతం ప్రజల కుటుంబ ఆదాయం పడిపోయింది. ఆ నిరుద్యోగం కాటు నుండి ప్రజానీకం ఇప్పటికీ విడివడలేదు. కానీ కార్పొరేట్ టాక్స్ తగ్గింపుతో సహా అనేక రాయితీలు కుబేరులకు సాఫీగా దక్కాయి.

> ఒక్కటే మార్గం. అపర కుబేరుల సంపదను పన్నుల వసూళ్ళరూపంలో వెనక్కి తీసుకువచ్చి పేదల సంక్షేమానికి వినియోగిస్తే తప్ప ఆర్థిక సమతుల్యతను సాధించలేమని సాక్షాత్తు ఆక్స్‌ఫామ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గాబ్రియల్ బుచర్ అభిప్రాయపడుతున్నారు.

ఒక్కటే మార్గం. అపర కుబేరుల సంపదను పన్నుల వసూళ్ళరూపంలో వెనక్కి తీసుకువచ్చి పేదల సంక్షేమానికి వినియోగిస్తే తప్ప ఆర్థిక సమతుల్యతను సాధించలేమని సాక్షాత్తు ఆక్స్‌ఫామ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గాబ్రియల్ బుచర్ అభిప్రాయపడుతున్నారు.

భారతదేశంలో అత్యున్నత కుబేరుల సంపదపై ఐదుశాతం పన్నువేసి వసూలు చేస్తే చాలు. ఆ డబ్బుతో (1.37లక్షల కోట్లు) బడికి రాని, బడిమానేసిన బాలలు అందరికీ ఉచిత పాఠశాల విద్యను అందించవచ్చు.

2017–21 ఈ నాలుగేండ్లలో ఆదాని ఆర్జించిన ఆస్తులపై ఐదుశాతం పన్నువేసి వసూలు చేస్తే, ఆ డబ్బుతో (1.79లక్షల కోట్లు) 50లక్షల మంది ఉపాధ్యాయులను నియమించి ఏడాది కాలం జీతాలు ఇవ్వొచ్చట. భారత దేశాన్ని రానున్న కాలంలో అగ్రదేశంగా నిలపాలంటే మౌలిక సదుపాయాల కల్పన (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) పెట్టుబడి (ఇన్వెస్టుమెంట్) కొత్తగా కనుగొనడం (ఇన్నోవేషన్) సమ్మిళతాల (ఇన్‌క్లూజివ్)తో పాటు ఆర్థిక అసమానతల తగ్గుదల (ఇన్ఈక్వాలటీ రిడక్షన్)లపై పాలకులు దృష్టిపెడితే తప్ప నవభారత నిర్మాణం సాధ్యం కాదని ఆ నివేదిక స్పష్టం చేసింది. మరి మనమేం చేయాలీ..?

సెల్:9959745723

మనకంటూ ఓ ఫ్రెండ్స్ సర్కిల్



స్నేహబంధం అమూల్యమైనది. జీవితంలో ప్రతి దశలోనూ మన కష్టసుఖాలు పంచుకోవడానికి ప్రాణ స్నేహితులుండాలంటారు. అయితే వృత్తి-ఉద్యోగాలు, పెండ్లి, పిల్లలు, ఇతర కుటుంబ బాధ్యతల రీత్యా చాలామంది మహిళలు తమ స్నేహితుల్ని కలుసుకునే సందర్భాలు తగ్గిపోతుంటాయి. కొంతమందికి కనీసం ఫోన్లో మాట్లాడుకునేందుకు కూడా సమయం దొరక్కపోవచ్చు. దీనివల్ల వారి మధ్య అనుబంధం కూడా సన్నగిల్లుతూ వస్తుంది. నిజానికి చాలామంది ఈ విషయాన్ని నిర్లక్ష్యం చేస్తుంటారు కానీ.. పెండ్లయి, పిల్లలు పుట్టినా మనకంటూ ఓ ఫ్రెండ్స్ సర్కిల్‌ను కొనసాగించడం మంచిదంటున్నారు రిలేషన్‌షిప్ నిపుణులు. దీనివల్ల వ్యక్తిగతంగా మనకు కాస్త సమయం దొరకడంతో పాటు ఇతర ప్రయోజనాలూ చేకూరతాయంటున్నారు.

- దాంపత్య బంధంలో భార్యాభర్తల మధ్య పొరపచ్చాలు, గొడవలు సహజం. పోనీ.. ప్రతి సమస్యా తల్లిదండ్రులతో పంచుకుందామంటే.. 'ఇంత చిన్న విషయాలకే వాళ్లను టెన్షన్ పెట్టడమెందుకు?' అనిపిస్తుంటుంది. అలాగని వాటిని మనలోనే దాచుకుంటే ఒత్తిడి, ఆందోళన, ఇతర మానసిక సమస్యల బారిన పడక తప్పదు. ఇలాంటప్పుడే మన బాధను పంచుకోవడానికి ఓ స్నేహితురాలుంటే బాగుంటుంది.
- పెండ్లయ్యాక కూడా భర్తలు తమ స్నేహాల్ని కొనసాగించడం, ఆయా సందర్భాల్లో వారిని కలుసుకోవడం, వారితో కలిసి సినిమాలు, షికార్లు, షాపింగ్.. వంటివి చేయడం మనం చూస్తుంటాం. కానీ ఇలా చేసే భార్యలు చాలా తక్కువ. ఇందుకు వ్యక్తిగతంగా, వృత్తిపరంగా పలు కారణాలుంటాయి. అలాగని వాటి మూలంగా మీ వ్యక్తిగత స్వేచ్ఛను, ఇష్టాయిష్టాల్ని త్యాగం చేస్తూ మానసికంగా ఇబ్బంది పడడం కంటే.. స్నేహితులకు కాస్త సమయం కేటాయించడం మంచిదంటున్నారు నిపుణులు.
- వైవాహిక జీవితంలోనే కాదు.. వ్యక్తిగతంగానూ కొన్ని సమస్యలు మనకు సవాలు విసురుతుంటాయి. అలాంటి వాటిలో కొన్ని స్నేహితులతో పంచుకుంటేనే పరిష్కారం దొరుకుతుందనిపిస్తుంది. ముఖ్యంగా.. పెళ్లైన కొత్తలో ఎదురయ్యే లైంగిక సమస్యలు, అప్పుడే పిల్లలు పుట్టకుండా వాయిదా వేసుకునే మార్గాలు.. ఇలాంటి విషయాల గురించి డాక్టర్‌తో చర్చించడం కంటే ఫ్రెండ్స్‌తో సులభంగా పంచుకోగలుగుతాం. వారూ తమ అనుభవంతో కొన్ని సలహాలివ్వగలుగుతారు.. అవి విన్న వెంటనే మనసుకు ఊరట కలుగుతుంది. కాబట్టి ఇలాంటప్పుడు స్నేహితులు మనకు ఎంతో మద్దతుగా నిలుస్తుంటారు.
- వ్యక్తిగతంగానైనా, ఎమోషనల్‌గానైనా.. స్నేహితులు మనకు అన్ని వేళలా అండగా ఉంటారు. అయితే పెండ్లి తర్వాత కొంతమంది మహిళలు ఒంటరితనంతో బాధపడుతుంటారు. ఇందుకు వాళ్ల స్నేహితులకు దూరమవడం కూడా ఓ కారణమంటున్నారు నిపుణులు. భర్త, అత్తింటి వారు నిరాకరించడంతో తమ ఫ్రెండ్స్ సర్కిల్‌కు దూరంగా ఉండే వారు మరికొందరుంటారు. దీనివల్ల జీవితంలో ప్రశాంతత కోల్పోవడంతో పాటు దాంపత్య బంధంలోనూ గొడవలు తప్పవు. అందుకే ఈ సమస్య రాకూడదంటే పెండ్లికి ముందే మీ ఫ్రెండ్స్ సర్కిల్, స్నేహబంధాల గురించి మీకు కాబోయే వారితో చర్చించండి. అలాగే వారి స్నేహితుల గురించీ అడిగి తెలుసుకోండి. దీనివల్ల తర్వాత ఈ విషయంలో ఎలాంటి గొడవలకు తావుండదు.

బరువు పెరుగుతున్నారా..?

మీ పిల్లలు చిన్న వయసు నుంచే క్రమంగా బరువు పెరుగుతున్నారా? అయితే టీనేజ్‌కి వచ్చేసరికి వారు స్థూలకాయులుగా మారే అవకాశం ఉందంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఎందుకంటే టీనేజ్‌లోకి వచ్చేసరికి వారి శరీరంలో క్యాలరీలు కరగడం చాలా వరకు తగ్గుతుందట. ఈ సమయంలో సరైన వ్యాయామం లేకపోవడం, క్యాలరీలు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం.. వంటివన్నీ ఇందుకు ముఖ్య కారణాలుగా చెబుతున్నారు వారు. కాబట్టి బరువు విషయంలో చిన్నతనం నుంచే జాగ్రత్తగా ఉండడం మంచిది. తద్వారా టీనేజ్‌లో ఎదురయ్యే స్థూలకాయం, ఇతర అనారోగ్యాల బారి నుంచి కాపాడుకోవచ్చు. అందుకే టీనేజ్‌లో స్థూలకాయం రాకుండా ఉండాలంటే పిల్లల విషయంలో తల్లులు ముందు నుంచే ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం...



చాలామంది పిల్లలు వారిని ఏది చేయొద్దంటామో.. అదే చేస్తుంటారు. ఆహారం విషయంలోనూ అంతే చేస్తారు. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు.. అని చెప్పినా సరే.. అవే తింటామని మొండికేస్తుంటారు. కానీ వారిని అలాగే వదిలేస్తే టీనేజీలో స్థూలకాయం బారినపడచ్చు. కాబట్టి చిన్నతనం నుంచే జంక్‌ఫుడ్, నూనె సంబంధిత పదార్థాలు, ప్రాసెస్డ్ ఫుడ్.. వంటి కొవ్వులు, క్యాలరీలు అధికంగా ఉండే ఆహార పదార్థాలకు పిల్లల్ని సాధ్యమైనంత వరకు దూరంగా ఉంచాలి. అలాగని వాటిని పూర్తిగా తీసుకోవడం మానేయమంటే వాళ్లు అస్సలే వినరు. కాబట్టి మీరే నెలకో, పదిహేను రోజులకోసారో.. వారికి నచ్చిన ఏదో ఒక పదార్థం తక్కువ మొత్తంలో తినేలా చూడొచ్చు. అలాగే వారు రోజూ ఏం తింటున్నారు..? అనే దానిపైనా ఓ కన్నేసి ఉంచడం మంచిది. తద్వారా కొవ్వులు అధికంగా ఉండే ఆహార పదార్థాలు వారు తినకుండా జాగ్రత్తపడచ్చు.

మంచి జీవనవిధానం

టీనేజీలో స్థూలకాయం బారిన పడకుండా ఉండేందుకు పిల్లలకు వ్యాయామం ఎంతగానో ఉపయోగపడుతుందంటున్నారు నిపుణులు. అలాగని బరువు పెరిగిన తర్వాత కఠినతరమైన వ్యాయామాలు చేసి దాన్ని తగ్గించుకోవడం కంటే చిన్నతనం నుంచే చిన్న చిన్న ఎక్సర్‌సైజ్‌లు చేస్తూ మంచి జీవన విధానాన్ని అలవర్చుకోవడం మంచిది. కాబట్టి తల్లిదండ్రులు ఈ విషయంలో శ్రద్ధ వహించడం ఉత్తమం. కాబట్టి పెద్దలు



వ్యాయామం చేస్తూ.. తమతో పాటు పిల్లల్ని పలు రకాల వ్యాయామాల్లో భాగం చేయాలి. నడక, జాగింగ్, స్కిప్పింగ్,



సైక్లింగ్, మెట్లెక్కడం, యోగా, ఈత, డ్యాన్స్, ఆటలు.. వంటి వాటిని వారి వర్కవుట్ రొటీన్‌లో భాగం చేయాలి. ఇలా అలవాటైన తర్వాత క్రమంగా జిమ్, మెడిటేషన్ తరగతులు, ప్రత్యేక శిక్షణ తరగతుల్లో చేర్పించడం.. మొదలైనవి చేయడం వల్ల అటు మంచి లైఫ్‌స్టైల్ అలవడడమే కాకుండా.. ఇటు బరువు కూడా అదుపులో ఉంటుంది. దీనివల్ల టీనేజీలో ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఎదురవకుండా జాగ్రత్తపడచ్చు.

అధిక సమయం కూర్చుంటే...

పిల్లలు చిన్నతనం నుంచి ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లకు అలవాటు పడడం వల్ల కూడా వారు టీనేజీకి వచ్చేసరికి స్థూలకాయం బారిన పడుతున్నారంటున్నారు నిపుణులు. టీవీ చూడడం.. మొబైల్స్, పీసీలో ఆటలాడడం, సోషల్ మీడియాలో చాటింగ్.. వంటివన్నీ కూర్చొని చేసేవే. ఇలా రోజులో అధిక సమయం కూర్చోవడం వల్ల కూడా వారు బరువు పెరిగే అవకాశం ఉంటుంది. అయితే అసలు టీవీ చూడొద్దు.. గ్యాడ్జెట్స్ ముట్టుకోవద్దు.. అంటే వారు వినరు కాబట్టి రోజులో కొద్దిసేపు ఓ వినోదాత్మక కార్యక్రమమో, వారికి ఇష్టమైన మరేదైనా ప్రోగ్రామో.. చూడనివ్వడం మంచిది. అలాగే మొబైల్ ఉపయోగించేటప్పుడు వారిపై ఓ కన్నేసి ఉంచడం కూడా ముఖ్యమే. తద్వారా వాళ్లు తప్పు దారి పట్టకుండా ముందుగానే జాగ్రత్తపడచ్చు. ఫలితంగా ఊబకాయం రాకుండానూ ఉంటుంది.

పెద్దవారిని చూసే నేర్చుకుంటారు

చిన్నపిల్లల్ని పండ్లు, పచ్చి కూరగాయలు, నట్స్.. వంటి



ఆరోగ్యకరమైన ఆహారం తినమంటే అస్సలు తినరు. కేక్స్, చిప్స్.. వంటివైతే ఇష్టంగా లాగించేస్తారు. ఎందుకంటే వాటి రుచి అలాంటిది మరి. అయితే పిల్లలు అమితంగా ఇష్టపడి తినే ఇలాంటి ఆహార పదార్థాలు వారి ఆరోగ్యానికి అంత మంచివి కావు అన్న సంగతి తెలిసిందే. అందుకే కాస్త కష్టమైనా వారికి చిన్నతనం నుంచే పండ్లు.. క్యారట్, బీట్‌రూట్ వంటి దుంపలు.. బాదం, జీడిపప్పు, పల్లీలు.. వంటి నట్స్ తినిపించడం అలవాటు చేయాలి. పిల్లలు ఏదైనా పెద్దవారిని చూసే నేర్చుకుంటారు కాబట్టి ఆ పని మీరూ చేస్తూ.. వారిని కూడా చేయమని ప్రోత్సహించాలి. ఇలా పిల్లలకు ఆరోగ్యకరమైన ఆహారపుటలవాట్లు చేయడం వల్ల వారు టీనేజీలో స్థూలకాయం బారిన పడకుండా కాపాడచ్చు.. తద్వారా వారి ఆరోగ్యాన్నీ సంరక్షించచ్చు.

తులసితో ఆకులతో ప్రయోజనాలు...

తులసి ఆకుల వల్ల కలిగే ప్రయోజనాల గురించి మనం వింటూనే ఉంటాం. అటు అందానికి, ఇటు ఆరోగ్యానికి ఈ ఆకులు ఎంతగానో ఉపయోగపడతాయి. అయితే ప్రత్యేకించి జుట్టు, దంత సంరక్షణకు వీటిని ఎలా వాడాలో చూద్దాం..

- ఎండిన తులసి ఆకులను పొడి చేసి గాలి చొరబడని డబ్బాలో పెట్టుకోవాలి. రోజూ రాత్రి పడుకునే ముందు ఈ పొడిని నీళ్లతో కలిపి పళ్లపై పది నిమిషాలు రుద్దాలి. క్రమం తప్పకుండా ఇలా చేయడం దంత సంరక్షణకు సహకరిస్తుంది.
- తులసి చర్మం, దంతాలకే కాదు.. కేశ సౌందర్యానికి, ఆరోగ్యానికి కూడా ఉపయోగకరమే. తలలో చుండ్రు, దురద, చిన్న చిన్న కురుపులు రావడం వంటి సమస్యలతో కొంతమంది బాధపడుతుంటారు. ఇటువంటి వారికి తులసి నూనె



చక్కటి పరిష్కార మార్గం. దీనికోసం తులసి ఆకుల పొడిని సుమారు పది స్పూన్లు తీసుకుని ఆ పొడిని ఒక డబ్బా కొబ్బరి నూనెతో కలిపి వేడి చేయాలి. నూనె వేడెక్కడం మొదలయ్యాక అందులో కొన్ని మెంతులు వేయాలి. మెంతులు నూనెలో ఉడికిన తర్వాత స్టవ్ ఆపేసి నూనెను చల్లార్చాలి. పొడిగా ఉన్న సీసాలో ఈ నూనెను భద్రపరచుకొని వారానికి రెండుసార్లు దీంతో మర్దనా చేసుకొని గంట తర్వాత తలస్నానం చేస్తే సమస్య సులభంగా పరిష్కారమవుతుంది. మెంతులు, తులసి కలిసి ఉండడం వల్ల శిరోజాలు ఆరోగ్యవంతంగా కూడా తయారవుతాయి.

- రోజూ కొన్ని తులసి ఆకులను నమలడం వల్ల జలుబు వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు.
- తులసి ఆకులు, గుడ్డు తెల్లసొన కలిపి పేస్ట్‌లా తయారుచేసి 20 నిమిషాలు ముఖానికి పట్టించి కడిగేయాలి. వారానికి ఒకసారి ఇలా చేస్తే చర్మం బిగుతుగా మారి ముఖం కాంతిని సంతరించుకుంటుంది.
- తులసి రసాన్ని తాగడం వల్ల చర్మానికి, శిరోజాలకు, పళ్లకు చాలా మంచిది. అలాగే శరీరంలో వ్యాధినిరోధక శక్తి కూడా పెరుగుతుంది.

అమర జవాన్ల త్యాగాలు మరువలేనివి : సీఎం కేసీఆర్

(మొదటిపేజీ తరువాయి)

పతావిష్కరణ చేశారు. జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి సీఎం పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అమర జవానులకు సీఎం కేసీఆర్ శ్రద్ధాంజలి ఘటించి, ఘన నివాళులు అర్పించారు. ప్రగతి భవన్ లో జాతీయ పతాకావిష్కరణ అనంతరం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో అమర జవానుల స్మారక స్థూపం వద్దకు వెళ్లి జ్యోతి ప్రజ్వలన చేసి, పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, సత్యవతి రాథోడ్, చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, నవీన్ రావు, శంభీపూర్ రాజు, మధుసూధనాచారి, సీఎస్ శాంతి కుమారి, డీజీపీ అంజనీ కుమార్, సీఎంఓ ఉన్నతాధికారులు, సిబ్బంది, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే దేశభక్తికి ప్రతీక

(మొదటిపేజీ తరువాయి)

రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక సూత్రాలపై దాడులు జరుగు తున్నాయి. గత ఏడెనిమిదేండ్లుగా సంపన్నులు శతకోటీశ్వరుల వుతుంటే..పేదలు మరింత అట్టడుగుస్థాయికి దిగజారుతున్నారు. ఇది ఆర్థిక అంతరాల్లోనే కాకుండా సామాజిక అంశాల్లోనూ వారికి సమన్యాయం దక్కటంలేదు .అల్పసంఖ్యాకవర్గాలపై ప్రాణాలు తీసేలా హంతకదాడులు జరుగుతున్నాయి. దేశ సమానత, సమగ్రత అంటేనే సమన్యాయం. కానీ అలా ఎక్కడా జరగటంలేదు. దళితులు, ఆదివాసీలు, మహిళలపై అంతులేని అరాచకాలతో భయోత్పాతం కొనసాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో రాజ్యాంగాన్ని కాపాడుకోవటంతో పాటు.. మనకు రాజ్యాంగం కల్పించిన హక్కుల కోసం పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైంది" అని ఏచూరి పిలుపునిచ్చారు.

బడ్జెట్ హల్వా

న్యూఢిల్లీ : ఆర్థిక సంవత్సరం 2023-24కు సంబంధించిన బడ్జెట్ రూపకల్పన కసరత్తును గురువారం ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ లాంచనంగా ప్రారంభించారు. ప్రతీ ఏడాది తరహాలోనే హల్వా తయారు చేసి సిబ్బందికి పంచడం ద్వారా ఈ ప్రక్రియను మంత్రి ప్రారంభించారు. ఢిల్లీలోని ఆర్థిక మంత్రిత్వ శాఖ నార్త్ బ్లాక్‌లో జరిగే ఈ బడ్జెట్ కసరత్తు సమయంలో ఎంపిక చేసిన ఉన్నతాధికారులు మినహా ఎవరినీ లోనికి, బయటికి పంపించరు. కనీసం కుటుంబ సభ్యులతోనూ ఎలాంటి సంప్రదింపులకు వీలుండదు. ఇందులో పాల్గొన్న అధికారులను పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాతే ఇంటికి అనుమతిస్తారు. హల్వా కార్యక్రమంలో ఆర్థిక శాఖ సహాయ మంత్రులు పంకజ్ చౌదరీ, భగ్వత్ కిసన్‌రావు కరడ్, ఆ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కరెంట్ కోతలు.. రైతు వెతలు

(మొదటిపేజీ తరువాయి)

సాంకేతిక సమస్యలతో పంటలెండి పోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. గంగారాముకు చెందిన దేవయ్యకు పదెకరాల పొలముంది. యాసంగిలో రెండెకరాల్లో వరి, మిగతా పొలంలో గోధుమ, మొక్కజొన్న, కూర గాయలు సాగు చేశాడు. ఐదారు రోజులుగా కరెంట్ సరిగ్గా రాకపోయే సరికి ఆరుతడి పంటలకు నీళ్లు పెట్టకపోవడం వల్ల వాడుపట్టాయని తెలిపాడు. కరెంట్ కోతల వల్ల మోటర్ వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుందని పేర్కొన్నాడు. సర్దార్ అనే రైతు రెండెకరాల్లో గోధుమ, ఎకరంలో వరి సాగు చేశాడు. గోధుమకు నీళ్లు కట్టడానికి కరెంట్ కోత వల్ల వీలుకావడం లేదని తెలిపాడు. పొద్దున్నే నీళ్లు పెడదామని ఉదయం 6గంటలకు పొలం వద్దకెళ్తే సాయంత్రం వరకు కరెంట్ రాలేదన్నాడు. గోధుమ, ఇతర ఆరుతడి పంటలకు నీళ్లు కట్ట లేదన్నాడు. అప్పటికే తడారిపోయిన పైర్లకు నీళ్లు కట్టకపోయేసరికి ఎండిపోతున్నాయని తెలి పాడు.



నీటి ఎద్దడితో దెబ్బతింటున్న పైర్లు

కరెంట్ కోతల వల్ల ఆరుతడి పంటలకు నీటి ఎద్దడి ఏర్పడుతుంది. మోటర్లు నడవక కింది పొలాలు వాడుబట్టిపోతున్నాయి. వరి, ఇతర పైర్లకు తెగుళ్లు సోకాయి. పురుగుమందులు పిచికారి చేస్తున్నందున పొలాల్లో గుంటలు పడి నీటి మట్టం తగ్గింది. పైర్లు ఎదగడం, చలితగ్గి ఎండలు కాస్తుండటంతో నీటి విని యోగం పెరుగుతోంది. ఆటోమెటిక్ స్టాటర్ పెడితే వచ్చి పోయే కరెంట్ ఎచ్చుతగ్గుల వల్ల మోటర్లు కాలి పోతున్నాయి. గోధుమలు, మొక్కజొన్న, కూర గాయలు ఇతర ఆరుతడి పైర్లకు సమ యాను కూలంగా నీరు కట్టలేకపోతున్నారు.

సంగారెడ్డి జిల్లాలో 99,616 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లున్నాయి. యాసంగి సీజన్‌లో 60 వేల ఎకరాల్లో వరినాట్లేశారు. మెదక్ జిల్లాల్లో 57693 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. యాసంగిలో 1.35 లక్షల ఎకరాల్లో నాట్లు వేశారు. మరో 50 వేల ఎకరాల్లో నాట్లు వేయనున్నారు. సిద్దిపేట జిల్లాలో లక్ష ఎకరాల్లో వరి నాట్లు వేశారు. జిల్లాలో 80 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లున్నాయి. యాసంగిలో వరితో ఆరుతడి పంట లేశారు. వీటికి ఎక్కువ మొత్తంలో విద్యుత్ మోటర్ల ద్వారానే నీటిని అంది స్తున్నారు.

అనధికారిక కోతలు..

వ్యవసాయానికి ఒక్కో సర్కిల్‌లో ఒక్కో విధంగా కరెంట్ సరఫరా అవుతోంది. ఎక్కువ ప్రాంతాల్లో తెల్లవారుజామున 4 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు, కొన్ని ప్రాంతాల్లో ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 5 గంటలు, ఇంకొన్ని చోట్ల 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇలా ఆయా సర్కిల్స్, సబ్‌స్టేషన్ల వారిగా సగటున రోజుకు పది నుంచి 12 గంటలు వ్యవసాయానికి సరఫరా చేస్తున్నారు. ఇందులో మధ్యమధ్యలో నాలుగైదు సార్లు కోత పెడుతున్నారు. సరఫరాలో మధ్య మధ్యలో ట్రిప్ అవ్వడం, సాంకేతిక లోపాల పేర కట్ కావడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కోతలకు తోడు ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ కాలిపోతున్నాయి. సిద్దిపేట జిల్లాలో డిసెంబర్ నెలలో 353 ట్రాన్స్‌ఫార్మర్లు, జనవరిలో 182 ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. సంగారెడ్డి, మెదక్ జిల్లాలోనూ ఈ నెలలో 350 ట్రాన్స్‌ఫార్మర్లు వరకు కాలిపోయినట్టు సమాచారం. ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ చేసి బిగించడానికి రెండు మూడు రోజులు పడుతుండటంతో పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

కోతల వల్ల పొలాలు ఎండుతున్నయ్:
భూమయ్య, రైతు, రేగోడు, మెదక్ జిల్లా



వారం పది రోజులుగా కరెంట్ కోతలు పెడుతున్నారు. పైర్లు ఇప్పుడే పచ్చపడుతున్నాయి. రోగాలొస్తే మందులు కొట్టినం. చలి తగ్గి ఎండ పెరిగే సరికి నీటి విని యోగం పెరిగింది. తీరా కరెంట్ సరిగ్గా రాకపోయే సరికి కింది పొలాలకు నీళ్లు పారడంలేదు. కరెంట్ 12 గంటలిస్తున్నమని లైన్‌మెన్ చెబుతడు. మోటరు పెడితే ఎప్పుడు పోస్తదో ఎప్పుడు ఆగిపోతదో తెల్వని పరిస్థితి. పొలాల వద్దే పడిగాపులు కాస్తున్నం.

పొలాల వద్దే ఉంటున్నం:
దేవయ్య, గంగారం, సంగారెడ్డి జిల్లా



కరెంట్ కోతల వల్ల పొలాల వద్దే ఉంటున్నం. కరెంట్ వచ్చిందంటే మోటర్ పెడతం. పోయి ఎప్పుడు వస్తదో తెల్వక బావికాడే ఉండాల్సి వస్తుంది. వరి నాట్లేసి పది రోజులైంది. సరిగ్గా నీరు పారట్లేదు. గోధుమ, మొక్కజొన్న, మిరప, ఆకుకూరలు, కూరగాయలకు నీళ్ల తళ్లు సమయానికి పెట్టకపోతే ఎండిపోతయి. రెండు మూడు రోజులుగా కరెంట్ సరిగ్గా రాక పైర్లన్నీ వాడుబట్టినయి. రోజూ కరెంట్ తీస్తే పంటలన్నీ ఎండి పెట్టుబడి మట్టిపాలవుతుంది.

నేటి నుంచి ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు

(మొదటిపేజీ తరువాయి)

విడుదల చేశారు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు, మాన్యువల్‌గా పదోన్నతుల ప్రక్రియను చేపడతామని తెలిపారు. కేటగిరీ వారీగా ఖాళీలు, ప్రధానోపాధ్యాయుల పదోన్నతులకు అర్హులైన స్కూల్ అసిస్టెంట్ల సీనియార్టీ జాబితాలు ఆన్‌లైన్‌లో ప్రకటిస్తామని పేర్కొన్నారు. శనివారం నుంచి ఈనెల 30 వరకు బదిలీల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తామని వివరించారు. దరఖాస్తుల హార్డ్ కాపీలను ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు సంబంధిత ప్రధానోపాధ్యాయులకు, ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత టీచర్లు సంబంధిత ఎంఈవోలకు, మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉపాధ్యాయులు సంబంధిత కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు.. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు డీఈవోకు ఈ నెల 31 నుంచి వచ్చేనెల రెండో తేదీలోపు సమర్పించాలని తెలిపారు.

ఉపాధ్యాయ బదిలీల మార్గదర్శకాలు :

- ఒకే పాఠశాలలో ఫిబ్రవరి ఒకటి నాటికి కనీసం రెండేండ్ల సర్వీసు ఉన్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు దరఖాస్తు చేసేందుకు అర్హులు.
- ఒకే పాఠశాలలో గెజిటెడ్ హెచ్ఎంలు ఐదేండ్లపాటు మిగతా ఉపాధ్యాయులు ఎనిమిదేండ్లు పనిచేస్తే బదిలీ తప్పనిసరి.
- రిటైర్‌మెంట్‌కు ముందు మూడేండ్ల సర్వీసు ఉన్న వారి ఇష్ట ప్రకారం బదిలీ ఉంటుంది.
- ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఈనెల 28 నుంచి 30 వరకు స్వీకరిస్తారు.
- ఏప్రిల్ 23న రిలీవ్ అయి 24న బదిలీ అయిన పాఠశాలల్లో చేరాలి.
- స్పౌజ్, వికలాంగులు, పెండ్లికానివారు, వితంతువులకు 10 పాయింట్లు అదనంగా ఉంటాయి.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థల ఉద్యోగులకు స్పౌజ్ వర్తిస్తుంది.
- ఓడీ ఉన్న ఉపాధ్యాయ సంఘాలు, గుర్తింపు పొందిన సంఘాల జిల్లా, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు 10 అదనపు పాయింట్లు ఉంటాయి.
- ఒకే జిల్లాలో పని చేస్తున్న వారికి మాత్రమే స్పౌజ్ పాయింట్లు వర్తిస్తాయి.
- ప్రధానోపాధ్యాయులకు మల్టీజోన్ స్థాయిలో, ఇతర ఉపాధ్యాయులకు జిల్లా స్థాయిలో బదిలీలు, పదోన్నతులు జరుగుతాయి.

జీరో సర్వీసు బదిలీలకు అనుమతివ్వాలి : యూఎస్‌పీసీ

సాధారణ బదిలీల్లో జీరో సర్వీసుతో ఉపాధ్యాయులందరికీ దరఖాస్తు చేసుకునే అవకాశమివ్వాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) డిమాండ్ చేసింది. అయినా ప్రభుత్వం పట్టించుకోకుండా రెండేండ్ల కనీస సర్వీసు ఉన్న వారే అర్హులని ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపింది. ఈ సమస్యలు కొందరు ఉపాధ్యాయుల్లో అసంతృప్తికి కారణమౌతున్నాయని విమర్శించింది. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి హామీ ఇచ్చిన విధంగా సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సాధారణ బదిలీలకు ముందే స్పౌజ్ టీచర్లకు న్యాయం చేయాలని కోరింది. స్థానికంగా పనిచేస్తున్న ఉపాధ్యాయులను 317 జీవో పేరుతో స్థానికేతర ప్రాంతాల జిల్లాలకు కేటాయించి ఏడాది పూర్తయ్యిందని ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి సదానందంగౌడ్, ఎం పర్వత్‌రెడ్డి తెలిపారు. వారికి జీరో సర్వీసును బదిలీ అర్హతగా పరిగణించి సర్వీసు పాయింట్లను కూడా లెక్కించి న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీరో సర్వీసు ఉపాధ్యాయుల బదిలీలను చేపట్టాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై అశోక్‌కుమార్, ముత్యాల రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 317 జీవో బాధితులను కేటాయించినపుడు పాఠశాలల అవసరం మేరకు మారుమూల ప్రాంతాలకు బదిలీ చేశారని తెలిపారు. జీరో సర్వీసు ప్రాతిపదికన ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలని టీఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ అబ్దుల్లా, చందూరి రాజిరెడ్డి డిమాండ్ చేశారు. 22 వేల మంది ఉపాధ్యాయులు స్థానికతను కోల్పోయి బాధితులుగా ఉన్నారని తెలిపారు. వారికి సత్వరం న్యాయం చేయాలని కోరారు.



జాతీయోద్యమం తరహాలో మరో పోరాటం

- హామీలు అమలు చేయకుంటే మోడీ సర్కారును గద్దెదించుతాం : ఎస్‌కేఎం నేతల హెచ్చరిక
- హైదరాబాద్‌లో ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ నుంచి ఇందిరాపార్క్ వరకు ప్రదర్శన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలోని రైతాంగానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందేనని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) నేతలు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మోడీ ప్రభుత్వాన్ని గద్దెదించుతామని హెచ్చరించారు. డిమాండ్ల సాధన కోసం జాతీయోద్యమం తరహాలో మరోపోరాటం చేస్తామని ఉద్ఘాటించారు. భవిష్యత్తులో రైతాంగ పోరాటాన్ని ప్రజా ఉద్యమంగా నిర్మిస్తామన్నారు. ఎస్‌కేఎం ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్ నుంచి ఇందిరాపార్కు వరకు ప్రదర్శన నిర్వహించారు. ఎస్‌కేఎం రాష్ట్ర నాయకులు టి సాగర్, పశ్య పద్మ, రాయల చంద్రశేఖర్, కోటేశ్వర్‌రావు, జక్కుల వెంకటయ్య, కొండారెడ్డి, కొండల్, ప్రసాదన్న, ప్రజాసంఘాల నాయకులు ఆర్ వెంకట్రాములు, సృజన మాట్లాడుతూ రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల మోడీ తెచ్చిన మూడు వ్యవసాయ చట్టాలతోపాటు విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలంటూ సుమారు 13 నెలలపాటు రైతులు ఐక్యంగా పోరాడారని గుర్తు చేశారు. 750 మంది రైతాంగ అమరవీరుల త్యాగాలతో సాగిన ఆ ఉద్యమం ఫలితంగా 2021, డిసెంబర్ తొమ్మిదిన సమస్యలను పరిష్కరిస్తామంటూ కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా హామీచ్చిందని చెప్పారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం రైతులు పెట్టిన పెట్టుబడికి 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించే చట్టం తేవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సవరణబిల్లును రద్దు చేయాలని కోరారు. దేశవ్యాప్తంగా రైతు రుణాలను ఏకకాలంలో మాఫీ చేయాలని చెప్పారు. లఖింపూర్‌ఖేరి ఘటనకు బాధ్యులైన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ప్రభుత్వ పంటల బీమా పథకాన్ని మార్చి రైతులకనుగుణంగా చేయాలన్నారు. చిన్న-సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలు రైతులకు నెలకు రూ.ఐదు వేల పెన్షన్ ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. కౌలు రైతులకు రుణార్హత కార్డులివ్వాలనీ, అటవీ హక్కుల చట్టం-2006 ప్రకారం పోడు సాగుదార్లందరికీ హక్కు పత్రాలివ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తేయాలన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించి తీరుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం ఉపాధ్యక్షులు పి జంగారెడ్డి, రైతు సంఘం నాయకులు రాంచందర్, రామకృష్ణారెడ్డి, ముసలయ్య, సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, సహాయ కార్యదర్శులు రమేష్, శ్రీకాంత్, నగర కార్యదర్శి ఎం వెంకటేష్, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధర్మానాయక్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్యనాయక్, పట్నం రాష్ట్ర నాయకులు ప్రసాద్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం, నాయకులు కిషోర్, మండల వెంకన్న, పీవైఎల్ ప్రధాన కార్యదర్శి కెఎస్ ప్రదీప్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ, పీడీఎస్‌యూ అధ్యక్షులు మహేశ్, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు గడ్డం శ్యామ్, రిటైర్డ్ వ్యవసాయ శాస్త్రవేత్త సోము మర్ల, రైతు శ్రేయోభిలాషి రవి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ప్రభుత్వ ఫలాలు సక్రమంగా అందినప్పుడే అసలైన అభివృద్ధి :గుండెల



నవతెలంగాణ-హయత్ నగర్

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం నుంచి వస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు సక్రమంగా అందినప్పుడే నిజమైన రాజ్యాధికారం సాధించిన వారవుతామని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి గుండెల ధర్మేంద్ర అన్నారు. బీఆరెస్ ప్రభుత్వంలో కేవలం కుటుంబ పాలన సాగుతోందని, అందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ అధికారులకు ఉన్నతమైన పోస్టింగ్‌లు ఇవ్వకుండా వేధిస్తున్నారని, ప్రస్తుతం ఈ ప్రభుత్వంలో పూర్తిగా కుల వ్యవస్థ నడుస్తుందని మండిపడ్డారు. బీఎస్పీ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా, వైద్యంపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు.

దొడ్డి దారి బదిలీలను రద్దు చేయాలి : టీఎస్ యూటీఎఫ్

నవతెలంగాణ-తుర్కయాంజల్

పైరవి బదిలీలను తీవ్రంగా ఖండిస్తున్నామని, దొడ్డి దారి బదిలీలను వెంటనే రద్దు చేయాలని ఆ సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోపాల్ నాయక్, వెంకటప్ప గురువారం ఒక ప్రకటనలో కోరారు. పారదర్శకంగా బదిలీలు చేసుకోవాలని, సంఘాల పంచాయతీతో ప్రభుత్వానికి చెడ్డపేరు తేవద్దని నీతి మాటలు చెపుతూ ప్రభుత్వమే పారదర్శకతకు పాతరేసి పైరవీ బదిలీలకు తెరతీస్తే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లాలో హెచ్ఆర్ఏ ప్రాంతాల్లోని బడులకు దొడ్డిదారి ఉత్తర్వులు తెచ్చుకొని మారుమూల ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల ఆశలపై నీళ్లు చల్లడం సబబు కాదన్నారు. ఉపాధ్యాయ సంఘాలతో జరిపిన చర్చలలో పారదర్శకంగా బదిలీలు చేస్తామని చెప్పి ప్రభుత్వమే పారదర్శకతకు తూట్లు పొడవడం నష్టదాయకమన్నారు. పైరవీ బదిలీలు ఆపాలి లేకపోతే జిల్లా వ్యాప్తంగా అన్యాయానికి గురైన ఉపాధ్యాయులను సంఘటితపరిచి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

జోరందుకున్న క్యాంపు రాజకీయాలు

- మీర్‌పేట్ మేయర్‌పై అవిశ్వాసానికి సిద్ధమవుతున్న కార్పొరేటర్లు
- బీఆర్ఎస్, బీజేపీ వేర్వేరుగా ప్రయత్నం
- మూడేండ్ల పదవీ కాలం ముగియడంతో అసమ్మతుల హడావిడి
- అసెంబ్లీలో నాలుగేళ్లకు తీర్మానం చేసినా గవర్నర్ వద్ద ఫైల్ పెండింగ్



నవతెలంగాణ - మీర్‌పేట్

మున్సిపల్ కార్పొరేషన్‌లో పాలకవర్గం ఏర్పడి మూడేండ్లు పూర్తి అవుతుండటంతో మీర్ పేట్ మేయర్‌పై అవిశ్వాసానికి కార్పొరేటర్లు సిద్ధమవుతున్నారు. అధికార బీఆర్ఎస్, ప్రతిపక్ష బీజేపీ కార్పొరేటర్లు మేయర్‌పై అవిశ్వాసానికి వేరువేరుగా పావులు కదుపుతున్నారు. మున్సిపల్ చట్టం- 2019 ప్రకారం పదవీకాలం మూడేండ్లు గడిస్తే మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం ఉంది. దీంతో ఎన్నో రోజులుగా మేయర్ భర్త ప్రవర్తన ఇతర విషయాలపై గుర్రుగా ఉన్న కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానం పెట్టడానికి ఒకవైపు అధికార బీఆర్ఎస్ మరోవైపు ప్రతిపక్ష బీజేపీ ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాయి. మున్సిపల్ చట్టంలో అవిశ్వాస తీర్మానానికి మూడేళ్లుగా ఉన్న దాన్ని నాలుగేండ్లకు పొడిగిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసినా ఆ ఫైల్ రాష్ట్ర గవర్నర్ తమిళిసై దానికి ఆమోదం తెలుపకపోవడంతో పాత చట్టమే అమలులో ఉంది. కాబట్టి అసంతృప్తిగా ఉన్న కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు.





అంతా ఆ నలుగురిదే పెత్తనం

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో గత కొంతకాలంగా జోరుగా గ్రూపు రాజకీయాలు జరుగుతున్నాయి. కార్పొరేషన్, పార్టీలోను ఆ నలుగురిదే పెత్తనం నడుస్తుండటంతో కార్పొరేటర్లు అసహనం, అసమ్మతితో నిరుత్సాహంగా ఉన్నారు. కార్పొరేషన్‌లో పదవులు, కాంట్రాక్టులు, కమీషన్లు, అభివృద్ధి పనుల్లో సైతం వారి పెత్తనమే ఉండటంతో కొందరు తిరుగుబాటు జెండా ఎగరవేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మేయర్, ఇతర నాయకుల తీరుపై పలుమార్లు స్థానిక మంత్రి మాట్లాడినా ప్రయోజనం లేకపోయింది.

అవిశ్వాస తీర్మానంపై అధిష్టానం అయిష్టత

మేయర్‌పై అవిశ్వాస తీర్మానానికి కార్పొరేటర్లు సన్నద్ధమవుతున్నట్లు తెలుసుకున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి దీనిపై విముఖతతో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కార్పొరేషన్‌లో మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెడితే ఆ ప్రభావం ఎలా ఉంటుందని ఆలోచిస్తున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మేయర్ భర్త వ్యవహారశైలి మంత్రికి తలనొప్పిగా ఉండటంతో అసెంబ్లీ ఎన్నికల సమయంలో మేయర్‌ను మార్చితే ఏంటి పరిస్థితి అన్నే అంశంపై పలువురితో చర్చిస్తున్నట్టు తెలుస్తోంది. అసమ్మతి లేకుండా ఉండేందుకు మేయర్‌ను మార్చి అందరినీ కలుపుకొని వెళ్లే వ్యక్తిని పెడితే అసెంబ్లీ ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పనిచేసే అవకాశం ఉంటుందా..? లేక మొత్తానికే అవిశ్వాస తీర్మానం పెట్టకుండా నివారించాలా..? అనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే బీఆర్ఎస్ పార్టీ ఎక్కువ మంది నేతలు అవిశ్వాస తీర్మానానికే మొగ్గుచూపుతున్నట్లు పార్టీ కార్పొరేటర్లు, నాయకులు చెపుతున్నారు.

మేయర్ కుర్చీ కోసం ద్విముఖ పోటీ...

మీర్‌పేట్ మున్సిపల్ మేయర్ పదవి షెడ్యూల్ ట్రైబ్(ఎస్టీ) జనరల్‌గా కేటాయించారు. దాంతో మూడేండ్ల క్రితం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్ఎస్ నుండి ఇద్దరు (12వ డివిజన్ కార్పొరేటర్ ఇంద్రావత్ రవి నాయక్, 15వ డివిజన్ కార్పొరేటర్ (ప్రస్తుత మేయర్) ముడావత్ దుర్గా దీప్ లాల్ చౌహన్, బీజేపీ నుండి 29వ డివిజన్ కార్పొరేటర్ నీలా రవి నాయక్ గెలిచారు. టీఆర్ఎస్ నుండి గెలిచిన ముడావత్ దుర్గా దీప్ లాల్ చౌహన్ మేయర్‌గా ఎన్నికయ్యారు. అప్పటి నుండి మేయర్ భర్త స్థానిక కార్పొరేటర్లను పట్టించుకోకుండా వ్యవరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సొంత పార్టీ కార్పొరేటర్లే అతనిపై నిప్పులపై ఉప్పు చల్లినట్లుగా చటపటమంటూ బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. పదవీకాలం మూడేండ్లు ఎప్పుడు పూర్తవుతుందా? ఎదురుచూస్తున్న వారికి ఇప్పుడు సమయం వచ్చింది. ఇదే అదునుగా అధికార బీఆర్ఎస్, ప్రతిపక్ష బీజేపీ కార్పొరేటర్లు వేర్వేరుగా అవిశ్వాసానికి సిద్ధమవుతున్నారని బహిరంగంగానే చర్చలు జరుగుతున్నాయి. కొత్తగా మేయర్ కుర్చీపై బీఆర్ఎస్ పార్టీ నుండి 12వ డివిజన్ కార్పొరేటర్ ఇంద్రావత్ రవి నాయక్, బీజేపీ నుండి 29వ డివిజన్ కార్పొరేటర్ నీలా రవి నాయక్‌లు పోటీ పడుతున్నారు.

నేడో రేపో కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం నోటీసు?

నేటితో పాలకవర్గం పదవీకాలం మూడేండ్లు పూర్తి అవ్వడంతో బీఆర్ఎస్, బీజేపీ అసమ్మతి కార్పొరేటర్లు మేయర్‌పై వేర్వేరుగా కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇస్తున్నట్లు కొందరు అసమ్మతి కార్పొరేటర్లు చెబుతున్నారు. దాదాపు 35మంది అవిశ్వాస తీర్మానానికి సిద్ధంగా ఉన్నామని అందరూ స్వచ్ఛందంగా సంతకాలు చేశారని కార్పొరేటర్లు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. అయితే అవిశ్వాస తీర్మానం కేవలం మేయర్ పైనేనా.. లేక డిప్యూటీ మేయర్ పైన కూడా ప్రవేశ పెడతారా..? చూడాలి మరి.

రాజ్యాంగాన్ని అందరూ గౌరవించాలి

రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా గణతంత్ర వేడుకలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కుల వల్లే అన్ని వర్గాల ప్రజలకు విద్య ఉద్యోగ రంగాల్లో సమాన అవకాశాలు లభిస్తున్నాయని సీపీ డీఎస్ చౌహాన్ అన్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో గురువారం 74వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో నేర నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సైబర్ నేరాల పట్ల ప్రజలలో అవగాహన కల్పించడానికి ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తున్నామన్నారు. మహిళల భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్‌తోపాటు అని విభాగాల అధికారులు పాల్గొన్నారు.



తెలుగుదేశం పార్టీ హైదారాబాద్ జిల్లా కార్యాలయంలో గణతంత్ర దినోత్సవాల సందర్భంగా సికింద్రాబాద్ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు పి.సాయిబాబా జాతీయజెండా ఎగురవేశారు. వర్కింగ్ ప్రసిడెంట్ నల్లేల్ల కిషోర్, ప్రధాన కార్యదర్శులు పి.బాలరాజ్ గౌడ్, రాష్ట్ర నాయకులు పెద్దోజు రవీంద్రాచారి పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిటీబ్యూరో

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని

కలెక్టరేట్ ముందు నేడు ధర్నా

నవ తెలంగాణ-వనస్థలిపురం

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 27న రంగారెడ్డి కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్ పిలుపునిచ్చారు. సీఐటీయూ ఎల్బీనగర్ సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య అధ్యక్షతన గురువారం 74వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా వనస్థలిపురం లేబర్ అడ్డా దగ్గర అడ్డా అధ్యక్షులు ఐత రాజు ఆంజనేయులు జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిరుద్యోగం, నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని విమర్శించారు. పోరాడి తెచ్చుకున్న 44 చట్టాలను నాలుగు కోడ్‌గా తీసుకొచ్చి కార్మిక హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తోందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం భవన నిర్మాణ సమస్యలను ఒక్కటి కూడా పరిష్కరించలేదన్నారు. భవన నిర్మాణ కార్మికులకు మోటార్ సైకిళ్ల ఇస్తామని అసెంబ్లీలో ప్రకటించి ఇంతవరకు ఇవ్వలేదనీ, రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 53 వేల క్లైమ్‌లను తక్షణమే పరిష్కరించాలని, బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనవరి 27న జిల్లా కలెక్టరేట్ల ముందు, జిల్లా కార్మిక శాఖ కార్యాలయాల ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు లక్ష్మణ్, ఆంజనేయులు, అంజయ్య, బాలస్వామి, ప్రభాకర్, నాయకులు రాములు, సామేలు, సైదులు, రఘునాయక్, మహిళా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతగా చేపట్టాలి

మేయర్ పారిజాత నర్సింహారెడ్డి



నవతెలంగాణ-బడంగ్ పేట్

ప్రభుత్వ నిధులతో చేపట్టే రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బడంగ్ పేట్ ప్రధాన రోడ్డులో బీటీ రోడ్డు నిర్మాణ పనులను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కోట్లాది రూపాయల నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ- సరూర్ నగర్

పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సరూర్ నగర్‌కి చెందిన గౌలికర్ రత్నమ్మ కిడ్నీ సమస్యతో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చేరింది. రత్నమ్మ చికిత్స కోసం రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలిపారు. విషయాన్ని రత్నమ్మ కుటుంబ సభ్యులు నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి బేరాబాల కిషన్ దృష్టికి తీసుకురాగా ఆయన సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ప్రభుత్వం ద్వారా రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈసందర్భంగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలో ఆరోగ్య సమస్యలపై ఎవరికి ఇబ్బందులున్నా బీఆర్ఎస్ నాయకుల ద్వారా తన దృష్టికి తీసుకొస్తే ప్రభుత్వం ద్వారా ఆర్థిక సాయం అందించడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుట్ల అరవింద్ శర్మ, మీర్పేట కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, నాయకులు నేలకొండ శ్రీనివాస్‌రెడ్డి, శ్రీమన్నారాయణ, పెంబర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ డిపో మెకానిక్‌గా మహిపాల్



నవతెలంగాణ-హయత్ నగర్

అసలే ఆర్టీసీ నష్టాల్లో ఉన్న తరుణంలో దానిని కాపాడడానికి తమ వంతు కృషిగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలి. అటువంటి వారికి ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ యాదగిరి చేతుల మీదుగా హయత్ నగర్1డిపోకు చెందిన మహిపాల్ రెడ్డి ఉత్తమ మెకానిక్‌గా, అదే డిపోకు చెందిన అకౌంట్ సూపర్ వైజర్ చంద్రశేఖర్‌కు అవార్డులు అందజేశారు.

ఉత్తమ అధికారిగా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ గౌడ్



నవతెలంగాణ-హయత్ నగర్

ప్రతి ఏటా అధికారులు తమ విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు గాను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ చేతుల మీదుగా ఆయన కార్యక్రమంలో అవార్డులు అందజేస్తారు. ఇందులో భాగంగా హయత్‌నగర్‌లో ఉన్న ఎక్సైజ్ శాఖ పరిధిలో మత్తు పదార్థాలు, గంజాయి, కొకైన్, డ్రగ్స్ లాంటివి నివారణకు కృషి చేస్తున్న హయత్ నగర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ గౌడ్, ఇన్‌స్పెక్టర్ కల్పన, ఎస్ఐ సరళలు ఉత్తమ అధికారులుగా అవార్డులు అందుకున్నారు.

దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

మంత్రి సబితా ఇంద్రారెడ్డి ● సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-బడంగ్ పేట్

రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో దేవాలయాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అల్మాస్ గూడ పరిధిలో ఉన్న 26వ డివిజన్ తిరుమల నగర్ కాలనీలో శ్రీశ్రీశ్రీఅభయ సాయిబాబా మందిర పునః నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కార్పొరేటర్లు బోయపల్లి దీపిక శేఖర్ రెడ్డి, ఏనుగు రామిరెడ్డి, సూర్జగంటి అర్జున, సంరెడ్డి స్వప్న వెంకట్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పుల్లారెడ్డి, లాల్ నాయక్, రమేష్, సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో యువకులు రాణించాలి

బీఆర్ఎస్ జల్‌పల్లి వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ జహంగీర్



నవతెలంగాణ, బడంగ్ పేట్

క్రీడలతో యువతి, యువకులకు మానసిక ఉల్లాసంతో పాటు మనోధైర్యం కలుగుతుందని క్రీడల్లో యువతి, యువకులు రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని జల్‌పల్లి మున్సిపల్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ జహంగీర్ అన్నారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపాలిటీ వాది-ఏ- ముస్తఫా కాలనీలో తెలంగాణ రాష్ట్ర యువ నాయకులు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడల పట్ల ఆసక్తి కలిగి ఉండాలని, క్రీడలతోనే సమాజంలో మంచి పేరు ప్రతిష్టలు వస్తాయని తెలిపారు. వాదీ-ఏ- ముస్తఫా క్రికెట్ లీగ్ టోర్నమెంటు సాయంత్రం ముగిసిందని, ఈ టోర్నమెంట్ లో మొత్తం 8 జట్లు పాల్గొన్నాయని అందులో జల్ పల్లి క్రికెట్ టీం టోర్నమెంట్ విజేతగా నిలిచిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు. షేక్ జహంగీర్ విజయం సాధించిన టీం సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.



హాత్ సే హాత్ జోడో యాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి

పొంగిపొర్లుతున్న డ్రయినేజీ



నవ తెలంగాణ-సంతోష్‌నగర్

డ్రయినేజీ నీటిని కాల్వలో కలపకపోవడంతో కాలనీలో రోడ్డుపై పారుతోంది. దీంతో యకుత్ నియోజకవర్గం ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సార్ బస్‌స్టాఫ్ ముందు హైదరాబాద్ హైస్కూల్ వెళ్లే విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారస్తులు, పాదాచారులు, వాహనదారులు, విద్యార్థులు డ్రయినేజీ పొంగిపొర్లడం వల్ల వచ్చే దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. 25 రోజులనుండి డ్రయినేజీ నీరు రోడ్డుపై పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. డ్రయినేజీ సమస్యపై అనేకసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే దాఖలాలు లేవని బస్తీవాసులు ఆరోపిస్తున్నారు. ఈ సమస్యపై ప్రతిరోజు పదుల సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయి. అయినా ఇక్కడి అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఈసమస్యను ప్రజాప్రతినిధులు సైతం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఈ మార్గంలో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. డ్రయినేజీ పొంగి పారుతుండటంతో పనులు నిలిచిపోయాయి. వెంటనే సమస్యలు పరిష్కరించకపోతే కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా వాటర్ వర్క్స్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని డ్రయినేజీ సమస్యను పరిష్కరించాలని ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు.

పెయింటింగ్ కార్మికులు ఐక్యంగా ముందుకు సాగాలి



నవతెలంగాణ-ఘట్కేసర్

పెయింటింగ్ కార్మికులు కలిసికట్టుగా పని చేసుకోవాలని చెవుతారు కూడా గ్రామ సర్పంచి బయలు రమాదేవి రాములు గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఘట్కేసర్ మండలం విజేత పెయింటర్ అసోసియేషన్ కార్యాలయం గురువారం వెంకటాద్రి కాలనీ, చౌదరిగూడ గ్రామంలో ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచి పాల్గొని మాట్లాడుతూ... పెయింటింగ్ వృత్తిలో ఉన్న కార్మికులందరూ ఐక్యతతో ఉండి పనిచేయాలని సూచించారు. విజేత పెయింటర్ అసోసియేషన్ మండలాధ్యక్షుడు జగన్ మాట్లాడుతూ వృత్తిలో నిమగ్నమై ప్రమాదాలకు గురైన కార్మికులకు సంఘం తరపున సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యానాయక్, బీజేపీ రాష్ట్ర ఎస్టీ మోర్చా అధ్యక్షులు బిక్కు నాయక్, సీపీఐ జిల్లా నాయకులు జయచంద్ర, లొట్టి ఈశ్వర్, కౌన్సిలర్లు చింతల రాజశేఖర్, సుర్వి శ్రీనివాస్‌గౌడ్, వార్డు సభ్యులు నరసింహ్మ నాయకులు అభావతి నరసింహ్మ, విజేత పెయింటర్ అసోసియేషన్ నాయకులు ఈశ్వర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

డెక్కన్ చాయ్ సెంటర్‌ను ప్రారంభించిన వైస్ చైర్మన్



నవతెలంగాణ ఘట్కేసర్

ఘట్కేసర్ మునిసిపల్ పరిధిలోని డెక్కన్ చాయ్ పారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ వైస్ చైర్మన్ పలుగుల మాధవ్‌రెడ్డి పాల్గొని రిబ్బన్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వేమనరెడ్డి, బారాస పార్టీ అధ్యక్షులు బండారి శ్రీనివాస్, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు కొంతం అంజి రెడ్డి, ఎస్ఐ విజయ్ కృష్ణ, కౌన్సిలర్లు చందుపట్ల వెంకట్‌రెడ్డి, బండారి అంజి, బేతల్ నర్సింగ్‌రావు, ఎన్ఎఫ్‌సీనగర్ మాజీ సర్పంచ్ వెంకటేష్, బారాస సీనియర్ నాయకులు బొక్క ప్రభాకర్‌రెడ్డి, బొక్క జంగారెడ్డి, బొక్క సుదర్శన్‌రెడ్డి, కట్ట నర్సింహారెడ్డి, బాబురావు, బొక్క సుధాకర్‌రెడ్డి, యజమానులు బుచ్చిరెడ్డి, అభిషేక్, ప్రణయ్‌రెడ్డి, శరత్, రాజేష్‌గౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



పెద్ద అంబర్‌పేట్‌లోని సత్యం టెక్నో స్కూల్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన స్కూల్ డైరెక్టర్ అరవింద్.



తట్టి అన్నారంలో కేశవరెడ్డి మెమోరియల్ స్కూల్‌లో జెండాను ఆవిష్కరించిన స్కూల్ చైర్మన్



చైతన్యపురిలో ఎలైట్ పారా మెడికల్ కాలేజీలో జాతీయ జెండాను ఆవిష్కరించిన కాలేజ్ కరస్పాండెంట్ ఎండి జాంగిర్, విద్యార్థినీలు



హయత్ నగర్‌లో మెగాసిటీ హైస్కూల్లో జాతీయ జెండాని ఆవిష్కరించిన స్కూల్ చైర్మన్ సుబ్బారెడ్డి, విద్యార్థులు

ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు

- కమిషనర్ రామలింగం



నవతెలంగాణ- జవహర్‌నగర్

జవహర్ నగర్ ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చేస్తున్నట్టు కమిషనర్ రామలింగం తెలిపారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ మేకల కావ్య అధ్యక్షతన గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకొని కమిషనర్ జాతీయ జెండాను ఎగురవేశారు. కార్పొరేషన్ లోని ప్రభుత్వ కార్యాలయాలు, అన్ని డివిజన్లలో జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్,కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ ఆర్డీ ప్రభాకర్ యాదవ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ 7

మల్కాజిగిరి

శుక్రవారం 27 జనవరి 2023

జాహ్నవి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు

నవతెలంగాణ-బేగంపేట



గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ప్యారడైస్ వద్ద ఉన్న జాహ్నవి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూట్ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైర్మెన్ ఏ పరమేశ్వర్, వైస్ చైర్మెన్ లక్ష్మి, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ నర్సింగరావు అనసూయ పాల్గొన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయిజ ఎన్‌సీసీ నిర్వహించిన పరేడ్ ఎంతగానో ఆకట్టుకున్నది.

అభివృద్ధి పథంలో ముందున్న మేడ్చల్-మల్కాజిగిరి

- జిల్లా కలెక్టర్ హరీశ్
- కలెక్టరేట్ ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ఎంతో ముందంజలో ఉందని... మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయం, సహకారం ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ హరీశ్ అన్నారు. గురువారం 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలను శామీర్‌పేటలోని నూతన కలెక్టరేట్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరీశ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను తెలియజేశారు. గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని జిల్లాలోని ఆయా పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అనంతరం ఉద్యోగ నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి కలెక్టర్ ప్రశంసాపత్రాలను అందచేశారు. అలాగే స్వాతంత్ర్య సమర యోధులను కలెక్టర్ శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ (డీఆర్డీఏ) వారికి స్వయం సహాయక సంఘాల కు బ్యాంకు లింకేజీ కింద రూ.30 కోట్ల విలువైన చెక్కును కలెక్టర్ హరీశ్ అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మెన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, జెడ్పీ వైస్ చైర్మెన్ బెస్త వెంకటేశ్, జిల్లా కోపరేటివ్ డైరెక్టర్ మధుకర్ రెడ్డి, శామీర్‌పేట్ జెడ్పీటీసీ అనిత, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, డీసీపీ సందీప్, జిల్లా కలెక్టరేట్ ఏవో వెంకటేశ్వర్లు పోలీసు శాఖ ఉన్నతాధికారులు, ఆయా శాఖల జిల్లా అధికారులు, స్థానిక జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భవనాన్ని కూల్చివేయాలి

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



నవ తెలంగాణ-బేగంపేట్

పరిసర ప్రాంత ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భవనాన్ని కూల్చేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గురువారం ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి మినిస్టర్ రోడ్ లో ఇటీవల అగ్నిప్రమాదం జరిగిన భవనం వద్దకు చేరుకున్నారు. గురువారం భవనాన్ని కూల్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భవనం కూల్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి పర్యవేక్షిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రమాదం చాలా బాధాకరం అన్నారు. ప్రమాదంలో మరణించిన ముగ్గురి కుటుంబాలకు ఒక్కొక్కరికి 5 లక్షల రూపాయలను ముఖ్యమంత్రి ప్రకటించారని తెలిపారు. ప్రమాద సమ యంలో అన్ని శాఖల అధికారులు సకాలంలో తగిన చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా పరిసర ప్రాంత ప్రజలను మున్నూరు కాపు సంఘ భవనంలోకి తరలించి వసతి, భోజన సౌకర్యాలను కల్పించినట్టు చెప్పారు. మంటలు పూర్తి స్థాయిలో అదుపులోకి తీసుకొచ్చేందుకు అధికారులు ఎంతో శ్రమించారని అన్నారు. భవనాన్ని కూల్చేందుకు అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగిస్తున్నట్లు పేర్కొన్నారు.మంత్రి వెంట మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ, తహసీల్దార్ శైలజ, ఈఈ సుదర్శన్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ క్రిస్టోఫర్ తదితరులు ఉన్నారు.

కేవీపీఎస్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-మల్కాజిగిరి

కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో, జిల్లా అధ్యక్షుడు కృపాసాగర్ నాయకత్వంలో 2023 నూతన సంవత్సర నూతన కాలెండర్‌ను తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు నారాయణరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. కేవీపీఎస్ కుల సంఘం కాదని.. కుల వివక్ష కు వ్యతిరేకంగా, అంటరాని తనం పోవాలని ఏర్పడిన సంఘం అని కొనియాడారు. ఈ సంఘంలో ఎవ్వరైనా సభ్యులు గా చేరొచ్చు అని తెలిపారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కృపాసాగర్ ప్రసంగిస్తూ, ఈ కాలెండర్ మన రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్ర పటంతో పాటు గొప్ప ఆదర్శ మూర్తులు సంఘ సంస్కర్తలు అయిన జ్యోతిరావ్, సావిత్రి బాయి పూలే, పెరియార్ రామస్వామి, నారాయణ గురూ చిత్రపటాలతో పాటు ప్రపంచ మేధావి కార్ల్ మార్క్స్, పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటాలతో అద్భుతమైన కాలెండర్ తీసుకువచ్చామని తెలిపారు. ఇది ఎందరికో స్ఫూర్తి దాయకంగా ఉంటుందన్నారు. కాలెండర్ తీసుకు రావడానికి సహకరించిన సన్నిహితులకు దాతలకు ధన్యవాదాలు తెలియజేశారు. జిల్లా ఉపాధ్యక్షులు గుంటి లక్ష్మన్, మీనా ప్రసంగిస్తూ కేంద్ర ప్రభుత్వం అంబేద్కర్ రాజ్యాంగాన్ని మార్చేసి సనాతన ధర్మం అమలు చేయాలని, మనుధర్మ శాస్త్రాన్ని అమలుచేయాలని ప్రయత్నం చేస్తున్నదన్నారు. ఇది ప్రజల మధ్య చిచ్చు పెట్టడానికి, దేశ పురోగతికి ఆటంకమని వివరించారు. విధానాలను తీవ్రంగా ప్రతిఘటించాలని సత్యనారాయణ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యాదగిరి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

' భారత రాజ్యాంగం విశిష్టత, నేటి కర్తవ్యం' పై సెమినార్



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో కమలానగర్ ఆఫీస్‌లో భారత రాజ్యాంగం విశిష్టత, నేటి కర్తవ్యం అనే అంశం పై సెమినార్ జరిగింది. సెమినార్ ప్రారంభ సూచికగా అంబేద్కర్ చిత్రపటానికి ముఖ్యఅతిథి హాజరై తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర బాధ్యులు జీ రాములు పూలమాలలు వేసి ప్రారంభించారు. సెమినార్ కు స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి జి రాములు మాట్లాడుతూ దేశంలో గతం నుంచి మూడు రాజ్యాంగాలు నడిచాయని అన్నారు. వేల సంవత్సరాల పాటు మను స్మతి రాజ్యాంగం నడిచిందని.. దానిలో అగ్రవర్ణాలు సకల సంపదలకు హక్కుదారులని, 85 శాతం కలిగిన శూద్రులు కట్టు బానిసలు లాగా వారికి పనిచేయాలని నిర్దేశించారన్నారు. దానిలో కొన్ని మార్పులకు చేస్తూ బ్రిటిష్ వాళ్లు వారికి అనుకూలమైన రాజ్యాంగాన్ని అమలుపరిచారని తెలిపారు. అందరికీ ఆస్తి హక్కు కలిగించటం. బాల్య వివాహాల్ని నిషేధించడం. అందరికీ చదువుకునే అవకాశం కల్పించడం చేశారన్నారు. 1950లో నూతన రాజ్యాంగం అంబేద్కర్ సారథ్యంలో అతిపెద్ద రాజ్యాంగం రచించారని వివరించారు. అందరినీ సమభావంతో ఎటువంటి వివక్షతలు లేకుండా చూడాలని రాజ్యాంగాన్ని రాయడం జరిగిందన్నారు. దాన్ని తూట్లు పొడిచేందుకు నేటి పాలకులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పాత మనువాద రాజ్యాంగాన్ని అమలుపరిచే దిశలో వారి పోకడలు ఉన్నాయని.. అలా సమర్థించే వాళ్ళకి పద్మశ్రీలు, పద్మభూషణలు ఇచ్చి ప్రస్తుత రాజ్యాంగాన్ని దాని మౌలిక స్వభావాన్ని దెబ్బతీస్తున్నారు అని చెప్పారు. మనమందరం దానికి వ్యతిరేకంగా నేటి రాజ్యాంగం రక్షించుకోవాలని కోరారు. అనంతరం రాజ్యాంగ పీఠికను ప్రముఖ విజ్ఞాన వేత మల్లేష్ సబికులందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. సెమినార్ లో ప్రముఖ రచయిత పి.బి చారి, నాగయ్య, సిహెచ్ నాగేశ్వరరావు, రాజమల్లు ఎం భాస్కర్ రావు, శ్రీనివాస్, కోమటి రవి , నర్సింగ్ రావు, గోపి, సోమయాచారి, ప్రసాద్, నర్సయ్య , ఎం శ్రీనివాసరావు, అశోక్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-కాప్రా

74 వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి . ఈ కార్యక్రమం లో కాప్రా మున్సిపల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శంకర్, మున్సిపల్ అధికారులు, కార్పొరేటర్లు స్వర్ణ రాజు, సింగిరెడ్డి శిరీష సోమ శేఖర్ రెడ్డి, బోంతు శ్రీదేవి, జేరిపోతుల ప్రభుదాస్, పన్నల దేవేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొత్త రామా రావు, పావని మణిపాల్ రెడ్డి , గుండారపు శ్రీనివాస్ రెడ్డి, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు, కాసం మహిపాల్ రెడ్డి, గిల్బర్ట్, కుమార స్వామి, బి ఆర్ ఎస్ నాయ కులు, రాజకీయ పార్టీల నాయకులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాల ఫలితమే గణతంత్ర దినోత్సవం

- జేటీసీ పాండురంగ నాయక్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఖైరతాబాద్లోని రవాణాశాఖ సంయుక్త కమిషనర్ కార్యాలయంలో గురువారం 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ (జేటీసీ) జె.పాండురంగ నాయక్ జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎందరో మహనీయులు చేసిన త్యాగాల ఫలితంగా స్వాతంత్ర్యం లభించినదని, అంబేద్కర్ అధ్యక్షతన రూపొందించిన భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన నాటి నుంచి మనం గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటున్నామని ఆయన తెలిపారు. ఆర్టీవోలు ఎల్.రాం చందర్, ఎంవీఐలు శ్రీనుబాబు, జి.ఆర్.రాజు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు



నవతెలంగాణ-జవహర్‌నగర్

జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆవరణలో తెలుగు యువత రేపన లక్ష్మణ్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర నాయకులు కూతాడి రవీందర్ తో కలసి రేపన లక్ష్మణ్ జెండా ఆవిష్కరణ చేసి జవహర్ నగర్ ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ నాయకులు కే రమణ, ఎల్ సూరిబాబు, చెన్నపురం యాదయ్య, చంద్ర శేఖర్, శ్రీరాములు, ప్రసాద్, భాస్కర్, గౌస్, ప్రశాంత్, సాయి, రాజు తదితరులు పాల్గొన్నారు.



జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యలయంలో జెండావిష్కరించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-మల్కాజిగిరి/ నేరేడ్‌మెట్

జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యలయంలో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు జెండావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీ రాజు, కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్, సునీత రాముయాదవ్, రాజలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు మల్కాజిగిరి చౌరస్తాలోనూ ఎమ్మెల్యే జెండా ఆవిష్కరణ చేశారు.మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ పాల్గొన్నారు.

నేరేడ్‌మెట్ చౌరస్తా, జేజే నగర్ లలోనూ ఎమ్మెల్యే జెండాను ఎగుర వేశారు. ఎస్ ఆర్ ప్రసాద్, చెన్నరెడ్డి, జీఎన్ వీ సతీష్ కుమార్, రాజు, మహేష్, చిందం శ్రీనివాస్,లక్ష్మ రెడ్డి, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వెంకటాపురం డివిజన్ కార్పొరేటర్ సబితా అనిల్ కిశోర్ డివిజన్ పరిధిలోని వెస్ట్ వెంకటాపురం, భూదేవినగర్ ఆటో స్టాండ్, ఆర్‌బిఐ కాలనీ, గొల్లగూడ, రాజీవ్ నగర్, బృందావన్ కాలనీ, కానాజి గూడ ఆటో స్టాండ్, ఇంద్రనగర్, రాజీవ్ గాంధీ నగర్ లలో జాతీయ జెండా ఎగురవేశారు. అల్వాల్ పోలీస్ స్టేషన్ వద్ద సీఐ గంగాధర్ జెండాను ఎగురవేశారు.



మన దేశం భిన్న మతాలు, సంస్కృతుల సమ్మేళనం

- జలమండలి ఎండీ దానకిశోర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

మన దేశం భిన్న మతాలు, సంస్కృతుల సమ్మేళనమని జలమండలి ఎండీ దానకిశోర్ అన్నారు. ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాలాపన చేశారు. అనంతరం ఉన్నతాధికారులు, ఉద్యోగులతో జరిగిన సమావేశంలో ఎండీ మాట్లాడారు. జలమండలి వినియోగదారులు, ఉద్యోగులు, సిబ్బందికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మానవ అభివద్ధి కోసమే రాజ్యాంగం, రాజ్యాంగ సంస్థలు పని చేస్తున్నాయని, వీటిని కాపాడుకోవడం మనందరి బాధ్యతన్నారు. మన దేశం భిన్న మతాలు, సంస్కతులు, భావజాలాలు కలిగిన సమ్మేళనమని కొనియాడారు. ఇంత మంది ప్రజలు కలిసి జీవించడం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని అన్నారు. కోటి 20 లక్షల మందికి పైగా ప్రజలు నివసిస్తున్న హైదరాబాద్ మహా నగరానికి నీల్లువ్వటం సాధారణ విషయం కాదన్నారు. జలమండలి సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు పునరంకితం కావాలని ఆయన అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఎన్సీ, ఆపరేషన్స్ డైరెక్టర్-1 అజ్మీరా కష్ణ, ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ బాబు, రెవెన్యూ డైరెక్టర్ వి.ఎల్. ప్రవీణ్ కుమార్, టెక్నికల్ డైరెక్టర్ రవి కుమార్, ఆపరేషన్స్ డైరెక్టర్-2 స్వామి, సీజీఎంలు, జీఎంలు, జలమండలి ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు రాంబాబు యాదవ్, అసోసియేట్ ప్రెసిడెంట్ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



కంటోన్మెంట్‌లో

నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ జాతీయ జెండా ఆవిష్కరించారు. ఒకటో వార్డ్ పరిధిలోని చిన్నతోకట్ట, రజక సంఘం నేతాజీ నగర్, బోయినపల్లి చౌరస్తా వనిత కాలనీ, న్యూ సిటీ కాలనీ, బాపూజీనగర్, కట్టెలమండి, మూడో వార్డ్ పరిధిలోని ఈద్గ అంబెద్కర్ నగర్, మడ ఫోర్ట్, మడ ఫోర్ట్ ప్రభుత్వ పాఠశాల, సిఖ్ విలేజ్, ఖర్ఖానా, ఆరో వార్డ్ పరిధిలోని సీతారాం పురం, భవాని నగర్ సెంటెర్ పాయింట్ ప్రాంతాల్లో జాతీయ జెండా ఆవిష్కరించారు. కడక్ పురలో మైనింగ్ కార్పొరేషన్ చైర్మెన్ మన్నే క్రిశాంక్, చాయ్ అడ్డా వద్ద బీజేపీ నాయకులు నాయుడు ప్రకాష్, బోయినపల్లి చౌరస్తాలో కాంగ్రెస్ పీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్ తో కలిసి జెండా వందనం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సత్యనారాయణ, అజిత్, దుర్గయ్య, ప్రేమ్ ముదిరాజ్, ఖరేఖానా, మహంకాళి టెంపుల్ చైర్మెన్ రామారావు, వివేక్ చింటూ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

లాల్ బజార్‌లోని శాస్త్రి నగర్ లో బీఆర్ఎస్ మహిళా నాయకురాలు, డీఎస్ఎస్ మహిళా అధ్యక్షురాలు ఆర్ వినీత



లాల్ బజార్‌లో (కంటోన్మెంట్)

ఆధ్వర్యంలో జెండావిష్కరణ చేసి మహిళలకు రంగోలి పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు కార్యక్రమంలో నీతూ గ్లోరీ జై శీలంతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

కాప్రా : గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని కాప్రా మున్సిపల్ కార్యాలయంలో కాప్రా డివిజన్ పరిధిలో వివిధ కాలనీలలో మేడ్చల్ జిల్లా ఎస్సీ విభాగం చైర్మెన్, కాప్రా డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ పత్తి కుమార్ జాతీయ జెండా ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, గణేష్, కృష్ణ, శ్రీరాములు, ఏ వై కుమార్, వెంకటేష్ గౌడ్, సుధాకర్, ఆల్ఫాన్స్ నర్సింగ్, సాగర్, విజయ్, సిద్దు, ప్రవీణ్ రెడ్డి, కిరణ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు



కాప్రాలో

చర్లపల్లి డివిజన్ పరిధిలో ఈసీ నగర్, మింట్ కాలనీ, వెంకట్ రెడ్డి నగర్ కాలనీ, గాంధీ నగర్, నేతాజీ నగర్, వీఆర్ కాలనీ, ఐజీ కాలనీ, విద్యా మారుతి కాలనీ, మధుసూదన్ రెడ్డి నగర్ కాలనీ, శుభోదయ నగర్ కాలనీ, ఓల్డ్ సోనియాగాంధీ నగర్ కాలనీ, సోనియాగాంధీ నగర్ ఫేజ్ -



చర్లపల్లి డివిజన్ పరిధిలో

1,2, 3 గణేష్ నగర్ కాలనీ,శ్రీ సాయి కృష్ణ నగర్ కాలనీ ల్లో జెండా ఆవిష్కరణ స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ చేతులమీదుగా చేశారు. మధుసూదన్ రెడ్డి నగర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి మాజీ మేయర్ రామ్మోహన్, స్థానిక కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్ హాజరై జాతీయ జెండా ఆవిష్కరణ చేశారు.



ఐజి కాలనీలో

చర్లపల్లి డివిజన్ పరిధిలో ఐజి కాలనీలో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి చేతుల మీదుగా జెండా ఎగరేశారు.

లౌకిక వ్యవస్థ పరిరక్షణకు పాటుపడాలి

నవతెలంగాణ-కాప్రా

లౌకిక వ్యవస్థ పరిరక్షణకు పౌరులంతా పాటుపడాలని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. ఎస్. బోస్ పిలుపునిచ్చారు. ఈసీఐఎ ల్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ ముందు జాతీయ జెండాను బోస్ ఎగుర వేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సత్య ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజ్ కుమార్, నరేష్, ఏఐఎస్ఎఫ్ నేతలు అజీమ్, అంజాద్, కిరణ్, ఏఐటీయూసీ కాప్రా మండల కార్యదర్శి మిరియాల సాయిలు తదితరులు పాల్గొన్నారు.



న్యూ గాంధీనగర్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-కంటోన్మెంట్

తిరుమలగిరి న్యూ గాంధీనగర్‌లో బీఆర్ఎస్ 7వ వార్డు అధ్యక్షుడు తేజ్‌పాల్ అధ్యక్షతన గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు బస్తీ వాసులు, మహిళలు, పిల్లలు, భారీ సంఖ్యలో పాల్గొని జాతీయగీతం ఆలపించారు. అనం తరం పిల్లలకు తేజ్‌పాల్ మిఠాయిలను పంపిణీ చేశారు.



రామంతపూర్‌లోని ఏడీఆర్ఎం ఆస్పత్రిలో గణతంత్ర దినోత్సవ వేడుకలు, ఆస్పత్రి 40వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఆస్పత్రి ఎండీ శ్రీకాంత్ రావు, ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ మమత, డాక్టర్ రవి, మేనేజర్ రాంమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.
నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రొ.రామకృష్ణారెడ్డికి సత్కారం



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల బాషా శాస్త్రం అక్టోజెనేరియన్ ప్రొ.బి.రామకృష్ణారెడ్డికి భాషాశాస్త్రం, విద్యలో కృషి చేసినందుకు గాను కేంద్ర ప్రభుత్వం ఆయనకు ప్రతిష్టాత్మక పద్మశ్రీ అవార్డును ప్రకటించింది. రామకృష్ణారెడ్డిని గురువారం తార్నాకలోని అఆయన నివాసం వద్ద ఓయూ వీసీ ప్రొ.రవిందర్, రిజిస్ట్రార్ ప్రొ.పి.లక్ష్మీ నారాయణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.చింతా గణేష్, బాషాశాస్త్ర అధ్యాపకులు డా.స్వాతి, హెడ్ ప్రొ.అన్సారీ, డా.బాలు నాయక్‌తో పాటు పలువురు ఆయన నివాసంలో కలిశారు. పుష్పగుచ్ఛం, శాలువా, మెమెంటోతో సత్కరించారు.

ఘనంగా వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-అంబర్‌పేట

బీజేపీ జోగులాంబ గద్వాల జిల్లా ఇన్‌చార్జి వెంకటరెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ కార్యకర్తలు, అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కన్నె ఉమా రమేష్ యాదవ్, పద్మా వెంకటరెడ్డి, నాయకులు కృష్ణ గౌడ్, చుక్క జగన్, గోవర్ధన్ రెడ్డి, మిరియాల శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, దత్తు, తదితరులు పాల్గొన్నారు.

ట్రెజరీ ద్వారా అర్చకులకు జీతాలు

- ఈ ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే
- రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి
- తెలంగాణ అర్చక, ఉద్యోగ ఐక్య కార్యాచరణ సమితి నూతన డైరీ ఆవిష్కరణ



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

అర్చక ఉద్యోగులకు ట్రెజరీ ద్వారా జీతాలు అందిస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. గురువారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో తెలంగాణ అర్చక ఉద్యోగ ఐక్య కార్యాచరణ సమితి జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ ఆధ్వర్యంలో తెలంగాణ అర్చక ఉద్యోగ ఐక్య కార్యాచరణ సమితి డైరీ -2023ను మంత్రి ప్రభుత్వసలహాదారులు కెవి.రమణాచారి, దేవాదాయశాఖ కమిషనర్ అనిల్ కుమార్, జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ, జేఏసీ రాష్ట్ర కన్వీనర్ రవీంద్ర చారి, అర్చక వెల్ఫేర్ బోర్డు మెంబర్ కందూరి కృష్ణమాచార్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు అర్చకుల సమష్యాలు ఎలా ఉన్నాయో మీకు తెలుసు అన్నారు. అర్చకుల సమస్యలపై అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. సీఎం కేసీఆర్ ఆలయాల అభివృద్ధికి ఎంతో కషి చేస్తున్నారో దానికి నిదర్శనం యాదాద్రి టెంపుల్, భద్రాద్రి, కొండగట్టు, బాసర ఆలయాలేనని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ఆలయాలను ఇతర రాష్ట్రాల సీఎంలు వచ్చి సందర్శిస్తున్నారని తెలిపారు. ఆలయాల పునరుద్ధరణకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. ఒకప్పుడు మూడు నాలుగు నెలలకోసారి జీతాలు కూడా వచ్చేవికావు అనీ, సీఎం కేసీఆర్ నిర్ణయంతో ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలతో సమానంగా ట్రెజరీ ద్వారా ఇవ్వనున్నట్టు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ట్రెజరీ ద్వారా అర్చకులకు జీతాలు ఇవ్వలేదనీ, తెలంగాణలో చొరవ తీసుకున్నట్టు తెలిపారు. దాదాపు 10వేల మంది అర్చకులకు ప్రభుత్వం జీతాలు ఇస్తుందని చెప్పారు. రానున్న రోజుల్లో అర్చకుల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీనిచ్చారు. అర్చకులు నిర్వహించిన పరీక్షల ఫలితాలను మార్చిలో వెల్లడిస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో శిథిలావస్థకు చేరిన ఆలయాలను పునరుద్ధరిస్తూ.. పూర్వవైభవం తీసుకొస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణ చారి, కమిషనర్ అనిల్ కుమార్, జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ పరశురాం రవీంద్ర చారి, అర్చక వెల్ఫేర్ బోర్డ్ మెంబర్ లు కందూరి కృష్ణమాచారి, శ్రావణ్ కుమార్ చార్యులు, జె.నారాయణస్వామి, జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బద్రీనాథ చార్యులు, జేఏసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు ఎస్.అన్నపూర్ణ, జేసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర శర్మ, హైమావతి, కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓం ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రాజ్యాధికారంలో వాటా కల్పించాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య



నవతెలంగాణ-అంబర్‌పేట

సమాజంలో ఉన్న సామాజిక వివక్షతకు, లింగ వివక్షతకు గురవుతూ సమాజంలో నిరాధారణకు గురవుతున్న మహిళలకు రాజ్యాధికారంలో వాటా కల్పించినప్పుడే మహిళలకు ఆత్మవిశ్వాసం, మనో నిబ్బరాన్ని కలిగిస్తాయని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య తెలిపారు. అంబర్‌పేటలో బీసీ మహిళా సంఘం రాష్ట్ర కార్యాలయాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, రాష్ట్ర అధ్యక్షురాలు గుంద్రాతి శారద గౌడ్‌తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ సమాజంలో నిరాధారణకు గురవుతున్న బలహీనవర్గాలకు చెందిన మహిళలకు రాజ్యాధికారంలో అవకాశాలు కల్పించినప్పుడు మహిళా సాధికారత ఏర్పడుతుందన్నారు. మహిళల కోసం ప్రస్తుతం ప్రవేశపెట్టిన మహిళా బిల్లులో కేవలం అసెంబ్లీ పార్లమెంట్ లో మాత్రమే రిజర్వేషన్లు కల్పిస్తున్నారనీ, అలా కాకుండా విద్య, ఉద్యోగ ఉపాధి అనే అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించినప్పుడే మహిళా సాధికారత ఏర్పడుతుందన్నారు. మహిళా బిల్లు పరిధిని పెంచి మహిళా బిల్లుని సమాజంలో అన్ని వర్గాలకు చేరేలా చర్యలు చేపట్టాలనీ, దానికోసమే జాతీయ స్థాయిలో ప్రజా సంఘాలు, మహిళా సంఘాలతో చర్చలు, జాతీయ స్థాయిలో సదస్సులు, రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పరిచి చర్చ జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో భూపేష్‌సాగర్, తిరుపతి, రామాంజనేయులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కోసమే రైతన్న డైరీ ఆవిష్కరణ



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రైతన్న డైరీ వల్ల పంట సాగుపై సేంద్రియ, రసాయనిక ఎరువుల ఉపయోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అవగాహన కల్పించడం కోసం 'రైతన్న డైరీ' ఆవిష్కరించినట్టు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ తెలిపారు. గురువారం హిమాయత్ నగర్ లోని రైతు సంఘం కార్యాలయంలో రైతు సంఘం రూపొందించిన నూతన సంవత్సరం 2023 రైతన్న డైరీ'ని మహిలా రైతులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ రైతన్న డైరీలో వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలతో కూడిన వ్యాసాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వినియోగించడానికి రైతులకు అవసరమైన అవగాహన, చైతన్యం కల్పించడానికి ప్రయత్నం చేస్తున్నామన్నారు. డైరీతో పాటు ప్రతినెలా ప్రచురితమయ్యే రైతు పథకం ద్వారా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావడానికి ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు రైతంగాన్ని సన్నద్ధం చేయడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం ఉపాధ్యక్షులు ప్రభులింగం, రామకృష్ణారెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు తోకల రామిరెడ్డి, సత్తయ్య, చంద్రయ్య, కొండారెడ్డి, సుధాకర్‌గౌడ్, వెంకటయ్య, మహిళా రైతులు యమునా రెడ్డి, వజ్రాల అరుణ, శకుంతలరెడ్డి, వినోద, లక్ష్మి, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

యాదవ, కురుమ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలి



నవతెలంగాణ-అంబర్‌పేట

యాదవ, కురుమ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని ఆ సంఘం నాయకులు మేకల కృష్ణ యాదవ్, గోపి యాదవ్, రవితేజ యాదవ్ అన్నారు. గురువారం లక్డీకపూల్ సెంట్రల్ కోర్ట్ హోటల్ లో గొల్ల, కురుమ జర్నలిస్టుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ యాదవ జర్నలిస్టులు ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం తరఫున జర్నలిస్టులకు కావాల్సిన మౌలిక సదుపాయాల కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాజ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన మార్గదర్శకాలను తమ అభిప్రాయాల రూపంలో పంచుకున్నారు. యాదవుల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఇప్పుడు ఏర్పడ్డ ఆడహాక్ కమిటీ త్వరలో ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా ఆడహాక్ కమిటీలను ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యాదవ జర్నలిస్టులందరూ ఒక ఎజెండా తయారు చేసి, నిర్మాణాత్మక ప్రణాళికలను రచించి ఆచరణ దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ప్రియా యాదవ్, హరికృష్ణ, శ్రీనివాస్, బద్రి యాదవ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



నల్లకుంటలో గణతంత్ర దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

భారత రాజ్యాంగాన్ని అందరం పరిరక్షించాలని రిటైర్డ్ విద్యుత్ సీఈ రామకృష్ణారావు పిలుపునిచ్చారు. ఓల్డ్ నల్లకుంటలో స్ట్రీట్ నెంబర్ 14లో నల్లకుంట రెసిడెన్సి వెల్ఫేర్ అసోసియేషన్, హైదరాబాద్ జిందాబాద్ ఆధ్వర్యంలో జరిగిన గణతంత్ర దినోత్సవ కార్యక్రమానికి హాజరై జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జయసూర్య మాట్లాడుతూ భారతదేశ రాజ్యాంగం చాలా గొప్పదనీ, ప్రపంచంలోనే చాలా ప్రాధాన్యత కలిగిందన్నారు. వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ డిప్యూటీ గవర్నర్ వి.మోహన్‌రావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని, భారత రాజ్యాంగాన్ని కాపాడాలన్నారు. యువకులు ముందుకొచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత కృషి చేయాలన్నారు. డాక్టర్ అమర్నాథ్, శంకరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నల్లకుంట రెసిడెన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి.మోహన్‌నాయుడు, పి.శ్రీనివాసరావు, అశ్విన్, హర్ష ఉత్తం, రమణ, శివకుమార్, జితేందర్‌రెడ్డి, కిషోర్, కృష్ణబాబు, హైదరాబాద్ జిందాబాద్ ప్రధాన కార్యదర్శి వీరయ్య, స్థానిక నాయకులు గోపాల్, సోమేశ్, సుజిత్, సంజయ్, వినోద్, మధు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య మానసిక కౌన్సిలింగ్ సెంటర్ ప్రారంభం



నవతెలంగాణ-ముషీరాబాద్

సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని టీపీఎస్కేలో పిల్లలకు సంబంధించిన ఆరోగ్య మానసిక సమస్యలకు ఉచిత కౌన్సిలింగ్ సెంటర్‌ను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్.వినయ్ కుమార్ హాజరై మాట్లాడారు. సమాజంలో 20 శాతం పిల్లలు మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారన్నారు. అనేక ఆరోగ్య సమస్యలకు వైద్యం అందుబాటులో ఉన్నప్పటికీ మానసిక సమస్యలకు సరైన నిపుణులు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సోమవారం, బుధవారం, శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 1 గంట వరకు కౌన్సిలింగ్ సెంటర్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్ట్ సుశీల దూది పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

- అడిషనల్ కమిషనర్ కమర్షియల్ టాక్సెస్ (రిటైర్డ్) వై.సత్యనారాయణ
- ఎస్ఆర్.శంకరన్ ఐఏఎస్ అకాడమీలో గణతంత్ర దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-అడిక్‌మెట్

భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అడిషనల్ కమిషనర్ కమర్షియల్ టాక్సెస్ (రిటైర్డ్) వై సత్యనారాయణ అన్నారు. 74వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా గాంధీనగర్‌లోని ఎస్ఆర్.శంకరన్ ఐఏఎస్ అకాడమీలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో సత్యనారాయణ పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. భారత రాజ్యాంగ ప్రవేశికను విద్యార్థులతో చదివించి ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు ముఖ్యంగా నేటి యువత రాజ్యాంగ పరిరక్షణకు పూనుకోవాలన్నారు. సర్వసత్తాక, ప్రజాస్వామ్య, లౌకిక, సామ్యవాద వ్యవస్థని రూపొందించుకునే దానికోసం యువత నడుం బిగించాలన్నారు. ఇలాంటి తరుణంలో మరింత చురుకుగా వ్యవహరించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆకాడమీ ప్రిన్సిపాల్ కే.సురేందర్ రెడ్డి, కోర్సు కో-ఆర్డినేటర్ జనార్దన్ దండు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె సతీష్ కుమార్, సోషల్ మీడియా బాధ్యులు కోట మురళీకృష్ణ, కార్యాలయ సిబ్బంది టి. రాజా, బండారి, రంజిత్ కుమార్, బి.రాజేందర్, బి.రామచంద్రం విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్‌సీఐ కాలేజీలో గణతంత్ర దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఈఎస్‌సీఐ) క్యాంపస్‌లో 74వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా డైరెక్టర్ జి.రామేశ్వర్ రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-అంబర్‌పేట

ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో 74వ గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆలపించిన దేశ భక్తి గీతలు, ప్రదర్శించిన నృత్యాలు, ఉపన్యాసాలు హాజరైన ప్రతి యొక్కరి మన్నలు అందుకున్నాయి. ఈ కార్యక్రమాలనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ డైరెక్టర్ (జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా) శ్రీ కె. మహేందర్ రెడ్డి గారు జాతీయ జెండాను ఎగరేసి మాట్లాడారు. అమరణవీరులను జనవరి 26, ఆగష్టు 15వ తేదీల్లో తలుకుంటామని తెలిపారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉప్యాధ్యాయుల పాత్ర ఎంతగానో ఉందన్నారు. విద్యార్థులను అనేక విషయాల్లో ప్రేరేపించడంలో ఉపాధ్యాయులది ముఖ్యపాత్ర అన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలను ఇంజినీరుగానో, డాక్టర్లు గానో చేయాలి అనుకుంటారు కానీ, దేశరక్షణ కోసం రక్షణ శాఖలో సైనికులుగా కానీ, దేశ రక్షణ విభాగంలో సేవలు చేయడానికి కానీ ప్రేరణలు ఇవ్వాలన్నారు. భూగోళం విశిష్టతను తెలుపుతూ విరివిగా మొక్కలను నాటుతూ వాతావరణ సమతుల్యాన్ని పాటిచాలని సూచించారు. లేదంటే వాతావరణ కాలుష్యం వల్ల ఏర్పడే విపరీత పరిపాణమాలకు భాధ్యులు కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండంట్ కె.ప్రభాకర్, ప్రధాన ఉపాధ్యాయురాలు రామాంజుల, ఫహ్మిద షామీన్, ఫాతిమా ఖాజిమ్, తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో రాణి జయంతి

నవతెలంగాణ-ఓయూ

ఆదివాసీ స్వతంత్ర పోరాట యోధురాలు రాణి గైడిన్లుయా 108వ జయంతి వేడుకలను గురువారం ఆదివాసి స్టూడెంట్స్ ఫోరం రాష్ట్ర నాయకులు సాగబోయిన పాపారావు, ఆరెం అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజ్ వద్ద నిర్వహించారు. నాగా జాతికి చెందిన రాణి గైడిన్లుయా 1915లో మణిపూర్ లో జన్మించారనీ, తన 17 ఏండ్ల వయసులోనే ఆదివాసి ప్రజల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి జోహార్ లాల్ నెహ్రూతో ప్రశంసలు పొందారు. ఆమె చేపట్టిన సేవా కార్యక్రమాలకి 1982లో పద్మభూషణ్ అవార్డు. 1915-2015 ఆమె శతజయంతిని పురస్కరించుకుని రాణి గైడిన్లుయా పేరుతో స్టాంపు ముద్రించి ప్రత్యేక గౌరవాన్ని అందజేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా ఆదివాసీ విద్యార్థులు గుమ్మడి సుధీర్, మడివి అజయ్, సోడి రాంబాబు, పూణెం వివేక్ వర్ధన్, కొమరం దేవేందర్, కల్పిత స్వప్న, పూణేం కష్ణవేణి, వాసం నాగమణి, తాటి కళ్యాణి, రాజీవి, భావన, రమ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంతోనే కేశాల సంరక్షణ : హబీబ్ అహ్మద్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

మనిషి ఆరోగ్యంగా ఉంటేనే కేశాలు ఆరోగ్యంగా, పటిష్టంగా ఉంటాయని ఢిల్లీకి చెందిన ప్రముఖ అంతర్జాతీయ హెయిర్ స్టైలిస్ట్ హబీబ్ అహ్మద్ అన్నారు. గురువారం నారాయణగూడలోని హబీబ్ హెయిర్ అండ్ బ్యూటీ సెంటర్ లో 'శిరోజాల సంరక్షణ' అంశంపై ఏర్పాటు చేసిన ఉచిత సెమినార్ కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వెంట్రుకలు, గోర్లు, చర్మం వాటి స్థితిగతులను బట్టి మనిషి ఆరోగ్యాన్ని అంచనా వేయవచ్చునన్నారు. సరైన జీవన విధానం, పౌష్టికాహారం, చాలినంత నిద్ర, శారీరక శ్రమ ఉంటే ఆరోగ్యంతో పాటు శిరోజాలు బలంగా ఉంటాయనీ, వంశపారపర్య లక్షణాలు శిరోజాలపై ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ క్లాసికల్ సింగర్ మాళవిక ఆనంద్, జాతీయ టెన్నిస్ క్రీడాకారుడు అగస్త్య జైస్వాల్, గౌతమ్ మంగ్నాని, హిమాన్షు, అమన్ హబీబ్, రుచిత, సునీత, తదితరులు పాల్గొన్నారు.



గవర్నర్‌పై ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

నవతెలంగాణ-అడిక్‌మెట్

గవర్నర్‌పై ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను బీసీ సమాజ్ తీవ్రంగా ఖండిస్తున్నామని బీసీ సమాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగపరిమల అన్నారు. గురువారం విద్యానగర్‌లోని రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అధ్యక్షులు సంగేం సూర్యారావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ చొప్పర శంకర్ ముదిరాజ్‌తో కలిసి మాట్లాడారు. గవర్నర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, ఉద్యమకారుడు బీసీలను ఐక్యం చేయడంలో తెలంగాణలో కీలక భూమిక పోషించిన హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ను సైతం అవమానపరిచే విధంగా కౌశిక్ రెడ్డి మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తన అనుచరులతో బీసీ నాయకులను అవమానించే విధంగా మాట్లాడిస్తే చూస్తూ ఊరుకోమని తగిన బుద్ధి చెబుతామన్నారు. సీఎం తమ విధానాలను మార్చుకుని బీసీ నాయకులను గౌరవించకపోతే మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీసీ సమాజ్ అధ్యక్షులు సంగేం సూర్యారావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ చొప్పర శంకర్ ముదిరాజ్, సలేంద్ర శివయ్య ముదిరాజ్, బొమ్మరగోని రాజు, జంగయ్య యాదవ్, ఉజ్జే వార్, అరుణ్ నేత పాల్గొన్నారు.

రాజ్యాంగ సూత్రాలను ధ్వంసం చేస్తున్న బీజేపీ



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ప్రజానీకాన్ని అణిచివేసే నియంతృత్వ మెజారిటీ రాజ్యాన్ని నిర్మించడానికి బీజేపీ భారత రాజ్యాంగ సూత్రాలను నిర్వీర్యం చేస్తుందని సీపీఐ సీనియర్ నాయకురాలు పడాల నళిని అన్నారు. మోడీ ప్రభుత్వం కేవలం ఆర్ఎంఎస్ ఆలోచనలను, మనుస్మృతి, మధ్యయుగ తిరోగమన ఆలోచనలన్నింటినీ దేశంపై రుద్దడానికి తన అధికారాన్ని ఉపయోగించుకుంటుందన్నారు. సీపీఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం హిమాయత్ నగర్ లోని సత్యనారాయణరెడ్డి భవన్ వద్ద 74వ భారత గణతంత్ర దినోత్సవ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పడాల నళిని త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి, భారత రాజ్యాంగాన్ని రక్షించుకుంటామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఈ.టి.నరసింహ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.చంద్రమోహన్ గౌడ్, స్టాలిన్, తెలంగాణ రాష్ట్ర శ్రామిక మహిళా ఫోరమ్ కన్వీనర్ పి.ప్రేమ్‌పావని, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి సత్య, కల్యాణ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో గణతంత్ర దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎస్జీవోస్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ యూనిట్ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో అబిడ్స్‌లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో గురువారం 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్జేడి ఈ.విజయలక్ష్మి పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగరేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో ఆర్.రోహిణి, అసిస్టెంట్ డైరెక్టర్లు బి. శ్రీనివాస్‌రెడ్డి, సులోచన, ఎఫ్ఏ శ్రీనివాసులు, స్కూల్ ఎడ్యుకేషన్ యూనిట్ కే.ఆర్ రాజ్ కుమార్, కార్యదర్శి ఎం భాస్కర్, అసోసియేట్ ప్రెసిడెంట్ వీ.డేవిడ్, కోశాధికారి ఎస్.డి.ప్రేమ్, ఈసీ ముజాహిద్ అలీ, ఫోరం సెక్రెటరీ సచ్చిదానంద చారి పాల్గొన్నారు.

వసంత పంచమి వేడుకలు



నవతెలంగాణ-అంబర్‌పేట

బాగ్‌అంబర్‌పేట మైసమ్మ ఆలయంలో వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కోట్ల శివకుమార్, జి.శాంతయ్య, మురళి, కిరణ్ కుమార్, అపూర్వ నీతా, సుచరిత, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ రంగంలో అందుబాటులోకి అనేక సేవలు

నవతెలంగాణ-ఓయూ

పోస్టల్ రంగంలో నేడు అనేక సేవలు అందుబాటులోకి వచ్చాయనీ, ప్రధానంగా ఎన్నో ఆన్‌లైన్ సేవలు ప్రవేశ పెట్టిందనీ, అన్ని వర్గాలకు దగ్గర అయిందని పోస్ట్ మాస్టర్ జనరల్ టీఎం.శ్రీలత అన్నారు. గురువారం ఓయూ పోస్ట్ ఆఫీస్ ఆవరణలో ఇటీవలే రీజినల్ ఆఫీస్ హెడ్ క్వార్టర్స్ వారి ఆధ్వర్యంలో ఇటీవలే పోస్టల్ ఉద్యోగులకు నిర్వహించిన బ్యాడ్మింటెన్, క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు పని ఒత్తిడి నుంచి కాస్త దూరం కావడానికి క్రీడలు ఎంతో అవసరం ఉందని చెప్పారు. అంతకుముందు పోస్టల్ ఉద్యోగులు మార్చ్ పాస్ట్ నిర్వహించారు. గెలుపొందిన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత అధికారులు వై.నరేష్, టీవీఎం శర్మ, శ్రీ సుబ్రహ్మణ్యం, సంతోష్ నేత, నరేంద్ర బాబు, నరసింహారావు, శ్రీనివాస్ నాయక్, స్వరూప, ఎస్వీ ఎల్ ఎస్.రావు పాల్గొన్నారు.

టీమిండియా సాత్సాత్ ఏక్ సాత్ ఆర్గనైజేషన్ సభ్యుల ర్యాలీ



నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట

గణతంత్ర దినోత్సవ వేడుకను పురస్కరించుకొని రాజన్న బావికి చెందిన టీమిండియా సాత్సాత్ ఏక్ సాత్ ఆర్గనైజేషన్ సభ్యులు మూడు రంగుల జెండాలను చేత పట్టుకొని ప్రజలలో దేశం పట్ల అవగాహన కలిగిస్తూ భారత్ మాతాకీ జై అంటూ రాజన్న బావి నుంచి అలియాబాద్ సెంచరీగంజ్ ఇంజన్ బాడీ పరిసర ప్రాంతాలు ర్యాలీగా తిరుగుతూ గణతంత్ర దినాన్ని సంబరంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో టీమ్ ఇండియా సాత్ సాత్ ఏక్సాత్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు రాము. బస్తీ వాసులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతంగా నిర్వహించారు..

ఎస్ఎస్‌డీ గ్రామర్ హైస్కూల్ విద్యార్థుల భారీ ర్యాలీ



నవతెలంగాణ- కూకట్ పల్లి

అల్విన్ కాలనీ లోని ఎస్ ఎస్ డి గ్రామర్ స్కూల్ లో జాతీయ జెండా ఆవిష్కరించి, జెండా వందనం నిర్వహించారు, విద్యార్థులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టి విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేశారు. అనంతరం గజ్జల యోగనంద్, డాక్టర్ నరేష్ లు ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ పాఠశాల నుంచి అల్విన్ కాలనీ ,వివేకానంద నగర్ మీదుగా వెళ్లింది. కరస్పాండెంట్ సూరభి రవీంద్ర రావు, చెన్నమనేని స్రవంతి ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న టీటీడీ బోర్డు అడ్వైజరీ కమిటీ మెంబర్ వడ్డేపల్లి రాజేశ్వరరావు, మువ్వ సత్యనారాయణలు గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ఈ ర్యాలీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు

జనాభాకు అనుగుణంగా

మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్
- జీహెచ్ఎంసీ కార్యాలయంలో జెండావిష్కరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు కల్పించేందుకు జీహెచ్ఎంసీ కృషి చేస్తున్న దని కమిషనర్ డీఎస్. లోకేష్‌కుమార్ తెలిపారు. గురువారం గణతంత్ర దినో త్సవం సందర్భంగా జీహెచ్ ఎంసీ ప్రధాన కార్యాల యంలో కమిషనర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి పాల్గొ న్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరం విశ్వ నగరంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో చేరుకో వాల్సిన గమ్యస్థానానికి సకాలంలో చేరేవిధంగా రవాణా వ్యవస్థను మెరుగు పరిచేందుకు ఎస్ఆర్‌డీపీ ద్వారా 42 పనులు చేపట్టగా ఇప్పటి వరకు 31 పనులు పూర్తయ్యాయని తెలిపారు. అందులో 18 ఫ్లై ఓవర్లు, 5 అండర్ పాసులు, 7 ఆర్ఓబీ/ఆయూబీలు అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. మిగతా 11 పనులన్నిం టినీ వచ్చే సంవత్సరం జనవరి 2024 పూర్తి కానున్నాయన్నారు.

గ్రేటర్ హైదరాబాద్‌లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మెరుగైన రవాణా ఏర్పాటు, నిర్వహణ కోసం సీఆర్ఎంపీ ద్వారా 811.96 కిలోమీటర్ల రోడ్డును రీ కార్పెట్ చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు 744.46 కిలోమీటర్లను రీ-కార్పెట్ చేయ డం జరిగిందని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే నగర వాసులకు వరద ముంపు పరిష్కారానికి జీహెచ్ఎంసీ పరిధిలో రూ.733 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 35 పనులను చేపట్టడం జరిగిందన్నారు. అందులో ఇప్పటి వరకు 8 పనులు పూర్తి కాగా మిగిలిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. నగరవాసులకు మౌలిక సదుపాయాలు కల్పించే భాగంగా వివిధ పనులను చేపట్టడం జరిగిందని అన్నారు. ముఖ్యంగా అంతర్గత రోడ్లు, స్టార్మ్ వాటర్ డ్రైన్‌లు, నాలా పూడిక తీత, కమ్యూనిటీహాల్స్ కాంపౌండ్ వాల్స్ నిర్మాణాలు, అన్ని మతాల స్మశానవాటికల అభివృద్ధికి ఈ సంవత్సరంలో రూ. 2250.27 కోట్ల అంచనా వ్యయంతో 10,021 పనులు చేపట్టడం జరిగిందని అన్నారు. అందులో ఇప్పటి వరకు 4225 పను లు పూర్తికాగానే మిగ తా పనులు వివిధ ప్రగతి దశలో ఉన్నా యని వివరించారు.

ప్రజలకు ప్రపంచ నగర స్థాయిలో వసతులు కల్పించేందుకు వినూత్నంగా 29 మోడల్ కారిడార్ రోడ్లను చేపట్టడం జరిగిందన్నారు. ఈ కారిడార్ రోడ్లలో పార్కింగ్, సైక్లింగ్, వెండింగ్ జోన్స్, గ్రీనరి సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. నగరంలో పాద చారుల అనుకూలమైన నగరంగా అభివృద్ధి చేయడం జరుగు తుందని తెలిపారు. గతంలో 20 ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఉండగా, సుమారు రూ.76 కోట్ల వ్యయంతో నూతనంగా 22 ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు చేపట్టడం జరిగిందన్నారు. అందులో 8 అందుబాటులోకి రాగా మిగతావి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయుటకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. నగరంలో 817 కిలోమీటర్ల ఫుట్ పాత్ ఉందని, 60మెట్రో రైల్వే స్టేషన్ లో పెడెస్ట్రేరియన్‌లకు సౌకర్యం కల్పించబడిందన్నారు. రాబోయే రోజుల్లో చేపట్టే 102 జంక్షన్ల అభివృద్ధిలో కూడా పాదచారుల ప్రయోజనంపై దృష్టి పెట్ట డం జరిగిందని వివరించారు. ప్రమాదాల నివారణకు ప్రత్యేకంగా 94 పెలికాన్ సిగ్నల్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పెంపుడు జంతువుల కోసం మరో 5 క్రిమిటోరియంల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరిగిందని అన్నారు. ఫతుల్లాగూడలో ఇప్పటికే ఏర్పాటు చేయగా మిగతా జోన్లలో కూడా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హైదరాబాద్‌కు నలువైపులా వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లను 100 మెగావాట్ల కెపాసిటీతో ఏర్పాటు చేయనున్నామని అన్నారు. ఇప్పటికే జవహర్‌నగర్ డంప్ యార్డ్‌లో 24 మెగావాట్ల విద్యుత్ తయారు చేస్తుండగా, మరో 24 మెగా వాట్లు మంజూరు కాగా అట్టి పనులు కొనసాగుతున్నాయని, దుండి గల్‌లో 14.5, ప్యారానగర్‌లో 15, బిబినగర్‌లో 11, యాచారంలో 14 మెగావాట్ల కెపాసిటీ గల వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లను రాబోయే రోజుల్లో ఏర్పాటు చేయనున్నామని అన్నారు. తద్వారా నగరంలో రోజువారీగా సేకరిస్తున్న చెత్తను నిల్ల ఉంచకుండా అదేరోజు వినియోగించుకోవడం జరుగుతుందని తెలిపారు. మహిళా సాధికారత, సీనియర్ సిటిజన్, పీడబ్ల్యూడీ సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని, మహిళలు ఆర్థిక సాధికారితకు ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు రూ. 437.29 కోట్ల ఆర్థిక సహాయాన్ని 5878 ఎస్‌హెచ్‌జీ మహిళలకు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. స్ట్రీట్ వెండర్‌లకు ఇప్పటి వరకు రూ.73.22 కోట్ల ఆర్థిక సహాయాన్ని 60,775 మందికి పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.

నగర ప్రజలకు ఆహ్లాదకరంగా, కాలుష్యం లేని వాతావరణం కల్పించేందుకు గ్రీనరిని పెంపొందించడం జరుగుతున్నదని, హరిత హారం కార్యక్రమంలో భాగంగా వివిధ పద్ధతుల్లో మొక్కలు పెంచడం జరుగుతుందని తెలిపారు. మల్టీలెవెల్, లేక్ ప్లాంటేషన్, అవెన్యూ, థీమ్‌పార్క్, సెంట్రల్ మీడియన్, వర్టికల్ ప్లాంటేషన్, నర్సరీల నిర్వహణ, ట్రీ-పార్కులు, యాదాద్రి ప్లాంటేషన్ ద్వారా పెద్దఎత్తున గ్రీనరి చేపట్టడం మూలంగా నగరంలో అటవీ విస్తీర్ణం పెరిగినట్లు ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా గుర్తించిందని, ప్రపంచ స్థాయిలో హైదరాబాద్‌కు వరల్డ్ గ్రీనరి అవార్డు పొందిందని గుర్తు చేశారు. నిర్మాణ రంగంలో హైదరాబాద్ దూసుకుని పోతుందని, గృహ నిర్మాణ అనుమతులను పారదర్శకంగా సింగిల్ విండో పద్ధతిలో సత్వరమే ఇవ్వడం జరిగుతుందని తెలిపారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు 13,724 గృహనిర్మాణాలకు అనుమతులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. ఆస్తుల భూసేకరణ నగదు పరిహారం బదులు మొత్తం 1778 టీడీఆర్‌లను జారీచేయడం జరిగిందన్నారు. ఈ సంవత్సరంలో 483 టీడీఆర్‌లను జారీచేశామని వివరించారు. రోడ్డు డెవలప్మెంట్ ప్లాన్ లో భాగంగా 18 రోడ్ల వెడల్పు కార్యక్రమంలో 515 ప్రాపర్టీస్ సేకరణ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శృతిఓజా, ప్రియాంక అలా, యాదగిరిరావు, కృష్ణ, కెన్నడీ, ఈవీడీఎం డైరెక్టర్ విశ్వజిత్ కంపాటి, ఈఎన్‌సీ జియా ఉద్దీన్, సీసీపీ దేవేందర్‌రెడ్డి, సీఈ దేవానంద్, డైరెక్టర్ శ్రీనివాస్, హౌసింగ్ ఓఎస్‌డీ సురేష్ కుమార్, ఎస్ఈలు దత్తుపంతు, విద్యాసాగర్, జాయింట్ కమిషనర్లు శశిరేఖ, సంధ్య, సెక్రటరీ లక్ష్మి, మేయర్ ఓఎస్‌డీ విజయకృష్ణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలానగర్‌లో మహిళ దారుణ హత్య



నవతెలంగాణ-బాలానగర్

సహజీవనం చేస్తూ ఓ మహిళ హత్యకు గురైన సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ కె. భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ సుందరనగర్ ప్రాంతానికి చెందిన గుడిసె రవి, పిల్లలతో కలిసి భార్య పందుల శారద(28) జీవనం సాగిస్తున్నారు. కాగా గత ఏడు నెలల క్రితం శారద తన భర్తతో విభేదించి పిల్లలను వదిలేసి అదే ప్రాంతా నికి చెందిన హరికృష్ణతో వచ్చి బాలానగర్ డివిజన్ పరిధిలోని అంబికా కాలనీలో ఉంటూ సహ జీవనం చేస్తున్నారు. కొంత కాలంగా ఇద్దరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయని, అయితే బుధవారం హరికృష్ణ శారదను గొం తుకోసి చంపేసి తాళం వేసి పరారయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోగా రక్తపు మడుగులో ఉన్న ఆమెను గాంధీ మార్చురీకి తరలించి వివరాలను సేకరిస్తున్నారు. ప్రస్తుతం కారణాలు తెలియరాలేదని, వారి మధ్య ఏమైనా గొడవల వల్ల హత్య చేశాడా లేదా వేరే కారణం ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

టీఎన్జీవో ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు సేవ రత్న డాక్టర్ ఎస్. ఎం. హుస్సేనీ (ముజీబ్) నేతృత్వములో జిల్లా కార్యాలయ ప్రాంగణములో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించిన డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ ఎందరో సమరయోధులు తమ ప్రాణాలను దేశం కోసం త్యాగం చేసిన ఫలితముగా ఈ రోజు మనమందరము స్వేచ్ఛగా బతుకున్నామని తెలి పారు. అంబేడ్కర్ నేతృత్వంలో మేధా వులు, దార్శనికులు రాజ్యాంగ రూపకల్పన చేసారని, దాని ఫలితమే ఈ రోజు దేశ ప్రజలందరూ సంపూర్ణ స్వేచ్ఛ, సమానత్వం, లౌకిక తత్వం, న్యాయాన్ని తమ పూర్తి హక్కు గా పొందడం జరిగినదని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉద్యోగిగా ఎన్నికైన జిల్లా ఉపాధ్యక్షుడు ఒమేర్ ఖాన్ నీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి విక్రమ్ కుమార్, సహా అధ్యక్షుడు కే ఆర్ రాజ్ కుమార్, సభ్యులు శ్రీ ఈ నరేష్, ఖాలెద్ అహ్మద్, వైదిక్ శాస్త్ర, శంకర్, ముఖీమ్, శ్రీధర్ నాయుడు, ఉస్మాన్, రామ కృష్ణ రెడ్డి, ఇబ్రహీం, జగదీష్, వహీద్, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు

జెండా ఊంఛా.. రహే హమారా



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట.

జగద్గిరిగుట్ట వెంకటేశ్వర నగర్ లో గల బాపూజీ హైస్కూల్ లో గురువారం గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు పాఠశాల ఆవరణలో చైర్మన్ .కరస్పాండెంట్ నవ్వ ప్రభాకర్ రావు జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం పాఠశాల గ్రౌండ్స్ లో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు. విద్యార్థులు పాల్గొన్నారు.



పాపిరెడ్డి నగర్ లో గల రాజధాని హైస్కూల్లో గణతంత్ర వేడుకలు పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. చైర్మన్. కరస్పాండెంట్ యాద నరేంద్ర. ప్రిన్సిపాల్ యాద రేణుకలు పాల్గొని జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు. పాల్గొన్నారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

భగత్ సింగ్ మార్గ్‌లో గల శ్రీ సాయి విద్యానికేతన్



పాఠశాలలో ఏర్పాటుచేసిన గణతంత్ర వేడుకలకు పాఠశాల చైర్మెన్ కరస్పాండెంట్. బీర్రు ఆంజనేయులు పాఠశాల అకాడ మిక్ డైరెక్టర్, ప్రిన్సిపల్ బీర్రు శోభారాణి పాల్గొని జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం పాఠశాల ఆవరణలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. మహనీయుల వేషధారణలో చిన్నారులు ఆకర్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

సీఐటీయూ, డీవైఎఫ్ఐ ఆవాజ్ కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి కీలకాని లక్ష్మణ్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కే బీరప్ప, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి అంజయ్య పాల్గొని మాట్లాడారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో షాపూర్ నగర్ సీఐటీయూ కార్యాలయం, షాపూర్ నగర్ మార్కెట్ హమాలి, ఆటో ట్రాలీ యూనియన్, సెంట్రింగ్ కార్మికుల యూనియన్, షాపు నగర్ భవన నిర్మాణ కార్మికుల అడ్డా దగ్గర జాతీయ జెండాలను ఆవిష్కరించారు. సీఐటీయూ నాయకులు దేవదానం , మల్లారెడ్డి , కరుణాకర్ , జాకీర్ ,సలీం, మహిళా సంఘం నాయకురాలు స్వాతి , ఖలీల్, గాని ,శ్రీనివాస్ ,బాబురావు, రాజ్ కుమార్, సుభాష్, మైసయ్య, సీనియర్ నాయకులు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



బాగ్‌లింగంపల్లిలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నియో కర్సర్ 7వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. నవతెలంగాణ-సిటీబ్యూరో

సందడిగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మండల వ్యాప్తంగా గురువారం గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఊరు,వాడ మువ్వన్నెల జెండాలు రెపరెపలాడాయి.మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన త్రివర్ణ పతాకాన్ని కమీషనర్ అహ్మద్ షఫియుల్లాహ్ ఆవిష్కరించారు. చైర్ పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి, కౌన్సిలర్లు బత్తుల శివ కుమార్ యాదవ్,మర్రి శ్రీనివాస్ రెడ్డి,ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి,కో ఆప్షన్ మెంబర్ నవీన్ రెడ్డి, మహబూబ్ అలీ,ఆరే గీత మధుకర్,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను మున్సిపల్ కమిషనర్ రాములు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు,మున్సిపల్ కార్యాలయ సిబ్బంది,నాయకులు పాల్గొన్నారు.మేడ్చల్ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను ఎంపీడీవో పద్మావతి ఆవిష్కరించారు.కార్యక్రమంలో ఎంపీపీ వీర్లపల్లి రజిత రాజా మల్లారెడ్డి, జిల్లా పరిషత్ చైర్మెన్ శరత్ చంద్ర రెడ్డి, జెడ్పీటీసీలు శైలజా విజయానంద రెడ్డి,హరివర్ధన్ రెడ్డి,అనిత లలయ్య,రైతు బంధు జిల్లా అధ్యక్షుడు నందా రెడ్డి,జిల్లా పరిషత్ సీఈవో దేవ సహాయం, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మెన్‌లు పాల్గొన్నారు కూకట్ పల్లి

కూకట్‌పల్లి : 124 డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ,ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని కార్పొరేటర్ కార్యాలయం, మరియమ్మ నగర్, విజయన గర్ కాలనీ, ఆల్విన్ కాలనీ ఫేస్ 1, ఆల్విన్ కాలనీ ఫేస్ 2, చక్రధారి నగర్, వెంకటపాపయ్య నగర్, అనసూయమ్మ మహంకాళి నగర్, ఛత్రపతి శివాజీ నగర్, ఎల్లమ్మబండ చౌరస్తా, జి.ఎస్.ఆర్ నగర్, సాయి నగర్ వెస్ట్, జలకన్య హొటల్ చౌరస్తా, మహంకాళి నగర్, ఆశానగర్,



శాతవాహన నగర్, ఉజ్జయిని మహంకాళి నగర్, పంచమి కాలనీ, కొండా లక్ష్మణ్ బాపూజీ చౌరస్తా, వార్డ్ ఆఫీస్ వద్ద త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి అందరికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, అనిల్ రెడ్డి, జిల్లా గణేష్, కాశినాథ్ యాదవ్, గుడ్ల శ్రీనివాస్, బోయా కిషన్, భాస్కర్ రెడ్డి, షౌకత్ అలీ మున్నా, అగ్రవాసు, సమ్మద్, కరీమ్, కృష్ణారావు, ప్రదీప్ రెడ్డి, ఏ ఈ శ్రావణి, రాజ్యలక్ష్మి, మధులత, శిరీష సత్తుర్, లావణ్య స్వరూప, పుట్టం దేవి, లక్ష్మీ కవిత, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, సాంబారెడ్డి, భిక్షపతి, సాయి గౌడ్, సతీష్, బస్తి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ : సుభాష్‌నగర్ డివిజన్, జేఎస్ఆర్ కాంప్లెక్స్ జీడిమెట్ల సబ్ స్టేషన్ వద్ద గల శ్రీ ఆదిత్య హైస్కూల్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ప్రిన్సిపల్ కామేశ్వరి ఆవిష్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం, విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



గణతంత్ర దినోత్సవ వేడుకలు సత్యవాణి విద్యానికేతన్ ఎస్సార్ నాయక్ నగర్, టీవీఆర్ మోడల్ హై స్కూల్ అపురూప కాలనీలో గురు వారం అంగరంగ వైభవంగా జరిగాయి. టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ టి. వంశీకృష్ణ రెడ్డి, సూరా రవిచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో



గణతంత్ర దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి జీడిమెట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.పవన్, చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ (సౌత్ సెంట్రల్ రైల్వే) కే.విశాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా ఆవిష్కరణ చేశారు. అపురూప అసోసియేషన్ సెక్రెటరీ రమణ కూడా హాజరయ్యారు. విద్యార్థులు దేశభక్తితో భారతీయ సంస్కృతి వస్త్ర అలంకరణలతో చేసే సంస్కృతిక కార్యక్రమాలు చూసి చిన్నారులను అభినందించారు.



సూరారం డివిజన్, షాపూర్ నగర్, సంజయ్ గాంధీ నగర్‌లోని సాధన స్కూల్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై, ప్రిన్సిపల్ రాజుతో కలిసి పాఠశాల ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

బాలానగర్ : కూకట్ పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలో



కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి పార్టీ నాయకులతో కలిసి కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం డివిజన్ పరిధిలోని పలు బస్తిలలో, కాలనీలలో ఆహ్వానం మేరకు జెండా ఆవిష్కరించారు. పార్టీ నాయకులు, మహిళలు కాలనీ, బస్తి అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కందాడి జ్యోత్స్నా శివారెడ్డి జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా నియోజకవర్గాలలో, ప్రతీ గ్రామంలో, ప్రతి ఇంటికి, ప్రతీ గుండెకు చేరే విధంగా హాత్ సే హాత్



జోడో యాత్రకు నేడు అంకురార్పణని ఆమె తెలిపారు.

అడ్డగుట్టలో రిపబ్లిక్ డే ఉత్సవాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

అడ్డగుట్ట సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ సంఘం, కార్మిక సంఘం, ఐద్వా, వృత్తి సంఘాల ఆధ్వర్యంలో అడ్డగుట్టలో జెండా ఆవిష్కరణలు జరిగాయి. నాయకులు జయ ప్రకాష్, ప్రవీణ్, ఆనంద్,అజయ్ బాబు, సత్యనారాయణ,కె.నాగలక్ష్మి లు మాట్లాడుతూ 74 సంవత్సరాలు గడిచినా కూడా ప్రజల మధ్య వివక్షతలు, కుల,మత కుంపటీలు ఉన్నాయన్నారు. ధరల మీద ధరలు పెంచడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. అర్ధాకలితో ప్రజలు గడపాల్సివస్తోందని చెప్పారు. అనంతరం మహిళా సంఘం వారు సంక్రాంతికి నిర్వహించిన ముగ్గుల పోటీలో గెలుపొందిన 21 మందికి బహుమతులు ఇచ్చారు. ఐద్వా గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రజలు రిపబ్లిక్ రాజ్యం లో కూడా అనునిత్యం అనేక సమస్యలు ఎదుర్కొంటు న్నారని, నిరుద్యోగం,ధరల పెరుగుదలతో పాటు పేద ప్రజలకు విద్యా వైద్యం అందుబాటులో లేకుండా పోతున్నాయని, మహిళలపై లైంగికదాడులు నిత్యకృత్యంగా మారాయని వీటిపై అందరూ ఐక్యంగా పోరాడాలని చెప్పారు. నాయకులు మహేష్, శ్యామ్ కుమార్, నరసింహ, దీవెన,నిర్వాహకులు ఆలేఖ్య, వసంత,లక్ష్మి, అంజమ్మ, కిరణ్, కుమారి తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ ఆంథోనీ హైస్కూల్‌లో గణతంత్ర వేడుకలు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి , సుచిత్ర లోని సెయింట్ అంథోనీ హై స్కూల్ లలో ఘనంగా గణతంత్ర దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల డైరెక్టర్ ఎస్ పి.సుందర రాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులను తల్లిదండ్రులు ను ఆకట్టుకున్నాయి. పాఠశాల డైరెక్టర్ మాట్లాడుతూ రాజ్యాంగం గొప్పతనము, గణతంత్ర విశిష్టత ను విద్యార్థులకు వివారంచారు. అనంతరం కొంపల్లిలోని పార్కవుడ్ కాలనీలో గణతంత్ర దినోత్సవ జరపుకొన్నారు. పార్కవుడ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మాజీ అటవీశాఖ అధికారి మహేందర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కాలనీ సెక్రెటరీ సుందర రాజు గణతంత్ర దినోత్సవం విశిష్టత ను తెలియజేసారు. కాలనీ సభ్యులు నారాయణరెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, విజయ్, గోపాలరెడ్డి పాల్గొన్నారు.





స్వదేశీ వైట్‌బాల్ ధమాకాలో మరో అంకానికి తెరలేచింది. న్యూజిలాండ్‌పై వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన భారత్.. తాజాగా పొట్టి ఫార్మాట్‌లో ధనాధన్‌కు సిద్ధమవుతోంది. హార్దిక్ పాండ్య ముచ్చటగా మూడో సిరీస్‌లో భారత్‌కు సారథ్యం వహించనుండగా యువ ఆటగాళ్లతో కూడిన భారత్‌పై పర్యటనలో తొలి విజయం సాధించేందుకు న్యూజిలాండ్ తహతహలాడుతోంది. ధోని ఇలాకా రాంచీలో భారత్, న్యూజిలాండ్ ధనాధన్ నేడు.

ఇక పొట్టి పోరు!

భారత్, కివీస్ తొలి టీ20 నేడు
రాత్రి 7.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

నవతెలంగాణ-రాంచి

సీనియర్ క్రికెటర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలు లేకుండానే టీమ్ ఇండియా వరుసగా మూడో టీ20 సిరీస్‌కు రంగం సిద్ధం చేసుకుంది. వైట్‌బాల్ ఫార్మాట్‌లో ద్వంద్వ కెప్టెన్సీ విధానం అమలు చేస్తున్నారా? రెగ్యులర్ సారథికి విశ్రాంతి ఇచ్చారా? యువ జట్టుతోనే పొట్టి ఫార్మాట్‌లో కొనసాగుతారా? అనే ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండానే భారత క్రికెట్‌ను బీసీసీఐ ముందుకు నడిపిస్తోంది. భారత క్రికెట్ దిగ్గజం ఎం.ఎస్ ధోని అడ్డా రాంచీలో ఆతిథ్య జట్టుకు తిరుగులేని రికార్డుంది. ఇక్కడ ఆడిన మూడు టీ20 మ్యాచుల్లో టీమ్ ఇండియా విజయాలు సాధించింది. భారత పర్యటనలో తొలి విజయం కోసం ఎదురుచూస్తున్న న్యూజిలాండ్ ఓవైపు, పాండ్య సారథ్యంలోని యువ భారత్ ఓవైపు నేడు రాంచీ షోకు సిద్ధం.



సత్తా చాటుతారా?

2022 ఐసీసీ టీ20 ప్రపంచకప్ అనంతరం భారత టీ20 జట్టులో విప్లవాత్మక మార్పులు కనిపిస్తున్నాయి. అధికారికంగా బోర్డు ఎటువంటి ప్రకటన చేయకపోయినా.. పొట్టి ఫార్మాట్‌లో యువ క్రికెటర్లతోనే ముందుకెళ్లే ప్రణాళిక అమలు జరుగుతోంది. బ్యాటింగ్ విభాగంలో సూర్యకుమార్ యాదవ్ ప్రపంచానికి సత్తా చాటాడు. కానీ టాప్ ఆర్డర్‌లో మిగతా బ్యాటర్లు ఆ స్థాయి అందుకోవాల్సి ఉంది. రుతురాజ్‌కు గాయంతో గిల్, కిషన్, పృథ్వీ షా రూపంలో ముగ్గురు ఓపెనర్లు ఉన్నారు. పృథ్వీ షా భయమెరుగని క్రికెట్‌కు బ్రాండ్ అంబాసిడర్. ఇషాన్ కిషన్ తుఫాన్ ఇన్నింగ్స్‌లు ఆడటంలో దిట్ట. గిల్ కెరీర్ భీకర ఫామ్‌లో ఉన్నాడు. గిల్ తోడుగా కిషన్ ఇన్నింగ్స్ ఆరంభించే అవకాశం ఉంది. అయితే, ఈ ఫార్మాట్లో ఈ ఇద్దరూ పరిస్థితులకు అనుగుణంగా, జట్టు ప్రణాళికల ప్రకారం ఎదురుదాడి పరీక్షలో నెగ్గాల్సి ఉంది. ఇక బౌలింగ్ విభాగంలో ఉమ్రాన్ మాలిక్, శివం మావిలు తుది జట్టులో కొనసాగనున్నారు. అరంగేట్ర సిరీస్‌లో శివం మావి మెప్పించాడు. వికెట్లు, పరుగుల పొదుపుతో కెప్టెన్ నమ్మకాన్ని చూరగొన్నాడు. ఉమ్రాన్ మాలిక్ వికెట్ల పరంగా ఫర్వాలేదనిపించినా, పరుగుల పొదుపులో మెరుగుపడాల్సి ఉంది. ఆరు మ్యాచుల్లో 9 వికెట్లు కూల్చిన మాలిక్.. 10.90 ఎకానమీతో ధారాళంగా పరుగులు సమర్పించాడు. ఎకానమీ అంశంలో ఉమ్రాన్ మాలిక్ లోపాలు దిద్దుకుంటేనే తుది జట్టులో నిలువగలడు. స్పిన్ విభాగంలో చైనామన్ కుల్దీప్ యాదవ్, మణికట్టు మాయగాడు యుజ్వేంద్ర చాహల్ ఒకే స్థానం కోసం పోటీపడుతున్నారు. తాజా ఫామ్‌తో కుల్దీప్ యాదవ్ తుది జట్టులో నిలిచే అవకాశం కనిపిస్తోంది.

పుంజుకుంటారా?

కేన్ విలియమ్సన్, టిమ్ సౌథీ. న్యూజిలాండ్‌కు బ్యాట్‌తో, బంతితో ఇద్దరు అగ్ర ఆటగాళ్లు. ఈ ఇద్దరు లేకుండానే కివీస్ జట్టు భారత పర్యటనకు వచ్చింది. మూడు వన్డేల్లో చేతులెత్తేయగా.. ఇక టీ20ల్లోనైనా పోటీ ఇచ్చేందుకు సన్నద్ధమవుతోంది. పొట్టి ఫార్మాట్‌లో కెప్టెన్సీ పగ్గాలు మిచెల్ శాంట్నర్ అందుకున్నాడు. బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో న్యూజిలాండ్‌కు ప్రతిభావంతులు అందుబాటులో ఉన్నారు. కానీ అనుభవం పరంగా కివీస్ అత్యంత బలహీనం. పొట్టి ఫార్మాట్‌లో గణాంకాలు, సమీకరణాలకు పెద్దగా చోటుండదు. అందుకే ఫిన్ అలెన్, డెవాన్ కాన్వే మార్క్ చాప్‌మన్, గ్లెన్ ఫిలిప్స్, డార్లీ మిచెల్‌లు భారత్‌కు సవాల్ విసరనున్నారు. వన్డే సిరీస్‌లో మెరిసిన మైకల్ బ్రాస్‌వెల్, మిచెల్ శాంట్నర్ అదే జోరు కొనసాగించేందుకు చూస్తున్నారు. బంతితో లాకీ ఫెర్గుసన్ ఒక్కడే అనుభవజ్ఞుడు. ఇశ్ సోధి ఫిట్‌నెస్ సాధించటం కివీస్‌కు అతి పెద్ద ఊరట. బ్లెయిర్ టిక్‌నర్, బెన్ లిస్టర్‌లు సత్తా చాటేందుకు ఎదురుచూస్తున్నారు.

పిచ్, వాతావరణం

రాంచీ పిచ్ తొలుత బౌలింగ్ చేసిన జట్టుకు అనుకూలం. ఇక్కడ 25 టీ20 మ్యాచుల్లో 16 మ్యాచుల్లో ఛేదించిన జట్టును విజయం వరించింది. రెండో ఇన్నింగ్స్‌లో మంచు ప్రభావం గణనీయంగా కనిపించనుంది. టాస్ నెగ్గిన కెప్టెన్ తొలుత బౌలింగ్ ఎంచుకునేందుకు ఏమాత్రం ఆలోచన చేయరు. శుక్రవారం రాంచీలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉండనుంది. చల్లని సాయంత్రం పొట్టి పోరు ఉత్సాహాన్ని రెట్టింపు చేయనుంది. ఎటువంటి వర్షం సూచనలు లేవని సమాచారం.

తుది జట్లు (అంచనా)

భారత్ : శుభ్‌మన్ గిల్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), రాహుల్ త్రిపాఠి, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్య (కెప్టెన్), దీపక్ హుడా, వాషింగ్టన్ సుందర్, శివం మావి, ఉమ్రాన్ మాలిక్, అర్షదీప్ సింగ్, కుల్దీప్ యాదవ్/యుజ్వేంద్ర చాహల్.

న్యూజిలాండ్ : ఫిన్ అలెన్, డెవాన్ కాన్వే (వికెట్ కీపర్), మార్క్ చాప్‌మన్, గ్లెన్ ఫిలిప్స్, డార్లీ మిచెల్, మైకల్ బ్రాస్‌వెల్, మిచెల్ శాంట్నర్ (కెప్టెన్), బ్లెయిర్ టిక్‌నర్, ఇశ్ సోధి, బెన్ లిస్టర్, లాకీ ఫెర్గుసన్.



కష్టాల్లో హైదరాబాద్

ఢిల్లీతో రంజీ మ్యాచ్

నవతెలంగాణ,హైదరాబాద్

రంజీ ట్రోఫీలో ఆరో పరాజయం దిశగా హైదరాబాద్ సాగుతోంది!. ఎలైట్ గ్రూప్-బిలో చివరి మ్యాచ్‌లో హైదరాబాద్ ఓటమి అంచున నిలిచింది. రోహిత్ రాయుడు (153) సెంచరీతో తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 355 పరుగులు చేసింది. ఆయుశ్ బదాని (191) శతకంతో తొలి ఇన్నింగ్స్‌లో ఢిల్లీ 433 పరుగులు చేసి విలువైన ఆధిక్యం దక్కించుకుంది. రెండో ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ బ్యాటర్లు చేతులేత్తేశారు. 31 ఓవర్లలో 90 పరుగులకు హైదరాబాద్ 5 వికెట్లు కోల్పోయింది. తన్మయ్ (11), రాహుల్ (6), రోహిత్ (32), నితీశ్ (0), చందన్ (0) విఫలమయ్యారు. ప్రస్తుతం 12 పరుగుల ఆధిక్యంలో నిలిచిన హైదరాబాద్ నేడు చివరి రోజు ఆటలో ఢిల్లీ బౌలర్లను ఎదురొడ్డి నిలువటం అసాధ్యం. నేడు తొలి సెషన్లో హైదరాబాద్ చివరి ఐదు వికెట్లు నిలుపుకుంటే అదే గొప్ప!. ఇక విజయంతో సీజన్‌ను ముగించేందుకు ఢిల్లీ రంగం సిద్ధం చేసుకుంది.

ఫిబ్రవరి 4న ఏసీసీ భేటీ



న్యూఢిల్లీ : ది ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) కీలక సమావేశానికి సిద్ధం కానుంది. ఫిబ్రవరి 4న బహ్రెయిన్‌లో ఆసియా క్రికెట్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం జరుగన ంది. ఈ భేటీకి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)తో పాటు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) హాజరు కానున్నాయి. దాయాది దేశాల క్రికెట్ బోర్డులు భేటీకి రానుండటంతో సమావేశ వాతావరణం కాస్త వేడెక్కనుంది. 2023 ఆసియా కప్ ఆతిథ్య హక్కులు పాకిస్థాన్ దక్కించుకుంది. ఆగస్టు-సెప్టెంబర్‌లో ఆసియా కప్ నిర్వహించాల్సి ఉంది. ఇరు దేశాల నడుమ ద్వైపాక్షిక సంబంధాలు క్షీణించిన తరుణంలో పాక్‌లో పర్యటించేందుకు భారత జట్టు సుముఖంగా లేదు. దీంతో ఆసియా కప్ కోసం పాక్‌లో అడుగుపెట్టమని బీసీసీఐ కార్యదర్శి జై షా ప్రకటించారు. అదే జరిగితే, భారత్‌లో జరిగే 2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌ను బహిష్కరిస్తామని అప్పటి పీసీబీ చైర్మెన్ రమీజ్ రాజా ఘాటుగా స్పందించారు. పీసీబీ చైర్మెన్‌గా నజం సేథి బాధ్యతలు తీసుకున్నప్పటికీ ఆ బోర్డు వైఖరిలో మార్పు వచ్చినట్టు కనిపించటం లేదు. దీంతో ఇప్పుడు ఆసియా క్రికెట్ కౌన్సిల్ వేదికగా బీసీసీఐ, పీసీబీ తాడోపేడో తేల్చుకునే అవకాశం ఉంది. ఆసియా కప్ వేదికపై ఈ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకోనున్నారు.

రుతురాజ్‌కు గాయం

కివీస్‌తో టీ20 సిరీస్‌కు దూరం



ముంబయి : భారత యువ ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ గాయానికి గురయ్యాడు. టీమ్ ఇండియా టీ20 ప్రణాళిల్లో కీలకంగా ఉన్న రుతురాజ్ గైక్వాడ్ మణికట్టు గాయంతో న్యూజిలాండ్‌తో మూడు టీ20ల సిరీస్‌కు దూరమయ్యాడు. చికిత్స, రిహాబిలిటేషన్ నిమిత్తం బెంగళూర్‌లోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)కి రుతురాజ్ చేరుకున్నాడు. రంజీ ట్రోఫీలో హైదరాబాద్‌తో మ్యాచ్‌లో రుతురాజ్ గైక్వాడ్ మణికట్టు నొప్పిపై బీసీసీఐ వైద్య బృందానికి ఫిర్యాదు చేశాడు. శ్రీలంకతో టీ20 మ్యాచ్‌కు సైతం రుతురాజ్ గైక్వాడ్ ఇటువంటి కారణంతోనే దూరమయ్యాడు. వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు కోవిడ్-19 మహమ్మారితో ఆడలేకపోయాడు. వరుసగా పలు వైద్య కారణాలతో రుతురాజ్ గైక్వాడ్ జాతీయ జట్టుకు దూరం కావటం పట్ల జట్టు మేనేజ్‌మెంట్ అసంతృప్తిగా ఉన్నట్టు సమాచారం. రుతురాజ్ గైక్వాడ్ స్థానంలో మరో ఆటగాడిని ఎంపిక చేయలేదు. ముంబయి స్టార్ పృథ్వీ షా అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు. ఇదిలా ఉండగా, స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఫిట్‌నెస్‌పై బీసీసీఐ ఫిబ్రవరి నివేదిక అందుకోనుంది. ఆస్ట్రేలియా, భారత్ బోర్డర్ గవాస్కర్ ట్రోఫీకి ముందు రంజీ ట్రోఫీలో మ్యాచ్ ఫిట్‌నెస్ నిరూపించుకునేందుకు రవీంద్ర జడేజా ప్రస్తుతం తమిళనాడుతో రంజీ మ్యాచ్ ఆడుతున్నాడు. తమిళనాడుతో రంజీ మ్యాచ్ అనంతరం రవీంద్ర జడేజా నేరుగా బెంగళూర్‌లోని ఎన్‌సీఏకు చేరుకోనున్నాడు. అక్కడ రవీంద్ర జడేజాకు ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహించి తుది నివేదికను బోర్డుకు అందించనున్నారు. ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్ ముంగిట భారత శిక్షణ శిబిరం నాగ్‌పూర్‌లో ఫిబ్రవరి 2 నుంచి ఆరంభం కానుంది. ఫిబ్రవరి 1న రవీంద్ర జడేజా ఫిట్‌నెస్‌పై ఓ స్పష్టత రానుంది.

నవచిత్రం



సత్యదేవ్

పాన్ ఇండియా సినిమాగా జీబ్రా

సత్యదేవ్, కన్నడ స్టార్ డాలీ ధనంజయ్ కలిసి ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వంలో క్రైమ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చేస్తున్నారు. సత్యదేవ్, డాలీ ధనంజయ ఇద్దరికీ ఇది 26వ ప్రాజెక్ట్. రిపబ్లిక్ డే సందర్భంగా మేకర్స్ ఈ చిత్రానికి 'జీబ్రా' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు.

'లక్ ఫేవర్స్ ది బ్రేవ్' అనేది ఈ సినిమా ట్యాగ్ లైన్. టైటిల్ లాగే టైటిల్ పోస్టర్ కూడా ఆకట్టుకునేలా ఉంది. పద్మజ ఫిలింస్ ప్రైవేట్ లిమిటెడ్, ఓల్డ్ టౌన్ పిక్చర్స్ పతాకాలపై ఎస్ఎన్ రెడ్డి, బాల సుందరం, దినేష్ సుందరం నిర్మిస్తున్న ఈ చిత్రంలో ప్రియా భవానీ శంకర్, జెనిఫర్ పిచినెటో కథానాయికలుగా నటిస్తున్నారు. సత్యరాజ్ ఈ సినిమాలో కీలక పాత్రలో నటిస్తున్నారు. సత్య ఆకుల, సునీల్ ఇతర ముఖ్య తారాగణం.

టీమ్ 50 రోజుల మొదటి షెడ్యూల్‌ను పూర్తి చేసింది. మిగిలిన షూటింగ్ హైదరాబాద్, కోల్‌కతా, ముంబై ప్రాంతంలో ప్లాన్ చేశారు. ఈ పాన్-ఇండియన్ మూవీ కోసం మ్యూజిక్ డైరెక్టర్ రవి బస్రూర్ పని చేస్తున్నట్లు అనౌన్స్ చేశారు. ఈ పాన్ ఇండియా మూవీ తెలుగు, కన్నడ, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో థియేటర్లలో విడుదల కానుంది.

ప్రతి మలుపుని ఎంజాయ్ చేస్తారు

సుహాస్ నటించిన కొత్త సినిమా 'రైటర్ పద్మభూషణ్. నూతన దర్శకుడు షణ్ముఖ ప్రశాంత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో టీనా శిల్పరాజ్ కథానాయిక.

ఛాయ్ బిస్కెట్ ఫిల్మ్స్, లహరి ఫిల్మ్స్ బ్యానర్స్ పై అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర, చంద్రు మనోహర్ నిర్మించిన ఈ చిత్రాన్ని జి. మనోహర్ సమర్పిస్తున్నారు. ఫిబ్రవరి 3న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న నేపథ్యంలో సుహాస్ మీడియాతో మాట్లాడుతూ, 'దర్శకుడు ప్రశాంత్ 'కలర్ ఫోటో' సినిమాకి సహాయ దర్శకుడు. తర్వాత 'ఫ్యామిలీ డ్రామా' అనే సినిమా చేశాను. దానికి ప్రశాంత్ రైటర్. 'కలర్ ఫోటో' తర్వాత ఈ కథ చెప్పాడు. సినిమా అంతా చాలా ఎగ్జైటింగ్‌గా ఉంటుంది. ముఖ్యంగా క్లైమాక్స్‌కి అందరూ బాగా కనెక్ట్ అవుతారు. రైటర్ పద్మభూషణ్ ఖచ్చితంగా ఎంటర్‌టైన్ చేస్తాడు. ఇందులో అనుమానమే లేదు. ఫస్ట్ హాఫ్‌లో రెండు, సెకండ్ హాఫ్‌లో మూడు ట్విస్ట్‌లు వస్తాయి. క్లైమాక్స్‌లో ఇంకా మంచి ట్విస్ట్ ఉంటుంది. ప్రతి మలుపుని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు. ఈ సినిమా తర్వాత గీతా ఆర్ట్స్2లో ఓ సినిమా, 'ఆనందరావు అడ్వంచర్స్' అనే మరో సినిమా చేస్తున్నాను' అని తెలిపారు.



సుహాస్



'ఆపరేషన్ రావణ్' చిత్ర ఫస్ట్‌లుక్

నీ ఆలోచనలే నీ శత్రువులు

'పలాస 1978' లాంటి పీరియడ్ యాక్షన్ థ్రిల్లర్‌తో అఖండ విజయం సాధించడమే కాకుండా పలువురు చిత్ర ప్రముఖులు, విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు హీరో అట్లూరి రక్షిత్. ఆయన హీరోగా నటిస్తున్న న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్ 'ఆపరేషన్ రావణ్'. సంగీర్తన విపిన్ హీరోయిన్‌గా నటించారు. ఈ చిత్రంలో రాధికా శరత్ కుమార్, చరణ్ రాజ్, తమిళ నటుడు విద్యా సాగర్ ప్రముఖ పాత్రలు పోషించారు. ఈ చిత్రంతో వెంకట సత్య దర్శకుడిగా పరిచయమవుతున్నారు.

'నీ ఆలోచనలే నీ శత్రువులు' అనే కాప్షన్‌తో రక్షిత్ ఉన్న ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌ని మేఘా అండ్ ఒమేఘా విద్యా సంస్థల వైస్ చైర్ పర్సన్ మాలతి రెడ్డి లాంచ్ చేశారు. ధ్యాన్ అట్లూరి నిర్మాణంలో షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణంతర కార్యక్రమాలలో నిమగ్నమై ఉంది. విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్ ఈ సినిమాపై ఆసక్తితోపాటు భారీ అంచనాలను పెంచిందని చిత్ర బృందం తెలిపింది. కాంచి, రాకెట్ రాఘవ, రఘు కుంచె, కెఎ పాల్ రాము, విద్యా సాగర్, టీవీ5 మూర్తి, కార్తీక్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: శరవణ వాసుదేవన్, డైలాగ్స్: లక్ష్మీ లోహిత్ పూజారి, ఎడిటర్: సత్య గిద్దుటూరి, ఆర్ట్: నాని.టి, ఫైట్స్: స్టంట్ జాషువా, కొరియోగ్రఫీ: జేడి, ఛాయాగ్రహణం: నాని చమిడిశెట్టి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శ్రీపాల్ చొళ్లేటి.



ఘనంగా శర్వానంద్ నిశ్చితార్థం

హీరో శర్వానంద్ త్వరలో తన బ్యాచ్‌లర్ లైఫ్‌కి ఫుల్‌స్టాప్ పెట్టబోతున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రక్షితా రెడ్డితో ఆయన ఏడడుగుల బంధంలోకి అడుగు పెట్టనున్నారు. గురువారం ఉదయం ఇరు కుటుంబ సభ్యుల సమక్షంలో హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో వీరి నిశ్చితార్థ మహోత్సవం గ్రాండ్‌గా జరిగింది. పలువురు సినీ ప్రముఖులు ఈ వేడుకకు హాజరై కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించారు.

సోదర సోదరీమణులారా..




కమల్ కామరాజు, అపర్ణాదేవి

కమల్ కామరాజు, అపర్ణాదేవి ప్రధాన పాత్రల్లో 9 ఈఎం ఎంటర్టైన్మెంట్స్, ఐఆర్ మూవీస్ బ్యానర్లపై సంయుక్తంగా విజయ్ కుమార్ పైండ్ల నిర్మిస్తున్న చిత్రం 'సోదర సోదరీమణులారా...'. నూతన దర్శకుడు రఘుపతి రెడ్డి రచన, దర్శకత్వంలో ఆకట్టుకునే టైటిల్‌తో రూపొందిన ఈ చిత్రం ఇటీవలే చిత్రీకరణ పూర్తి చేసుకుంది. పక్కా స్క్రిప్ట్‌తో పెర్ఫెక్ట్ ప్లానింగ్‌తో 35 రోజుల్లో తెరకెక్కిన ఈ సినిమా హార్ట్ టచింగ్ ఫ్యామిలీ డ్రామాగా ప్రేక్షకులను అలరించనుంది.

గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ చిత్ర బృందం ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. సిస్టర్స్ అండ్ బ్రదర్స్ టాగ్ లైన్‌తో కమల్ కామరాజు, అపర్ణాదేవి ఎమోషనల్ లుక్‌తో ఉన్న ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్ చూడగానే ఆకట్టుకుంటుంది. టైటిల్, పోస్టర్‌తోనే అందరూ అన్వయించుకొనే పాత్రలతో రియాలిస్టిక్ డ్రామాగా ఈ సినిమా ఉండనుంది అనే ఫీలింగ్ కలిగిస్తుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని సమ్మర్‌లో విడుదల చేయనున్నారు. 3 పాటలున్న ఈ చిత్రానికి మదీన్ ఎస్. కె సంగీతం అందిస్తుండగా, మోహన్ చారి కెమెరామెన్‌గా, వంశీ కృష్ణ సి. హెచ్ ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

'సైంధవ్' షూటింగ్ షురూ



శైలేష్ కొలను, నవాజుద్దీన్ సిద్దిఖీ, వెంకట్ బోయనపల్లి, వెంకటేష్

వెంకటేష్ 75వ ల్యాండ్ మార్క్ చిత్రం 'సైంధవ్'. గురువారం రామానాయుడు స్టూడియోస్‌లో కోర్ టీమ్‌తో పాటు పలువురు ప్రత్యేక అతిథుల సమక్షంలో పూజా కార్యక్రమాలతో ఘనంగా ఈ సినిమా ప్రారంభమైంది. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై వెంకట్ బోయనపల్లి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్నారు. రానా దగ్గుబాటి, నాగ చైతన్య, సురేష్ బాబు స్క్రిప్ట్‌ను మేకర్స్‌కి అందజేశారు. కె రాఘవేంద్రరావు క్లాప్ ఇవ్వగా, దిల్‌రాజు కెమెరా స్విచాన్ చేశారు. తొలి షాట్‌కి అనిల్ రావిపూడి దర్శకత్వం వహించారు. 'సైంధవ్' రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది. ప్రముఖ నటీనటులు, అత్యున్నత సాంకేతిక నిపుణులు ఈ చిత్రం కోసం పని చేస్తున్నారు.

నవాజుద్దీన్ సిద్దిఖీ కీలక పాత్ర పోషిస్తున్న ఈ సినిమా అన్ని దక్షిణాది భాషలతో పాటు హిందీలోనూ విడుదల కానుంది. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం : శైలేష్ కొలను, సంగీతం: సంతోష్ నారాయణన్, సహ నిర్మాత: కిషోర్ తాళ్లూరు, డీవోపీ: ఎస్.మణికందన్, సంగీతం: సంతోష్ నారాయణ్, ఎడిటర్: గ్యారీ బిహెచ్, ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా.

గాయని సునీత తనయుడు హీరోగా సర్కారు నౌకరి



నిమ్మకాయల ప్రసాద్,సునీత, గంగనమోని శేఖర్, రాఘవేంద్రరావు, రామ్

దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు నిర్మాతగా ఆర్.కె టెలీ షో ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్ పై గంగనమోని శేఖర్ దర్శకత్వంలో 'సర్కారు నౌకరి' అనే నూతన చిత్ర ప్రారంభోత్సవ పూజా కార్యక్రమాలను సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.

గాయని సునీత తనయుడు ఆకాష్ హీరోగా, నూతన నటి భావనా వళపండల్ హీరోయిన్‌గా ఈ చిత్రం ద్వారా వెండితెరకు పరిచయమవుతున్నారు. జీ స్టూడియోస్ నిర్మాత ప్రసాద్ నిమ్మకాయల కెమెరా స్విచ్చాన్ చేయగా,మ్యాంగో మీడియా అధినేత రామ్ వీరపనేని గౌరవ దర్శకత్వం వహించారు. దర్శకేంద్రుడు దేవుడి పటాలపై క్లాప్ నిచ్చారు.అనంతరం హీరో,హీరోయిన్లపై తీసిన తొలిషాట్‌కు కె.రాఘవేంద్రరావు దర్శకత్వం వహించగా, గాయని సునీత కెమెరా స్విచ్చాన్ చేశారు. ఫిబ్రవరి 6 నుంచి నిరవధికంగా షూటింగ్ జరుపుకోనున్న ఈ చిత్రంలో తనికెళ్ల భరణి, సూర్య సాయి శ్రీనివాస్ వడ్లమాని, మణిచందన, రాజేశ్వరి ముళ్లపూడి, రమ్య పొందూరి, త్రినాథ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి మ్యూజిక్ : శాండిల్య, ఆర్ట్ డైరెక్టర్ : రవి, సినిమాటోగ్రఫీ,రచన,దర్శకత్వం : గంగనమోని శేఖర్.

బాలీవుడ్ సినిమాలో కరీంనగర్ కుర్రాడు

పూణే ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందిన కొంతమంది విద్యార్థులు కలిసి ఫ్రెండ్స్ అండ్ ఫిలిమ్స్ పతాకంపై హిందీ, తెలుగులో 'కాలా బార్ బేరియన్ చాప్టర్ 1' అనే చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రంలో విలన్‌గా నటనకు మంచి స్కోప్ ఉన్న పాత్రలో కరీంనగర్‌కు చెందిన ప్రజ్ఞన్ నటించారు. చైల్డ్ ఆర్టిస్ట్‌గా ఆయన నాలుగైదు చిత్రాల్లో నటించారు. ఈ చిత్ర పోస్టర్, ట్రైలర్ లాంచ్ ఇటీవల ఫిల్మ్‌ఛాంబర్‌లో జరిగింది. దర్శకుడు ఎన్.శంకర్ ట్రైలర్‌ను విడుదల చేశారు. తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్, తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి ప్రధాన కార్యదర్శి ప్రసన్న కుమార్ సినిమా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజ్ఞన్ మాట్లాడుతూ, 'ఈ సినిమాలో నేను ఒక సైకో, మల్టీ పర్సనాలిటీ, నెక్రోఫిలియక్ ఇలా చాలా వేరియషన్స్ ఉన్న పాత్రల్లో నటించి చిత్ర యూనిట్‌ను మెప్పించాను. దర్శకుడు జింటో చాకో శామ్యూల్ సినిమాను చక్కగా తీర్చిదిద్దారు. ఈ చిత్రాన్ని త్వరలో తెలుగులో కూడా విడుదల చేస్తున్నాం. ఈ చిత్రాన్ని ఎస్.ఆర్.ఆర్ ప్రొడక్షన్స్ అధినేత పరుపాటి శ్రీనివాస రెడ్డి తెలుగులో విడుదల చేయనున్నారు' అని అన్నారు.



ప్రజ్ఞన్

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

హెచ్‌సియులో ఉద్రిక్తత

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బిబిసి డాక్యుమెంటరీ ప్రదర్శన
- కాశ్మీర్ ఫైల్స్ ప్రదర్శనకు ఏబివిపి యత్నం



హైదరాబాద్ : ఏబివిపి విద్యార్థి సంఘం కవ్వింపు చర్యలతో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సియు)లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గురువారం గణతంత్ర దినోత్సవం రోజున ఏబివిపి నాయకులు వర్సిటీ యాజమాన్యం అనుమతి లేకుండా క్యాంపస్‌లో కశ్మీర్ ఫైల్స్ సినిమా ప్రదర్శనకు ప్రయత్నించడంతో ఎస్ఎఫ్ఐ నాయకులు, పలువురు విద్యార్థులు అభ్యంతరం తెలిపారు. దీంతో క్యాంపస్‌లో గందరగోళం నెలకొంది. హెచ్‌సియు వైస్ ఛాన్సలర్ మెతకవైఖరి కారణంగానే ఏబివిపి నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థులు క్యాంపస్‌లో నిరసనకు దిగారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు వర్సిటీ ప్రధాన గేటు ముందు కూర్చొని విసికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అప్ అప్ సోషలిజం..డౌన్ డౌన్ క్యాపిటలిజం..అంటూ నినదించారు. కాగా, బుధవారం రాత్రి క్యాంపస్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రధాని మోడీపై బిబిసి రూపొందించిన 'ఇండియా - ది మోడీ క్వశ్చన్' డాక్యుమెంటరీని ప్రదర్శించారు. చలిలో సైతం పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరై తిలకించారు. తాజా పరిణామాల నేపథ్యంలో విద్యార్థి సంఘాల నేతలు పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇడి అధికారాలు పరిమితమే

- ఢిల్లీ హైకోర్టు



న్యూఢిల్లీ: ఆర్థిక నేరాల దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అధికారాలపై ఢిల్లీ హైకోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. ఇడికి పరిమితమైన అధికారాలు మాత్రమే ఉన్నాయని, ఇడి అధికారాలు అపరిమితమేమీ కాదని కోర్టు గుర్తుచేసింది. మనీలాండరింగ్ కేసులను మాత్రమే ఇడి విచారించాలని ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యానించింది. ప్రతీదాంట్లో ఇడి జోక్యం తగదని పేర్కొంది. సెక్షన్ 3 నేరాలను మాత్రమే పరిశోధించడానికి పిఎంఎల్ ఇడి అధికారం ఇచ్చిందని, ప్రతి దాంట్లో ఇడి జోక్యం తగదని ఢిల్లీ హైకోర్టు హితవు పలికింది. విచారణ సందర్భంగా వేరే నేరాలు వెలుగులోకి వస్తే వాటిని సంబంధిత దర్యాప్తు సంస్థలు మాత్రమే విచారించాలని ఢిల్లీ హైకోర్టు సూచించింది. ఛత్తీస్‌గఢ్‌లోని కోల్‌బ్లాక్‌ల కేటాయింపునకు సంబంధించిన కేసులో ఢిల్లీ హైకోర్టు తీర్పును వెల్లడించడం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది.

మేడారంలో
సందర్శకుల సందడి



నవతెలంగాణ- తాడ్వాయి

ములుగు జిల్లా మేడారంలో సమ్మక్క-సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు వనదేవతలకు గురువారం సందర్శకులు ప్రత్యేక మొక్కులు చెల్లించారు. జంపన్న వాగు వద్ద పుణ్య స్నానాలాచరించి, కళ్యాణ కట్ట వద్ద తలనీనాలు సమర్పించారు. గద్దెల వద్దకు చేరుకుని వనదేవతలకు ఇష్టమైన పసుపు, కుంకుమ, చీరే సారే సమర్పించి ప్రత్యేక మొక్కులు చెల్లించారు. తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా, సరిహద్దు రాష్ట్రాల నుంచి కూడా సందర్శకులు అధిక సంఖ్యలో భారీగా తరలివచ్చారు. వీరికి ఎండోమెంట్ ఈవో రాజేంద్రం ఆధ్వర్యంలో ఎండోమెంట్ అధికారులు, పూజార్ల సంఘం అధ్యక్షులు సిద్ధబోయిన జగ్గారావు ఆధ్వర్యంలో పూజారులు సకల సౌకర్యాలు కల్పించారు. వనదేవతలను దర్శించుకున్న అనంతరం బయట చెట్ల కింద విడిది చేసి సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం వారి గ్రామాలకు తిరుగు ప్రయాణమయ్యారు. పూజారులు కొక్కర కృష్ణయ్య, సిద్ధబోయిన రమేష్, మునీందర్, లక్ష్మణరావు, అరుణ్, కాక సారయ్య, కాక కిరణ్, ఎండోమెంట్ అధికారులు క్రాంతి, రాజేశ్వర్, రమాదేవి, జగదీశ్వర్, బాలకృష్ణ మధు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల జీవితాల్లో
వెలుగులు నిండాలి

- ద.మ.రైల్వే మహిళా సంక్షేమ సంస్థ ఉపాధ్యక్షురాలు పీ శ్రీలత

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దివ్యాంగ విద్యార్థులు అందుబాటులో ఉన్న అన్ని సౌకర్యాలు వినియోగించుకొని జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని దక్షిణ మధ్య రైల్వే మహిళా సంక్షేమ సంస్థ ఉపాధ్యక్షురాలు పీ శ్రీలత అన్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా చిలకలగూడలోని విద్యావిహార్ హైస్కూల్, మెట్టుగూడలోని ఆకాంక్ష దివ్యాంగుల పాఠశాలల్లో ఆమె జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, మాట్లాడారు. విద్యార్థులు విద్యా నైపుణ్యాలు, క్రీడలు మరియు సాంస్కృతిక అంశాల్లో ప్రతిభను పెంపొందించుకోవాలని సూచించారు. 1974లో ఏర్పాటైన విద్యావిహార్ పాఠశాల 1997-98లో ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయబడిందనీ, దీనిలో ఎల్‌కేజీ నుంచి 10వ తరగతి వరకు 510 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. అలాగే రైల్వే పేరెంట్స్ అసోసియేషన్ సహకారంతో రైల్వే కుటుంబాలలోని దివ్యాంగుల పిల్లల కోసం ఆకాంక్ష పాఠశాల నడపబడుతుందనీ, దీనిలో 60 మంది విద్యార్థులకు విద్యతోపాటు ప్రీ ఒకేషనల్ ట్రైనింగ్ కూడా ఇస్తున్నట్టు వివరించారు. అనంతరం సంస్థ కార్యవర్గ సభ్యులతో కలిసి లాలాగూడలోని సెంట్రల్ రైల్వే ఆసుపత్రిలో వార్డుల్లోని ఇన్‌పేషెంట్లకు ఉపయోగపడే ఉపకరణాలు, పిల్లల వార్డులో చిన్నారులకు ఆట బొమ్మలను పంపిణీ చేశారు.

పోలీసు శాఖలో ఎన్నికల బదిలీలు షురు

- రాష్ట్ర చరిత్రలో ఇప్పటికే 91 మంది ఉన్నతాధికారుల బదిలీ
- మరోవిడతలో ఇన్‌స్పెక్టర్ నుంచి అదనపు ఎస్పీ స్థాయి వరకు
- పోలీసు శాఖలో సాగుతున్న కసరత్తు?

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి : రాష్ట్ర పోలీసు శాఖ చరిత్రలో ఒకేసారి 91 మంది పోలీసు ఉన్నతాధికారులను బదిలీ చేసిన ప్రభుత్వం మరోవిడతలో ఇదే స్థాయిలో బదిలీలకు రంగం సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది. ఈ ఏడాది చివరలోనే షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం పోలీసు శాఖలో జరిగిన బదిలీలు ఎన్నికల బదిలీలుగానే వినిపిస్తున్నది. తాజాగా జరిగిన ఉన్నతాధికారుల బదిలీల్లో 51 మంది వరకు ఐపీఎస్ అధికారులు కాగా మరో 40 మంది నాన్‌కేడర్ ఎస్పీ స్థాయి అధికారులు ఉన్నారు. ముఖ్యంగా, అదనపు ఎస్పీ స్థాయి నుంచి డీఐజీ స్థాయి అధికారుల వరకు స్థాన చలనం కలిగిన వారిలో ఉన్నారు. కొందరు అధికారులను ఏడాదిన్నర గడవక ముందే.. వారు ప్రస్తుతం ఉన్న పోస్టుల నుంచి బదిలీ అయ్యారు. కాగా, మరికొందరు అధికారులకు ప్రభుత్వం తమ ఇష్టపూర్వకంగా కొన్ని కీలకమైన పోస్టులను కట్టబెట్టినట్టుగా తెలుస్తున్నది. అందులో రెండు కమిషనర్ పోస్టులు ఉండగా.. మరో 8 వరకు జిల్లాల ఎస్పీ పోస్టులు ఉన్నాయి. ముఖ్యంగా, ఎన్నికలు తరుముకొస్తున్న వేళ రాష్ట్ర పోలీసు శాఖలోని కొన్ని విభాగాల్లో బదిలీలు జరపాల్సిన అవసరం ఉన్నదని గత డీజీపీ మహేందర్‌రెడ్డి హయాంలోనే చాలా వరకు కసరత్తు పూర్తి చేసినట్టు తెలుస్తున్నది. కొత్త డీజీపీ అంజనీకుమార్ వచ్చాక మరికొన్ని జిల్లాల పోస్టులకు సంబంధించి చర్చించి నిర్ణయాలు తీసుకున్నట్టు తెలుస్తున్నది. సైబర్‌క్రైమ్, యాంటీ నార్కోటిక్స్, విజిలెన్స్, సీఐడీ, ఇంటెలిజెన్స్, గ్రే హౌండ్స్ విభాగాలలో పోలీసు ఉన్నతాధికారులు సూచించిన అధికారులకు పోస్టింగ్‌లు ఇచ్చిన ప్రభుత్వం కమిషనరేట్లు, జిల్లాలలో తమకు అనుకూలురైన అధికారులకు పోస్టింగ్‌లను కట్టబెట్టినట్టుగా తెలుస్తున్నది. ముఖ్యంగా కొన్ని జిల్లాల్లో అధికార పార్టీకి చెందిన కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు తాము సూచించిన అధికారులకే పోస్టింగ్‌లు వచ్చేలా చూసుకున్నారని పోలీసు శాఖలో ఊహాగానాలు సాగుతున్నాయి. కొందరు అధికారులకు ఎప్పటిలాగానే తాము కోరుకున్న లా అండ్ ఆర్డర్ పోస్టింగ్‌లు దక్కాయనీ, తమ లాంటి వారికి అంతగా ప్రాధాన్యత లేని పోస్టింగ్‌లే వచ్చాయని కొందరు ఎస్పీ స్థాయి అధికారులు చిర్రుబుర్రులాడుతున్నట్టు తెలిసింది.

ఇటీవలనే ఎస్పీ స్థాయి నుంచి డీజీపీ స్థాయి వరకు 23 మంది ఐపీఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసిన విషయం విదితమే. తాజాగా 91 మంది ఉన్నతాధికారులను బదిలీ చేసిన ప్రభుత్వం త్వరలోనే మరికొందరు ఐపీఎస్ అధికారులను అవకాశం ఉన్నట్టు తెలిసింది. దీనితో పాటు మలివిడతలో ఇన్‌స్పెక్టర్ స్థాయి మొదలుకొని అదనపు ఎస్పీ స్థాయి అధికారుల బదిలీలు జరపడానికి అధికారులు రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. ఒక విధంగా చెప్పాలంటే పోలీసు శాఖలో బదిలీల వేడి రాజుకోవడంతో కొందరు అధికారులు తమకు అనుకూలమైన పోస్టింగ్‌ల కోసం తెర వెనకగా ముమ్మరంగా ప్రయత్నాలు చేసుకుంటున్నట్టు తెలిసింది.

టీఎస్ఎంసీకి ఎన్నికలు నిర్వహించకుంటే వైద్యగర్జన తప్పదు

- డాక్టర్ల సంఘాల హెచ్చరిక

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ (టీఎస్ఎంసీ)కి ఎన్నికలు నిర్వహించకపోతే హైదరాబాద్ వైద్యగర్జన నిర్వహిస్తామని డాక్టర్ల సంఘాలు హెచ్చరించాయి. తెలంగాణ డాక్టర్స్ ఫెడరేషన్ (టీడీఎఫ్) ఆధ్వర్యంలో టీఎస్ఎంసీ ఎన్నికలు, నకిలీ వైద్యం నుంచి ప్రజారోగ్య రంగాన్ని పరిరక్షించుకోవడం, బలోపేతం చేయడం అనే అంశంపై నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ), హెల్త్ కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్ఆర్ డీఏ), తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజూడా) నాయకులు పాల్గొన్నారు. టీడీఎఫ్ అధ్యక్షులు డాక్టర్ అన్వేష్ మాట్లాడుతూ నిర్దేశించిన సమయంలోపు ఎన్నికలు నిర్వహించకుంటే వైద్య గ్రాడ్యుయేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, ప్రాక్టీసింగ్ డాక్టర్లతో వైద్య గర్జన నిర్వహిస్తామని హెచ్చరించారు. హెచ్ఆర్‌డీఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, తక్షణం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హెచ్ఆర్‌డీఏ అధ్యక్షులు డాక్టర్ మహేశ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో నకిలీ వైద్యం నాటుసారా మాదిరిగా తయారైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రులు, డాక్టర్లు రోగుల నుంచి వసూలు చేస్తున్న బిల్లుల నుంచి 30 నుంచి 70 శాతం సిఫారసు చేసిన నకిలీలకు చెల్లిస్తుండటంతో పేద రోగులపై ఆర్థిక భారం పెరగడానికి కారణమన్నారు. 12 ఏండ్ల నుంచి ఎన్నికలు నిర్వహించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ బీ.ఎన్.రావు మాట్లాడుతూ నకిలీలను ప్రోత్సహించడం మానుకోవాలని డాక్టర్లకు హితవు పలికారు. నకిలీలకు పునాది ఇక్కడే ఉందని తెలిపారు. వైద్యవృత్తిని పరిరక్షించుకునేందుకు డాక్టర్లు స్వీయ నియంత్రణ పాటించాలని సూచించారు. నకిలీలకు రాజకీయ నాయకులు, రాజకీయ పార్టీల నుంచి సహకారం లభిస్తున్నదని తెలిపారు. టీజూడా ప్రతినిధులు డాక్టర్ కౌశిక్, డాక్టర్ రాహుల్, డాక్టర్ కర్ణిణి మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు ప్రతి వైద్య విద్యార్థిని కదలిస్తామని తెలిపారు. టీడీఎఫ్ కన్వీనర్ డాక్టర్ విజయేందర్ మాట్లాడుతూ భారత ప్రజారోగ్య ప్రమాణాల మేరకు పెరిగిన జనాభాకు తగినట్టు మెడికల్ సీట్లను, ఆస్పత్రులను పెంచాలని కోరారు. అదే సమయంలో బోధన, బోధనేతర ఆస్పత్రుల్లో శాశ్వత ప్రాతిపదికన నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. టీఎస్ఎంసీ ఎన్నికల కోసం హెచ్ఆర్‌డీఏ చేస్తున్న పోరాటాన్ని ఆయా సంఘాల నాయకులు అభినందించారు.

సంబంధిత అధికారులకు వినతిపత్రాలను సమర్పించాలనీ, అప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన లేకపోతే ఫిబ్రవరి మొదటి వారంలో హైదరాబాద్‌లో మెడికోల సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవాలని తీర్మానించారు.

ప్రజాస్వామ్యానికి చీడ...గవర్నర్ వ్యవస్థ

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని విమర్శ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

గవర్నర్ వ్యవస్థ ప్రజాస్వామ్యానికి పట్టిన చీడపురుగు లాంటిదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆ వ్యవస్థను రద్దు చేయాలని తాము పోరాటం చేస్తున్న నేపథ్యంలో గవర్నర్ ఆహ్వానించిన 'ఎట్ హోమ్' కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్టు తెలిపారు. గురువారంనాడిక్కడి సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమకు ఇష్టం లేని రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి గవర్నర్ వ్యవస్థ ఒక సాధనంగా ఉపయోగపడుతోందని వివర్శించారు. తమిళనాడు, కేరళ, పంజాబ్, మహారాష్ట్ర, ఢిల్లీల్లో గవర్నర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వాలను కూల్చివేసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. గవర్నర్ ద్వారా ఏదో పేరుతో అలజడులు సృష్టించి, ప్రధాన సమస్యలను పక్కదారి పట్టించి, పార్లమెంట్ ఎన్నికల వరకు ఆయా రాష్ట్రాల్లో ప్రభుత్వాలను రద్దు చేసేందుకు కేంద్రం కుట్ర చేస్తోందన్నారు. హైదరాబాద్ అబ్దుల్లాపూర్‌మెట్‌లో భూ కబ్జా ప్రయత్నాన్ని అడ్డుకుని, భూ పోరాటం చేస్తే, తనతో పాటు మరో 21 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారన్నారు. భూదాన్ భూమి కబ్జా కాకుండా పేదలకు దక్కేందుకు తాము ప్రయత్నిస్తే, తామేదో ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర పన్నినట్టుగా, తుపాకులు పట్టుకున్నట్టుగా పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడం అప్రజాస్వామికం, నిరంకుశత్వమని అన్నారు.

ఇలాంటి కేసులకు భయపడేది లేదన్నారు. వరంగల్, హన్మకొండ,సంగారెడ్డి, భూపాల్ ఖమ్మం, కొత్తగూడెం, ఇండ్ల స్థలాలు, పోడుభూముల సమస్యలపై పోరాటం చేస్తున్నామనీ, ప్రజా సమస్యల పరిష్కారంలో వెనుకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అర్థంలేని మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. వామపక్ష పార్టీలు ప్రభుత్వ పాపాలను భరించాలని రేవంత్ చేసిన వ్యాఖ్యలను తప్పుపట్టారు. భూపోరాటాల్లో పోలీసులు తమపై కేసులు నమోదు చేశారనీ, వాటిలో కాంగ్రెస్ భాగస్వామ్యాన్ని తీసుకుంటుందా... అని ప్రశ్నించారు. తాము టీఆర్ఎస్‌కు కొన్ని అంశాల్లో మాత్రమే మద్దతు ఇచ్చామని స్పష్టం చేశారు. సమావేశంలో చాడ వెంకటరెడ్డి, పశ్యపద్మ పాల్గొన్నారు.

కుల, మతాంతర వివాహాల సంఖ్య పెరగాలి

- రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మెన్ జస్టిస్ జి.చంద్రయ్య



నవతెలంగాణ - అడిక్ మెట్

కుల మతాలకతీతంగా సమ సమాజం ఏర్పడాలంటే కులాంతర, మతాంతర వివాహాలు మరింత పెరగాలని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మెన్ జస్టిస్ డాక్టర్ జి.చంద్రయ్య అన్నారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద గురువారం కుల నిర్మూలన సంఘం అధ్యక్షులు ఎండి వహీద్ అధ్యక్షతన కులాంతర మతాంతర వివాహితుల మేళా 51వ వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అంబేద్కర్ నాయకత్వంలో అమలులోకి వచ్చిన భారత రాజ్యాంగం అణగారిన వర్గాలకు కొత్త వెలుగులను ప్రసాదించిందన్నారు. అంటరానితనం, ఇతర అన్ని రకాల వివక్షలను రూపుమాపి వారికి హక్కులను, బాధ్యతలను, అవకాశాలను కల్పించిందన్నారు. తద్వారా వ్యక్తి సమానత్వం, సాంఘిక సమానత్వం, సమాన అవకాశాలు అభివృద్ధి, లింగ సమానత్వం దిశగా కొంత సిద్ధించినప్పటికీ చిత్తశుద్ధి లేని ప్రభుత్వాల వల్ల ఆచరణలో పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు. ఈ సమస్యను అధిగమించడానికి 1971లో కుల నిర్మూలన సంఘం ఏర్పడిందని తెలిపారు. కుల నిర్మూలన సంఘం ఏర్పడిన తర్వాత కొన్ని వేల కులాంతర, మతాంతర వివాహాలు, ఎన్నో సభలు, సమావేశాలు నిర్వహించారని తెలిపారు. తత్ఫలితంగా నేడు సమాజంలో కులాంతర వివాహాలు విరివిగా జరుగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం సామాజిక, రాజకీయ పరిస్థితులు కుల, మతాల చుట్టూ తిరుగుతూ మనుషుల మధ్య దూరాన్ని మరింత పెంచుతున్నాయన్నారు. కులాంతర, మతాంతర వివాహం చేసుకుంటున్న వారికి రక్షణ కల్పించేందుకు చట్టం తేవాలన్నారు. వారి ఆర్థిక స్థితిగతుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్నిటిలో కులాంతర, మతాంతర వివాహితులకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా కవి జయరాజ్, ప్రముఖ హేతువాది సుబ్బరాజు, న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు గోవర్ధన్, కుల నిర్మూలన సంఘం సలహాదారులు లక్ష్మీ నాగేశ్వర్, గౌరవాధ్యక్షులు గుత్త జోత్స్న, విజ్ఞానదర్శిని వ్యవస్థాపక అధ్యక్షులు రమేష్, టీపీఎస్‌కే కన్వీనర్ రాములు, మానవ వికాస వేదిక జాతీయ అధ్యక్షుడు సాంబశివరావు, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, సమతా మిషన్ సీఆర్ శేఖర్, కులాంతర మతాంతర వివాహితుల సంఘం ప్రధాన కార్యదర్శి కృష్ణచంద్, కార్యనిర్వాహక కార్యదర్శి బిబిషా పాల్గొన్నారు.

దక్షిణాఫ్రికాలో విద్యుత్ సంక్షోభం !

- భారీగా విద్యుత్ కోతలను నిరసిస్తూ ఆందోళనలు



జోహాన్నెస్‌బర్గ్ : దక్షిణాఫ్రికాలో రికార్డు స్థాయిలో విద్యుత్ కోతలను నిరసిస్తూ ప్రజలు ఆందోళనలు చేపట్టారు. దేశంలో సుదీర్ఘంగా నెలకొన్న ఇంధన సంక్షోభాన్ని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జోహాన్నెస్‌బర్గ్ వీధుల్లో ప్రజలు ప్రదర్శనలు నిర్వహించారు. పాలక ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ ప్రధాన కార్యాలయానికి ప్రదర్శనగా వెళ్లిన వారిలో చాలామంది ప్రధాన ప్రతిపక్ష పార్టీ డెమోక్రటిక్ అలయన్స్ పతాకం రంగు అయిన నీలి రంగులో దుస్తులు ధరించారు. జరిగింది చాలు, ప్రజలకు విద్యుత్ కావాలి అంటూ నినాదాలు చేశారు. విద్యుత్ కోతలతో ఉపాధులు పోతున్నాయని విమర్శించారు. కేప్‌టౌన్‌తో సహా పలు చోట్ల ప్రదర్శనలు జరిగాయి. డిమాండ్‌కు తగినట్లుగా విద్యుత్‌ను ఉత్పత్తి చేయడంలో, కాలం చెల్లిన బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి సదుపాయాల నిర్వహణలో ప్రభుత్వ ఇంధన సంస్థ ఎస్కామ్ విఫలం కావడంతో ఏళ్ల తరబడి దక్షిణాఫ్రికాలో విద్యుత్ సంక్షోభం నెలకొంటూనే వుంది. ఏడాది కాలంగా ఈ విద్యుత్ కోతలు మరింత దారుణంగా తయారయ్యాయి. దాదాపు సగం రోజు విద్యుత్ వుండని పరిస్థితి కూడా నెలకొంటోంది. దేశంలో 90శాతం విద్యుత్ అవసరాలను ఎస్కామ్ తీరుస్తుంది. ఇటీవల విద్యుత్ ఛార్జీల పెంపును ఆమోదించడం పట్ల చాలామంది ఆగ్రహంతో వున్నారు. విద్యుత్ కోతలతో దేశవ్యాప్తంగా వాణిజ్య, పారిశ్రామిక రంగం కుదేలైంది. పాలను నిల్వ చేయలేకపోతున్నామని పాల ఉత్పత్తిదారుల సంస్థ తెలిపింది. ప్రజలు విసిగిపోయారని వారి ఆందోళనను అర్థం చేసుకోగలమని అధ్యక్షుడు సిరిల్ రమాఫొస వ్యాఖ్యానించారు. విద్యుత్ సంక్షోభం దేశాన్ని ధ్వంసం చేస్తోందని అంగీకరిస్తూ, ఒక్కరాత్రిలో పరిష్కారం దొరకదని అన్నారు.

ఎంఎస్‌డిఇ అప్రెంటిస్ అవగాహన వర్క్‌షాప్

హైదరాబాద్ : నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ (ఎంఎస్‌డిఇ) హైదరాబాద్‌లో జాతీయ అప్రెంటిస్ అవగాహన వర్క్‌షాప్‌ను నిర్వహించినట్లు ఆ సంస్థ తెలిపింది. తెలంగాణా రాష్ట్రంలో తొలిసారి ఎన్‌టిఎస్‌ఐ వద్ద నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో ఐటిఐలు, జూనియర్ కాలేజీల్లోని 350 మంది విద్యార్థులు పాల్గొన్నారని ఆ సంస్థ తెలిపింది. అప్రెంటిస్‌షిప్ సంస్కరణలు, శిక్షణల అమలును వేగవంతం చేయడానికి దేశవ్యాప్తంగా 250కంటే ఎక్కువ వర్క్‌షాప్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించింది. తద్వారా సంస్థలు, ఔత్సాహికులు, భాగస్వాముల నడుమ అప్రెంటిస్‌షిప్ సంస్కరణల పట్ల అవగాహన కల్పించనున్నారు. రీజినల్ డైరెక్టొరేట్, స్కిల్ డెవలప్‌మెంట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సంబంధిత ప్రాంతాలలో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొంది.

బాలికలకు సింక్రోనీ స్కాలర్‌షిప్‌లు

హైదరాబాద్ : వెనుకబడిన వర్గాల వారికి.. మరి ముఖ్యంగా చదువుకునే మహిళలలకు మహిళలకు స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నట్లు ఆర్థిక సేవల కంపెనీ సింక్రోనీ తెలిపింది. 'ఎడ్యుకేషన్ యాజ్ యాన్ ఈక్వలైజర్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ కింద సింక్రోనీ ఫౌండేషన్ మద్దతును అందిస్తున్నట్లు పేర్కొంది. స్కాలర్‌షిప్‌లు, మెంటర్‌షిప్స్‌కు రూ.44 లక్షలు (55వేల డాలర్లు) కేటాయించినట్లు తెలిపింది. బాలికా విద్య పట్ల కంపెనీ అధికంగా దష్టి సారించడంతో సింక్రోనీ ప్రస్తుతం 119 మంది విద్యార్థులకు ఈ ప్రోగ్రామ్ ద్వారా మద్దతు అందిస్తుందని తెలిపింది. వీరిలో 88 శాతం మంది మహిళా విద్యార్థులు ఉన్నారని వెల్లడించింది.

పిఎన్‌బి జెండా వేడుక



హైదరాబాద్ : పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) హైదరాబాద్ సర్కిల్ కార్యాలయంలో గురువారం గణతంత్ర వేడుకలను నిర్వహించింది. ఆ బ్యాంక్ సర్కిల్ హెడ్ ఎస్‌విఎస్‌పి రెడ్డి జెండావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, బ్రాంచీల అధికారులు పాల్గొన్నారు.

ఐడిఎఫ్‌సి ఎఎంసి హెడ్ ఈక్విటీస్‌గా మనీష్ గున్వానీ



ముంబయి : ఐడిఎఫ్‌సి ఎస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఐడిఎఫ్‌సి ఎఎంసి) తమ హెడ్ ఈక్విటీస్‌గా మనీష్ గున్వానీని నియమించుకున్నట్లు ప్రకటించింది. ఈ నూతన బాధ్యతలలో మనీష్ ఫండ్ హౌస్ యొక్క ఈక్విటీ ఫండ్ మేనేజ్‌మెంట్ బాధ్యతలను చూడనున్నారని ఆ సంస్థ పేర్కొంది. ఈక్విటీ పరిశోధన, ఫండ్ మేనేజ్‌మెంట్ రంగాలలో దాదాపు 25 సంవత్సరాలకు పైగా అనుభవం కలిగి ఉన్నారు. పలు టాప్ ఎంఎఫ్ కంపెనీల్లో కీలక హోదాల్లో పని చేశారు.

మైలో నుంచి బట్ట డైపర్లు

హైదరాబాద్ : దేశంలో తొలిసారి మైలో బట్ట (క్లాత్) డైపర్లను విడుదల చేసినట్లు ప్రకటించింది. వీటిలో శిశువు శరీరానికి హాని కలిగించే ఎటువంటి హానికర రసాయనాలు ఉండవని ఆ సంస్థ పేర్కొంది. వీటిని చాలా సులభంగా ఉతికి శుభ్రం చేసుకోవడం ద్వారా 300 కంటే ఎక్కువ సార్లు వాడుకోవచ్చని పేర్కొంది. 3 నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లలకు సరిగ్గా సరిపోతాయని, 17 కిలోల బరువున్న పిల్లలకు వరకు ఉపయోగించవచ్చని తెలిపింది. వీటి ధరను రూ.599గా నిర్ణయించింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయని పేర్కొంది.

ఎస్‌బిఐ ఎల్‌హెచ్‌ఒలో గణతంత్ర వేడుకలు



హైదరాబాద్ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) లోకల్ హెడ్ ఆఫీసులో 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆ బ్యాంక్ సిజిఎం అమిత్ జింగ్రాన్ జెండావిష్కరణ చేశారు. స్వాతంత్రయోదుల పోరట ఫలితాలను గుర్తు చేసుకోవాలని జింగ్రాన్ అన్నారు. తెలంగాణలో గొల్కొండ, కాకతీయ కోట, రామప్ప గుడి తదితర చారిత్రక కట్టడాలతో అనేక సంప్రదాయాలను కలిగి ఉందన్నారు. దేశ వ్యాప్తంగా ఎస్‌బిఐకి 22,000 శాఖలు, 50వేల పైగా ఎటిఎం కేంద్రాలు, 70వేల పైగా టచ్ పాయింట్లతో తమ ఖాతాదారులకు సేవలందిస్తుందన్నారు.

ఛత్తీస్‌గడ్ యువతకు నిరుద్యోగ భృతి

రాయపూర్ : తమ రాష్ట్రంలోని యువతకు వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి నిరుద్యోగ భృతిని ఇవ్వనున్నట్లు ఛత్తీస్‌గడ్ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ ప్రకటించారు.బస్తర్ జిల్లా జగదల్‌పూర్‌లోని లాల్‌బాగ్ పరేడ్ మైదానంలో గురువారం గణతంత్రదినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆయన ఈ మేరకు ప్రకటన చేశారు. ప్రతి నెల నిరుద్యోగ భృతిని చెల్లిస్తామని చెప్పిన ఆయన ఎంత మొత్తాన్ని ఇస్తారన్న విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. 2018 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఈ మేరకు హామి ఇచ్చినప్పటికీ వివిధ కారణాల రీత్యా అమలుకు నోచుకోలేదు.

తాజాగా ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటం గమనార్హం. నిరుద్యోగ భృతితో పాటు కార్మికులకు గృహ నిర్మాణ పథకం, మహిళలు, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు కాపాడేందుకు ప్రత్యేక పథకాలను కూడా ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు.

కేరళలో బిసిసి డ్యాకుమెంటరీ ప్రదర్శించిన కాంగ్రెస్

తిరువనంతపురం : ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై బిబిసి డాక్యుమెంటరీని కేరళ కాంగ్రెస్ విభాగం గురువారం ప్రదర్శించింది. రాజధాని తిరువనంతపురంలోని షణ్‌గుముగామ్ బీచ్ వద్ద భారీ తెరపై ఈ డాక్యుమెంటరీని కాంగ్రెస్ నాయకులు ప్రదర్శించారు. భారీ సంఖ్యలో ప్రజలు దీనిని తిలకించారు. గుజరాత్ 2002 అలర్లకు మోడీదే ప్రధాన బాధ్యత అని పేర్కొంటూ బిబిసి రెండు భాగాలుగా డాక్యుమెంటరీని ప్రసారం చేసిన సంగతి తెలిసిందే. ఈ రెండో భాగం బుధవారమే బిబిసి లండన్ ద్వారా ప్రసారమైంది. ఈ డాక్యుమెంటరీని కేంద్రం నిషేధించింది.

ప్రచారం కోసమే ఈ డాక్యుమెంటరీని బిబిసి రూపొందించిందని కేంద్రం ఆరోపించింది. రాహుల్‌గాంధీ జమ్ములో మాట్లాడుతూ కేంద్రం సెన్సార్‌షిప్‌ను ప్రశ్నించారు. 'సత్యం అత్యంత వెలుగుతో ప్రకాశిస్తుంది. సత్యానికి ఎప్పటికైనా బయటకు వచ్చే అలవాటు ఉంది. కాబట్టి ఎన్ని నిషేధాలు విధించినా, అణచివేత చర్యలు చేపట్టినా, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినా.. సత్యాన్ని బయటకు రాకుండా ఆపలేరు' అని రాహుల్ గాంధీ అన్నారు.

9 మంది పాలస్తీనీయుల హత్య

శ్రీ ఇజ్రాయిల్ సైన్యం దురాగతం

వెస్ట్‌బ్యాంక్ : పాలస్తీనాలో ఇజ్రాయిల్ సైన్యం దురాగతాలు ఆగడం లేదు. గురువారం 60 ఏళ్ల మహిళసహా తొమ్మిది మంది పాలస్తీనీయుల్ని దారుణంగా హత్య చేసింది. వెస్ట్‌బ్యాంక్‌లోని జెనిన్ శరణార్థుల శిబిరంపై ఇజ్రాయిల్ సైన్యం జరిపిన కాల్పుల్లో తొమ్మిది మంది పాలస్తీయులు మరణించినట్లు పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. గురువారం శరణార్థుల శిబిరంతోపాటు వెస్ట్‌బ్యాంక్‌లోని ఒక ఆసుపత్రిపై ఇజ్రాయిల్ సైన్యం దాడులు జరిపిందని పేర్కొన్నారు.

ఇజ్రాయిల్ సైన్యం టియర్ గ్యాస్ ప్రయోగించడంతో అనేక మంది రోగులు, బంధువులు ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. సాయుధులు ఉన్నారనే సమాచారంతోనే ఈ దాడులు చేశామని ఇజ్రాయిల్ సైన్యం తన దారుణాన్ని సమర్థించుకుంది. ఇజ్రాయిల్ సైన్యం దాడుల్లో 2023లో ఒక నెల కూడా పూర్తి కాకముందే ఇప్పటి వరకూ 29 మంది మరణించారు.

నవతెలంగాణ

బిజినెస్

ప్రపంచ వృద్ధి 1.9 శాతమే..!

- ఐక్యరాజ్య సమితి అంచనా



వాషింగ్టన్ : ప్రస్తుత ఏడాది 2023లో ప్రపంచ వృద్ధి రేటు 1.9 శాతానికే పరిమితం కావొచ్చని ఐక్య రాజ్య సమితి అంచనా వేసింది. ఉక్రెయిన్-రష్యా ఆందోళనలకు తోడు ఆహారం, ఇంధన సంక్షోభం వృద్ధి రేటును దెబ్బతీయనుందని విశ్లేషించింది. ఆర్థిక అనిశ్చితి చోటు చేసుకోనుందని 'యూఎన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్ అండ్ సోషల్ ఎఫైర్స్' రిపోర్ట్‌లో పేర్కొంది. 2023లో అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల్లోనూ మందగమనం చోటు చేసుకోనుందని తెలిపింది. దీనిపై 178పేజీల రిపోర్టును రూపొందించింది. "అధిక ద్రవ్యోల్బణం, కఠిన ద్రవ్య పరపతి విధానం, పెరిగిన అనిశ్చిత్తుల మధ్య ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగించనుంది." అని యూఎన్ సెక్రెటరీ జనరల్ అంటోనియో గుటెర్రెస్ పేర్కొన్నారు. "ప్రస్తుత ఏడాదిలో గ్లోబల్ వృద్ధి 1.9 శాతంగా ఉండొచ్చు. 2022లో 3 శాతంగా అంచనా వేసింది. ఇటీవలి దశాబ్ద కాలంలో ఇదే అత్యల్ప వృద్ధి రేటు కానుంది. ద్రవ్యోల్బణం క్రమంగా తగ్గుముఖం పట్టి, ఆర్థికంగా ఎదురుగాలి తగ్గడం ప్రారంభిస్తే 2024లో ఇది 2.7 శాతానికి పెరగనున్నదని అంచనా." అని ఈ రిపోర్టు పేర్కొంది. ఇటీవల ప్రపంచ బ్యాంక్ కూడా గ్లోబల్ వృద్ధి రేటు అంచనాలను 3 శాతం నుంచి 1.7 శాతానికి తగ్గించింది. 2022లో 3.2 శాతం వృద్ధి, 2023లో 2.7 శాతం పెరుగుదల ఉండొచ్చని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) అంచనా వేసింది. 2023 కష్టతరమైన సంవత్సరంగా సాగనుందని గత వారం దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక ఫోరంలో ఐఎంఎఫ్ ఎండీ క్రిస్టాలినా జార్జివా పేర్కొన్నారు. ఇదే సమావేశాల్లో ప్రపంచంలో పెరుగుతున్న ఆదాయ అసమానతలను యుఎన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్ అండ్ సోషల్ ఎఫైర్స్ డివిజన్ డైరెక్టర్ శాంతను ముఖర్జీ ఎత్తిచూపారు. "ఈ సంవత్సరం యునైటెడ్ స్టేట్స్, యూరోపియన్ యూనియన్, ఇతర అభివద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలలో వద్ధి బలహీనంగా ఉంది. ఇది మిగిలిన ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసింది. 2023లో అమెరికా వృద్ధి ఏకంగా 0.4 శాతానికి పడిపోనుంది. 2022లో ఇది 1.8 శాతంగా ఉండొచ్చు. అనేక యూరోపియన్ దేశాల వృద్ధి కూడా మందగించనుంది. ఉక్రెయిన్ యుద్ధ పరిణామాలు ద్రవ్యోల్బణ పెరుగుదల, కఠిన ద్రవ్య పరపతి విధానాలు, పడిపోయిన కుటుంబాల ఆదాయం, పెట్టుబడులు వృద్ధి రేటును ఒత్తిడికి గురి చేస్తున్నాయి" అని యూఎన్ రిపోర్ట్ పేర్కొంది.

రెట్టింపైన ఇండియన్ బ్యాంక్ లాభాలు

- ఎన్‌పీఏల్లో భారీ తగ్గుదల

చెన్నయ్ : ప్రభుత్వ రంగంలోని ఇండియన్ బ్యాంక్ లాభాలు రెట్టింపు అయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 102 శాతం వృద్ధితో రూ.1,396 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.690 కోట్ల లాభాలు నమోదు చేసింది. గడిచిన క్యూ3లో ఈ బ్యాంక్ నికర నిరర్థక ఆస్తులు 1 శాతానికి తగ్గడం విశేషం. 2021-22 ఇదే త్రైమాసికంలో 2.7 శాతం ఎన్‌పిఎ చోటు చేసుకుంది. 2022 డిసెంబర్ త్రైమాసికంలో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ)లో పెరుగుదల మెరుగైన ఆర్థిక ఫలితాలకు దోహదం చేసిందని ఇండియన్ బ్యాంక్ ఎండీ, సీఈఓ ఎస్ఎల్ జైన్ పేర్కొన్నారు. వడ్డీయేతర ఆదాయం కూడా మద్దతునిచ్చిందన్నారు. క్రితం క్యూ3లో బ్యాంక్ ఎన్ఐఐ 25 శాతం పెరిగి రూ.5,499 కోట్లుగా చోటు చేసుకుంది.

మరో రెండు టెక్ కంపెనీల్లో ఉద్వాసనలు

- ఐబీఎంలో 3,900 మందిపై వేటు
- ఎస్ఏపీలో 3000 మందికి కోత



న్యూయార్క్/ బెర్లిన్ : టెక్నాలజీ కంపెనీలు ఉద్యోగుల తొలగింపులో దూకుడుగా వ్యవహరిస్తున్నాయి. తాజాగా ఐబీఎం, ఎస్ఏపీ కంపెనీలు వేలాది మంది ఉద్యోగులకు ఉద్వాసనలు పలికాయి. ఐబీఎం 3,900 మందికి కోత పెట్టనుండగా.. ఎస్ఏపీలో 3,000 మందిని ఇంటికి పంపించాలని నిర్ణయించాయి. ఆర్థిక అనిశ్చిత్తుల నేపథ్యంలో వ్యయాలను తగ్గించుకునే పనిలో ఈ చర్యలకు దిగాయి. 2022 అక్టోబరు- డిసెంబరు త్రైమాసికంలో లక్ష్యాలను అందుకోలేకపోయామని, ఆదాయాలు పడిపోయినట్లు ఐబీఎం తెలిపింది. మరోవైపు పెట్టుబడులను నిలిపివేసే కార్యక్రమం కూడా జరుగుతుందని వెల్లడించింది. వ్యయాలను తగ్గించుకోవడం కోసం ఉద్వాసనలు తప్పడం లేదని పేర్కొంది. అయితే కొన్ని కీలక విభాగాల్లో నియామకాలు ఉంటాయని వెల్లడించింది. 2022లో ఐబీఎం 10 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని చేరాలని నిర్దేశించుకోగా.. 9.3 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యింది. నిర్వహణ మూలధన వ్యయాలు అంచనాలను మించడమే ఆదాయం తగ్గడానికి ప్రధాన కారణమని ఐబీఎం పేర్కొంది.

ఎస్ఏపీలో 2.5 శాతం మంది తొలగింపు

జర్మన్ సాఫ్ట్‌వేర్ దిగ్గజం ఎస్ఏపీ(శాప్) ప్రస్తుత ఏడాదిలో 3వేల మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు ప్రకటించింది. ఇది ఆ సంస్థలోని 2.5 శాతం మందికి సమానం. ఈ కంపెనీ సంప్రదాయ, క్లౌడ్ ఆధారిత కంప్యూటింగ్ సేవలను అందిస్తుంది. తమ ప్రధాన వ్యాపారాన్ని బలోపేతానికి వీలుగా చేపడుతున్న పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులను తొలగిస్తున్నట్టు పేర్కొంది. ప్రస్తుతం ఈ కంపెనీలో ప్రపంచ వ్యాప్తంగా 1,20,000 మంది ఉద్యోగులు ఉన్నారు. ఉద్యోగుల తొలగింపునతో దాదాపు రూ.2800 కోట్లు (350 మిలియన్ డాలర్లు) ఆదా అవుతాయని ఆ కంపెనీ అంచనా వేసింది.

ఒలెక్ట్రా గ్రీన్‌టెక్‌కు మెరుగైన ఆదాయం




హైదరాబాద్ : దేశంలోని ప్రముఖ ఎలక్ట్రిక్ మొబిలిటీ కంపెనీ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ మెరుగైన ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23) డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో రూ.248.6 కోట్ల అన్ ఆడిట్ రాబడిని నమోదు చేసినట్లు ఆ కంపెనీ ప్రకటించింది. డిసెంబర్-22తో ముగిసిన ప్రస్తుత తొమ్మిది నెలల కాలంలో ఒలెక్ట్రా ఆదాయం రూ.766.0 కోట్లుగా నమోదయినట్లు పేర్కొంది. ఇంతక్రితం ఏడాది ఇదే తొమ్మిది నెలల కాలంలో నమోదైన ఆదాయం రూ. 317.3 కోట్లతో పోలిస్తే ఈ ఏడాది 141 శాతం పెరిగినట్లు వెల్లడించింది. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో 142 విద్యుత్ బస్సుల సరఫరా వల్ల మెరుగైన వృద్ధిని సాధించినట్లు ఆ కంపెనీ తెలిపింది. ఇంతక్రితం 2021 డిసెంబర్ త్రైమాసికంలో 103 బస్సులను పంపిణీ చేసినట్లు పేర్కొంది. 2021 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో తమ సంస్థ రూ.18.2 కోట్ల నికర లాభాలు ఆర్జించగా.. 2022 డిసెంబర్‌తో ముగిసిన మూడు త్రైమాసికాల్లో రూ.42.9 కోట్ల లాభాన్ని సాధించినట్లు తెలిపింది. క్రితం క్యూ3లో 136 శాతం వృద్ధితో రూ.24.7 కోట్ల లాభాలను గడించినట్లు వెల్లడించింది. "గత కొన్ని త్రైమాసికాలుగా ప్రపంచవ్యాప్తంగా ఇవి మార్కెట్‌లో ఒడిదుడుకులు ఉన్నప్పటికీ, ఒలెక్ట్రా స్థిరమైన రాబడితో పాటు మార్జిన్ వృద్ధి సాధించింది. బలమైన వ్యాపార పనితీరును ప్రదర్శించడం వల్లే ఇది సాధ్యమైంది. రాబోయే రోజుల్లోనూ ఇదే పరపతిని కొనసాగిస్తామనే విశ్వాసం ఉంది. మిగిలిన ఆర్డర్‌లను సకాలంలో సరఫరా చేయడంపైనే దృష్టి పెట్టాలని భావిస్తున్నాము." అని ఒలెక్ట్రా సిఎండి కెవి ప్రదీప్ పేర్కొన్నారు.

అదానీపై ఆరోపణలు వాస్తవమే

రిపోర్టులకు కట్టుబడి ఉన్నాం

- కేసు వేస్తే మేము రెడీ
- హిండెన్‌బర్గ్ రీసెర్చ్ వెల్లడి



న్యూఢిల్లీ : గౌతం అదానీకి చెందిన అదానీ గ్రూపు తన షేర్లలో అవకతవకలకు పాల్పడుతోందని.. ఎకౌంట్స్‌లోనూ మోసాలు చేస్తోందని తాము ఇచ్చిన రిపోర్టులకు కట్టుబడి ఉన్నామని అమెరికాకు చెందిన ప్రముఖ పెట్టుబడుల పరిశోధక సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ స్పష్టం చేసింది. తమ సంస్థపై ద్వేషంతో ఆధారాలు లేకుండా హిండెన్‌బర్గ్ ఆరోపణలు చేసిందని అదానీ గ్రూపు స్టాక్ ఎక్స్చేంజీలు, రెగ్యూలేటరీ సంస్థలకు సమాచారం ఇచ్చింది. హిండెన్‌బర్గ్ రిపోర్టును తప్పుబట్టింది. దీనిపై హిండెన్‌బర్గ్ గురువారం ఘాటుగా స్పందించింది. తాము ఇచ్చిన రిపోర్టు సరైనదని.. లేకపోతే ఆ కంపెనీ చర్యలు తీసుకోవచ్చని స్పష్టం చేసింది. అదానీ గ్రూపు చేతనైతే తమపై కోర్టుకెళ్లాలని సవాలు విసిరింది. తమ సంస్థ అమెరికా నుంచి పనిచేస్తోందని.. కాబట్టి అక్కడ దావా వేసుకోవచ్చని సూచించింది. ఒకవేళ ఈ విషయంలో అదానీ గ్రూప్ కనుక విఫలమైతే తమ వాదనలు సరైనవిగా భావించాలని సవాల్ విసిరింది. అదానీ గ్రూపులో గతంలో పనిచేసిన సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, వేలాది పత్రాలు, ప్రభుత్వ, అంతర్జాతీయ సంస్థల నిఘా నివేదికలు, అదానీ గ్రూపు కంపెనీల శాఖలు ఉన్న 12కు పైగా దేశాలను పర్యటించి ఈ నివేదికను తయారు చేసినట్టు హిండెన్‌బర్గ్ రీసెర్చ్ తెలిపింది. "మా రిపోర్టును విడుదల చేసి 36 గంటలు దాటిన ఒక్క అంశాన్ని కూడా అదానీ గ్రూపు స్పష్టంగా లేవనెత్తలేకపోయింది. మేము సూటిగా 88 ప్రశ్నలు వేశాము. ఇందులో అదానీ గ్రూపు ఏ ఒక్క ప్రశ్నకు ఇప్పటికీ బదులు ఇవ్వలేకపోయింది. రెండు ఏళ్లుగా అనేక పరిశోధనలు చేసి 32,000 పదాలతో 106 పేజీల రిపోర్టును రూపొందించాము. ఇందులో ఏ తప్పు ఉన్న మాపై న్యాయ చర్యలు తీసుకోవచ్చు. అదానీ గ్రూపు మా రిపోర్టును తప్పుబడుతూ చర్యలు తీసుకుంటామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నాము. మేము ఇచ్చిన రిపోర్టుకు కట్టుబడి ఉన్నాము." అని హిండ్‌బర్గ్ రీసెర్చ్ ఓ ప్రకటనలో తెలిపింది. అదానీ గ్రూపు దావా వేస్తే తాము కూడా లీగల్‌గా ఆ కంపెనీ డాక్యూమెంట్లను కోరుతామని స్పష్టం చేసింది. హిండెన్‌బర్గ్ రిపోర్టులోని ప్రధానాంశాలు... "అదానీ గ్రూపు సంస్థల ఛైర్మన్ గౌతమ్ అదానీ, ఆయన కుటుంబ సభ్యులు గడిచిన కొన్ని దశాబ్దాలుగా ఆ కంపెనీ షేర్లను మానిప్యులేషన్ చేస్తుంది. ఎకౌంట్స్‌లో మోసాలకు పాల్పడుతుంది. షేర్ల ధరలను కృత్రిమంగా పెంచింది. పన్ను ఎగవేత, మనీలాండరింగ్ మోసాల కోసం అనేక అడ్డదారులు తొక్కింది. అప్పుల కోసం మోసాలకు పాల్పడింది. కార్పొరేట్ ప్రపంచ చరిత్రలో ఇదో అతిపెద్ద కుట్ర. గౌతమ్ అదానీ నికర సంపద విలువ ప్రస్తుతం 120 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.9.78 లక్షల కోట్లు)గా ఉంది. మూడేళ్ల క్రితం ఇది 20 బిలియన్ డాలర్లు (రూ.1.62 లక్షల కోట్లు)గా ఉండేది. గత మూడేళ్లలోనే తన గ్రూప్‌నకు చెందిన 7 ప్రధాన లిస్టెడ్ కంపెనీల ముఖ విలువను ఎక్కువ చేసి, షేర్ల విలువను కత్రిమంగా పెంచి ఆదానీ మోసానికి పాల్పడ్డారు. ఈ సమయంలో ఆయా కంపెనీల షేర్ విలువ సగటున 819 శాతం పెరిగింది. దీంతో మూడేళ్లలోనే అదానీ సంపద 100 బిలియన్ డాలర్లకు పైగా (రూ. 8.1 లక్షల కోట్లు) పెరిగింది. ఈ ఏడు కంపెనీలు 85 శాతం నష్టాలను నమోదు చేశాయి. ఇవి రెడ్‌జోన్‌లో ఉన్న కంపెనీలు. అయినప్పటికీ.. ఆర్థిక అవకతవకలతో ఆయన ఈ కంపెనీల నష్టాలను బయటపెట్టలేదు. నష్టాలతో ట్రేడ్ అవుతున్న ఆ కంపెనీల వాటాలను తనఖా పెట్టి అదానీ గ్రూప్ భారీగా రుణాలను పొందింది. దీంతో అదానీ కంపెనీ వాటాదార్ల సొమ్మును, గ్రూప్ ఆర్థిక పరిస్థితిని ప్రమాదంలో పడేసినట్టే. అదానీ గ్రూప్ మనీలాండరింగ్, అవినీతి ఆరోపణలకు గానూ భారీగా డబ్బు వెచ్చించింది. అదానీ సోదరుడు వినోద్ అదానీతో పాటు అదానీ కుటుంబ సభ్యులు మారిషస్‌లో 38 డొల్ల కంపెనీలతో పాటు సిప్రస్, యుఎఇ, సింగపూర్, పలు కరేబియన్ దీవుల్లో రెండంకెల సంఖ్యలో దొంగ కంపెనీలను ఏర్పాటు చేశారు. రూ.1.4 లక్షల కోట్ల అవినీతి, మనీలాండరింగ్, పన్ను ఎగవేతకు సంబంధించి అదానీ గ్రూప్ ఇప్పటికే నాలుగు కేసుల్లో ప్రభుత్వ సంస్థల విచారణను ఎదుర్కొంటుంది." అని ఈ రిపోర్టు తెలిపింది.

టీచర్లుగా వర్గీకరించండి

కర్నాటకలో అంగన్వాడీ వర్కర్ల డిమాండ్

- సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనలు
- చలిలో రోడ్ల పైనే మహిళల నిద్ర
- అయినా చలించని ప్రభుత్వం
- డిమాండ్లు నెరవేరే దాకా వెనక్కి తగ్గబోమన్న నిరసనకారులు



బెంగళూరు: తమను టీచర్లుగా వర్గీకరించాలన్న ప్రధాన డిమాండ్‌తో కర్నాటకలోని అంగన్వాడీ కార్యకర్తలు ఆందోళన చేస్తున్నారు. సీఐటీయూ అనుబంధ వర్కర్లు వేలాది మంది ఈ నిరసనల్లో భాగమయ్యారు. ఈనెల 23 నుంచి వారు నిరసనలో ఉన్నారు. బెంగళూరులోని ఫ్రీడమ్ పార్కు వద్ద గత రెండు రోజుల నుంచి తీవ్ర చలిలోనే నిద్రిస్తున్నారు. అయితే మహిళలు చలిలో, అర్ధరాత్రుళ్లు ఇబ్బంది పడుతున్నప్పటికీ.. ప్రభుత్వం నంచి ఎలాంటి స్పందనా రాకపోవటం గమనార్హం.

కోలార్ జిల్లాకు చెందిన సీఐటీయూ మండల అధ్యక్షురాలు సుజాత మాట్లాడుతూ.. " అంగన్వాడీ వర్కర్ల విషయంలో చారిత్రక అన్యాయం కొనసాగుతున్నది. కారణం.. వారిని కార్మికులుగా (వర్కర్లు) గుర్తించటం లేదు. మేము చేసేది నిరవధిక దీక్ష. ప్రభుత్వానికి మేము పది డిమాండ్లు పెట్టాము. మా కుటుంబాలను వదిలి మరి మా లక్ష్యాలను సాధించడానికి ఇక్కడికి వచ్చాము. మమ్మల్ని టీచర్లుగా గుర్తించాలి. గ్రాట్యుటీ చెల్లింపులకు మమ్మల్ని అర్హులు చేయాలి. గౌరవ వేతనాలతో 40 ఏండ్లు పని చేయడానికి మమ్మల్ని మీరు కార్యకర్తలుగా ఎందుకు వర్గీకరించారు?" అని ప్రశ్నించారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణలో తమపై పని భారం పడుతున్నదనీ, వేధింపులను ఎదుర్కోవాల్సి వస్తున్నదని సుజాత అన్నారు. అంగన్వాడీలో పరిమితికి మించి చిన్నారుల సంఖ్య ఉంటున్నదనీ, పుస్తకాల నిర్వహణ, 'పోషణ్' అప్లికేషన్‌లో ఎప్పటికప్పుడు సమాచారాన్ని నమోదు చేయడం వంటివి అదనపు భారాన్ని మోపుతున్నాయని తెలిపారు. ఒక్క గుడ్డుకు రూ. 5 ఇస్తున్నారనీ, మార్కెట్‌కు వెళ్లి గుడ్లను తామే కొనుగోలు చేసి తీసుకురావాల్సి ఉంటుందని.. ఇందుకోసం తమ భర్తలు ఒకరోజు పనిని విడిచిపెట్టుకొని మరీ వెళ్లాల్సి ఉంటుందని చెప్పారు. ఇది ఆరోజు తమ భర్తలకు వచ్చే ఆదాయాన్ని దెబ్బతీస్తున్నదని అంగన్వాడీ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల విధుల్లో భాగంగా తమను బూత్ స్థాయి అధికారులుగా నియమించడం పని భారాన్ని పెంచుతున్నదని అన్నారు. మండల స్థాయి సమావేశాలను అధికారులు ఏర్పాటు చేస్తే అక్కడకు తప్పక వెళ్లాల్సి ఉంటుందనీ, దీనికి హాజరు కావడానికి ఆ రోజు అంగన్వాడీ కేంద్రాలను మూసివేస్తే మానసిక వేధింపులకు గురవుతామని తెలిపారు. " మేము 1500 మందిమి గుల్బర్గా నుంచి వచ్చాము. వేతన సవరణ అనేది మా డిమాండ్‌లలో ఒకటి. ప్రస్తుతం అంగన్వాడీ కార్యకర్తలు నెలకు రూ. 11,500లు, సహాయకులు దాదాపు రూ. 6 వేల వరకు పొందుతున్నారు" అని పుష్పవతి తెలిపారు. " కర్నాటకలో సీఐటీయూ అంగన్వాడీ యూనియన్ 1994లో గుల్బర్గాలో మొదలైందనీ, ఆ సమయంలో అంగన్వాడీ కార్యకర్తలకు నెలకు రూ. 120 వచ్చేదనీ, అయితే యూనియన్ పోరాటాలతో గౌరవ వేతనం పెరిగిందనీ, లేకపోతే అది మరింత తక్కువగా ఉండేదని " అన్నారు.

నూతన విద్యా విధానం (ఎన్ఈపీ) ద్వారా నూతన ప్రీ ప్రైమరీ స్కూళ్లు తెరుచుకుంటాయనీ, దీంతో చివరకు అంగన్వాడీలు తగ్గుతాయని సీఐటీయూ కర్నాటక అధ్యక్షురాలు వరలక్ష్మి అన్నారు. దీనికి బదులు ఎల్‌కేజీ, యూకేజీలను అంగన్వాడీలలో ఏర్పాటు చేయాలనీ, వర్కర్లకు కేవలం ఐసీడీఎస్ కు సంబంధించిన పనులనే అప్పగించాలని తెలిపారు. అలా అయితే వారు ప్రీ ప్రైమరీ విద్యపై చక్కగా శ్రద్ధ పెట్టగలుగుతారని అన్నారు. అంగన్వాడీ కార్యకర్తల హాజరు కూడా సంక్లిష్టంగా ఉన్నదనీ సీఐటీయూ మెమోరాండం పేర్కొన్నది. అలాగే, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆహారాన్ని అంగన్వాడీ కేంద్రాల వద్దే వండేలా ఫుడ్ సరఫరాని వికేంద్రీకరణ చేయాలని వివరించింది. అయితే, తమ డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె విషయంలో వెనక్కి తగ్గేది లేదని ఆందోళనకారులు స్పష్టం చేశారు.

భయపడం..పోరాడుడే..

నిరుపేదలకు ఇండ్ల పట్టాలు వచ్చే వరకు ఉద్యమాలు

- గుడిసెవాసులకు అండగా ఉంటాం
- ప్రజాసంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్ వీరయ్య
- భూపాలపల్లి, చిల్పూర్‌లో గుడిసెల సందర్శన



నవతెలంగాణ-భూపాలపల్లి/స్టేషన్‌ఘన్‌పూర్

రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడి ఎనిమిదేండ్లు గడుస్తున్నప్పటికీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఒక్కటీ నెరవేర్చలేదని, పెద్దోడికి ఒక న్యాయం పేదోడికి ఒక న్యాయమని, నిరుపేదలకు ఇండ్ల పట్టాలు వచ్చేవరకు పోరాడుడే.. అని ప్రజా సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్ వీరయ్య స్పష్టంచేశారు. జయశంకర్-భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పాత ఎర్ర చెరువు శిఖం భూమిలోని సర్వే నెంబర్ 280, 283, 284, 285లలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఇంటి స్థలాల పోరాటం చేపట్టి సుమారు 500మంది బుధవారం గుడిసెలు వేయగా, వారిని గురువారం కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ, సీఐటీయూ రాష్ట్ర నాయకులు మాధవితో కలిసి వీరయ్య పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రతి కుటుంబానికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని అనేక వాగ్దానాలు ఇచ్చినప్పటికీ నేటి వరకు అమలు కాలేదన్నారు. ఇప్పుడు కొత్తగా.. సొంత జాగా ఉండి ఇల్లు నిర్మించుకుంటే రూ.5 లక్షలు ఇస్తామని, తదనందరం రూ.3లక్షలు ఇస్తామంటూ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతున్నదని ఆరోపించారు. నిరుపేదలకు 100 గజాల ప్రభుత్వ భూమిని పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని, రాష్ట్ర వ్యాప్తంగా 50కి పైగా భూపోరాట సెంటర్లలో ఇండ్ల స్థలాల కోసం పోరాటాలు నడుస్తున్నాయని తెలిపారు. గతేడాది నుండి భూపోరాటాలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. గుడిసెలు వేసుకున్న ఈ భూమి.. ప్రభుత్వ అధికారులు శిఖం భూమి అంటూ చెబుతున్నప్పటికీ, ఈ చెరువుకు గండి ఎందుకు కొట్టారో చెప్పాలని ప్రశ్నించారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న పేదలపై అక్రమ కేసులు పెట్టినా, గుడిసెలు కూల్చినా సహించేది లేదని, సీపీఐ(ఎం) వారికి అండగా ఉండి ఇంటిస్థలం దక్కేవరకు పోరాడుతుందని భరోసా ఇచ్చారు. మతోన్మాద బీజేపీని తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నడిపిన గడ్డపై అడుగుపెట్టనీయకుండా అడ్డుకునేందుకు మాత్రమే బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలిచామని తెలిపారు. ప్రజా సమస్యలపై రాజీపడబోమని తెలిపారు. సమస్యలను పరిష్కరించలేని లేనిపక్షంలో ప్రభుత్వంపై ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అంతకు ముందు జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం చిల్పూర్ మండలం రాజవరం గ్రామంలో 79 సర్వే నంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని పోరాడుతున్న గుడిసె వాసులకు మద్దతుగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం చేపట్టిన కార్యక్రమంలో వీరయ్య పాల్గొని మాట్లాడారు. గుడిసెవాసులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యులు కాంపెటి రాజన్న, చెన్నూరి రమేష్,పొలం రాజేందర్, దామెర కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు వ్యకాస జిల్లా కార్యదర్శి ఎదునూరి వెంకట్రాజం, భూ పోరాట కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



రాజ్యాంగాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి. నాగయ్య

నవతెలంగాణ-జనగామ

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ంతో రాజ్యాంగానికి ప్రమాదం పొంచి ఉందని, రాజ్యంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి. నాగయ్య అన్నారు. గురువారం జనగామ జిల్లాలోని లింగాల గణపురం మండలం నెల్లుట్ల- పటేల్‌గూడెం భూ పోరాట కేంద్రాల్లో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని సంక్రాంతి క్రీడోత్సవాల్లో గెలిచిన ఔత్సాహితులు, క్రీడాకారులకు బహుమతుల ప్రదానం చేశారు. సంఘం జిల్లా అధ్యక్షులు సింగారపు రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాగయ్య మాట్లాడారు. రాజ్యాంగం మౌలిక సూత్రాలైన సామ్యవాదం, గణతంత్రం, సౌభ్రాతృత్వం, లౌకికవాదం, సమాఖ్య వ్యవస్థకు కేంద్ర బీజేపీ ప్రభుత్వం తూట్లు పొడుస్తున్నదని విమర్శించారు. ఇందులో భాగంగానే సీఏఏ, జీఎస్టీ లాంటి అనేక కొత్త కొత్త చట్టాలు తీసుకొస్తుం దన్నారు. దేశంలో హిందుత్వ మతపరమైన రాజ్యాంగాన్ని తీసుకొచ్చి మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఆర్ఎస్ఎస్ విధానాలను అమలు చేసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశంలో హత్యలు, లైంగికదాడులు పెరిగిపోయా యన్నారు. రాష్ట్రాల హక్కులను బలవంతంగా గుంజుకుంటున్నారని తెలిపారు. బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలను గవర్నర్ల వ్యవస్థ ద్వారా ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దేశంలోని అన్ని వర్గాల, తరగతుల ప్రజానికానికి రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు సూడి కృష్ణారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సింగారపు రమేష్, ఎదునూరి వెంకట్రాజం, కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తోటి దేవదానం, బొట్ల శేఖర్ నాయకులు గోసంగి శంకరయ్య, లగ్గాల రమేష్, పుల్ల రాజేశ్వరి, గడ్డం రేణుక, మునుగొండ రేణుక, పిడుగు సరిత, బండ శ్రీనివాస్, సురేష్, నల్ల ప్రణయ్, చిరంజీవి, గోసంగి సందీప్, ఉప్పలయ్య, వేల్పుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఐదేండ్లలో 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తే లక్ష్యం

- ఈ ఏడాది 34 వేల కోట్ల రికార్డు టర్నోవర్ దిశగా సింగరేణి
- బొగ్గు రంగంలో స్వయం సవృద్ధి దిశగా భారత్ ముందడుగు : సంస్థ సీఎండీ ఎన్. శ్రీధర్
- సింగరేణి భవన్‌లో ఘనంగా గణతంత్ర దినోత్సవం

నవతెలంగాణ-కోల్‌బెల్ట్



ఆత్మ నిర్భర్ కార్యక్రమంలో భాగంగా సింగరేణి రానున్న ఐదేండ్ల కాలంలో 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పనిచేస్తుందని సంస్థ ఛైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. శ్రీధర్ తెలిపారు. గురువారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. సింగరేణి సంస్థ గతేడాది 26 వేల కోట్ల టర్నోవర్ సాధించిందని, ఈ ఏడాది సుమారు 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తితో రూ.34 వేల కోట్ల టర్నోవర్ సాధించే దిశగా ముందుకు దూసుకుపోతోందని తెలిపారు. దేశంలో ప్రతి ఏడాది 7 నుంచి 10 శాతం విద్యుత్ వినియోగం పెరుగుతోందని దీనికనుగుణంగా బొగ్గుకు కూడా డిమాండ్ పెరుగుతోందన్నారు. సింగరేణి వంటి సంస్థకు ఇదొక సదవకాశమని, దీన్ని దృష్టిలో పెట్టుకుని రానున్న ఐదేండ్లలో పది కొత్త ప్రాజెక్టులను ప్రారంభించడానికి సింగరేణి సంసిద్ధమైంద న్నారు. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా మరో మూడేండ్లలో విదేశీ బొగ్గు దిగుమతులకు స్వస్తి పలకాలని యోచిస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కోల్ ఇండియా, సింగరేణి వంటి ప్రభుత్వ సంస్థలకు 1200 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను నిర్దేశించిందని, వీటితో పాటు కొన్ని ప్రయివేటు సంస్థలకు కూడా కొత్త బొగ్గు బ్లాక్‌లను కేటాయించడం జరిగింద న్నారు. పర్యవసానంగా రానున్న కాలంలో బొగ్గు మార్కెట్లో ప్రయివేటు బొగ్గు ఉత్పత్తిదారులతో కొంత పోటీ నెలకొంటుందని, అయినప్ప టికీ సంస్థ తన పనితీరు, అనుభవం, క్రమ శిక్షణ వల్ల పోటీ మార్కెట్ తట్టుకోగలదని స్పష్టంచేశారు. ప్రతి కార్మికుడు ఉత్పాదకత పైన దృష్టి సారిస్తే, ఉత్పత్తి వ్యయం తగ్గి, తక్కువ ధరకే వినియోగదారుడికి బొగ్గు సరఫరా చేసే అవకాశం ఉంటుందని, తద్వారా పోటీ మార్కెట్‌ను ఎదుర్కోగలమని తెలిపారు. తన వ్యాపార విస్తరణలో భాగంగా సింగరేణి సంస్థ నిర్మించిన 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం కేవలం ఆరేండ్లలోనే అత్యద్భుతమైన పనితీరుతో 91 శాతం ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్)తో దేశంలో నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని, ఇది సింగరేణి పనితీరుకు నిదర్శనమన్నారు. ఈ పనితీరును గుర్తించి మరో 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి సూచించా రని, మరో రెండు నెలల్లో నిర్మాణ పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు. అలాగే సోలార్ విద్యుత్ ఉత్పాదనలో ఇప్పటికే 220 మెగావాట్ల ప్లాంట్లు పూర్తి చేశామని, మరో 80 మెగావాట్ల ప్లాంటులను త్వరలో పూర్తి చేస్తామన్నారు. కార్మిక సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని దేశంలో ఏ ప్రభుత్వ రంగ సంస్థలో లేని అనేక సంక్షేమ కార్యక్రమాలను సింగరేణిలో అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సింగరేణి భవన్‌లో ఉత్తమ అధికారిగా ఎంపికైన సీనియర్ లా ఆఫీసర్ కొలిశెట్టి కౌశల్‌ను, ఉద్యోగిగా ఎంపికైన సెక్యూరిటీ గార్డ్ సి. రామకృష్ణను ఘనంగా సన్మానించారు. అలాగే, విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్య క్రమంలో అడ్వైజర్(మైనింగ్) డి.ఎస్ .ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(కోల్ మూమెంట్) జె.అల్విన్, జీఎం(కో ఆర్డినేషన్) ఎం.సురేశ్, జీఎం(మార్కెటింగ్) కె.సూర్యనారాయణ, అడ్వైజర్(లా) లక్ష్మణ్, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఎస్.భాస్కర్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఈటల లక్ష్యం బీజేపీలో నెరవేరదు: రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఆర్ఎస్ పార్టీ నుంచి బీజేపీలో చేరిన ఈటల రాజేందర్, వివేక్‌తో పాటు కొండా విశ్వేశ్వర్ రెడ్డి బీజేపీ సిద్ధాంతాలను విశ్వసించరని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి తెలిపారు. వారు నమ్మిన సిద్ధాంతంపై నడవాలని సూచించారు. గురువారం గాంధీభవన్‌లో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా ఆయన ముచ్చటించారు. సీఎం కేసీఆర్‌ను గద్దెదించాలన్న లక్ష్యంతో బీజేపీలో చేరిన ఈటల రాజేందర్‌కు, ఆ లక్ష్యం బీజేపీలో నేరవేరడం లేదని అర్థమైందని ఆయన మాటలను బట్టి తెలుస్తుందన్నారు. కేసీఆర్ కోవర్టులతో నిండిన బీజేపీని కాదనీ రాజేందర్ ప్రత్యామ్నాయ మార్గం వెతుక్కోవాల్సిన పరిస్థితి వచ్చిందని అభిప్రాయపడ్డారు. ఈటల పరిస్థితి ముందుకు పోలేక, వెనక్కి రాలేక అన్నట్టుగా ఉందన్నారు.ఈటల వామపక్షవాది అయినా... కేసీఆర్ కుట్రతో రైటిస్ట్ పార్టీలోకి పోయేలా చేశారని తెలిపారు. కేవలం కేసీఆర్‌పై వ్యతిరేకతతో బీజేపీలో చేరిన మిగిలిన నాయకులు కూడా ఆ పార్టీలో సంతృప్తిగా లేరని చెప్పారు. సచివాలయాన్ని కేసీఆర్ జన్మదినాన కాకుండా డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి రోజున ప్రారంభిస్తే బాగుంటుందని సూచించారు.

పొంగులేటితో భట్టి చర్చలు

పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చర్చిస్తున్నారనీ, ఈ మేరకు భట్టికి కాంగ్రెస్ అధిష్టానం బాధ్యతలిచ్చిందని రేవంత్ స్పష్టం చేశారు. హుజూరాబాద్, మునుగోడులలో సందర్భానుసారమే బీజేపీకి ఓట్లు వచ్చాయే తప్ప మిగిలిన సందర్భాల్లో ఓట్లు రావని తెలిపారు. కేంద్రంలో తమ ప్రభుత్వం వచ్చాక పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని కఠినతరం చేస్తామనీ, ఎమ్మెల్యే ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హత వయస్సును 25 నుంచి 21కి తగ్గిస్తామని హామీ ఇచ్చారు.